మంగళవారం
15 జనవరి
2019


పేజీలు 12
సంపుటి 1, సంచిక 297

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



ఉత్కంఠగా కర్ణాటకం

- కన్పించని ముగ్గురు ఎమ్మెల్యేలు
- బీజేపీ చేతుల్లోనే ఎమ్మెల్యేలు: కాంగ్రెస్ ఆరోపణ
- టచ్‌లోనే ఉన్నారు: సీఎం కుమరస్వామి
- మా ఎమ్మెల్యేలనే ప్రలోభపరుస్తున్నారు: బీజేపీ
- సంక్రాంతి తర్వాత కొత్త సర్కారంటూ ప్రచారం



విజయక్రాంతి, బెంగళూరు: కాంగ్రెస్, బీజేపీ మధ్య మళ్లీ 'కర్ణాటకం' మొదలైంది. మధ్యలో ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తన వంతు పాత్ర పోషిస్తున్నారు. ఈ సమయంలో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కన్పించకుండా పోయారు. దీంతో కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ రెండు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఈ పరిణామాలతో కర్ణాటక రాజకీయాలు ఉత్కంఠగా మారిపోయాయి. సంక్రాంతి తరువాత కొత్త సర్కారే ఏర్పాటవుతుందన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది.

ఆది నుంచి కర్ణాటకమే


గతేడాదిలో శాసనసభ ఎన్నికలు జరిగినప్పటి నుంచి కర్ణాటకలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆ ఎన్నికల్లో 104 స్థానాలు గెలిచి పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా.. కాంగ్రెస్ మద్దతుతో జేడీ(ఎస్) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి పదవిలో కుమారస్వామి కూర్చున్నారు. తక్కువ స్థానాలు వచ్చిన జేడీ(ఎస్)కు ముఖ్యమంత్రి పదవి అప్పగించడంతో.. అంసతృప్తి నెలకొన్నా.. పెత్తనం పూర్తిగా తమ చేతుల్లో ఉందన్న భావనతో కాంగ్రెస్ సీనియర్లు సర్దుకొని పోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో కాంగ్రెస్‌పై ముఖ్యమంత్రి కుమారస్వామి పలుమార్లు తన అసంతృప్తి వ్యక్తం చేశారు. కుర్చీపై తాను కూర్చున్నప్పటికీ..అధికారాలు తన చేతుల్లో లేవంటూ ఆయన నిస్సాహాయత వ్యక్తం చేశారు. అయినప్పటికీ.. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారం బీజేపీ చేతుల్లోకి వెళ్లకుండా.. కాంగ్రెస్ జాగ్రత్తలు తీసుకుంటోంది.

వేచి చూస్తున్న బీజేపీ

పెద్ద పార్టీగా నిలిచినా.. అధికారం అందక పోవడంతో బీజేపీ అవకాశం కోసం వేచి చూస్తోంది. సంకీర్ణ ప్రభుత్వంలో చిచ్చు రేగకపోతుందా..? తమకు అవకాశం రాకపోతుందా..? అన్నట్టుగా వ్యవహరిస్తోంది. లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటే నష్టమా..? లాభమా..? అన్న మీమాంశలో బీజేపీ నేతలున్నట్టు తెలుస్తోంది. (తరువాయి 4లో)

శబరిమలలో మకరజ్యోతి దర్శనం

- పులకించిన భక్త జనం
- స్వామి దర్శనానికి పోటెత్తిన అయ్యప్పలు
- ఈ నెల 20న ఆలయం మూసివేత



శబరిమల: కేరళలోని ప్రముఖ శబరిమలలో సోమవారం మకరజ్యోతి దర్శనమిచ్చింది. దీంతో ఆలయానికి పోటెత్తిన అయ్యప్ప భక్తులు దీన్ని చూసి పులకించారు. రెండురోజుల క్రితం పందళం నుంచి బయలుదేరిన అయ్యప్పస్వామి తిరువాభరణాలను సొమవారం 6 గంటలకు శబరిమలలోని పవిత్ర పద్దెనిమిది మెట్ల మీదుగా సన్నిధానానికి చేర్చారు. 4

అంబరమంటే సంక్రాంతి సంబరం

"కదలి వచ్చేను భాగ్యాల కడలిపోలి
మకర సంక్రాంతిలక్ష్మి హేమంతవీధి
మధుర మధురానురాగ సామ్రాజ్యపీఠి
జగము కొలువుండె మకరధ్వజంబునెత్తి"



విజయక్రాంతి, హైదరాబాద్: తెలుగువాళ్ల పెద్దపండుగల్లో సంక్రాంతి ప్రత్యేకతే వేరు.. రంగవల్లుల పండుగ కూడా.. అందమైన ముగ్గులు లేని గడప వెతికానా కనపడదు ఈ పండుగ రోజు.. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన పర్వదినమే మకరసంక్రాంతి.. ఇక ఇక్కడి నుంచి దక్షిణాయణం ముగిసి 5

దిమాక్ ఖరాబ్



పదవుల పందేరానికి కసరత్తులు

- మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం
- స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపికపై కసరత్తు చేస్తున్న కేసీఆర్
- ఆ తర్వాత పార్లమెంటరీ కార్యదర్శుల నియామకం
- శాసనసభాపరంగా హోదా ఇచ్చే యోచనలో ప్రభుత్వం



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పదవుల పంపిణీకి రంగం సిద్ధం అవుతోంది. ప్రతి జిల్లాకు ఒక కేబినెట్ ర్యాంకు పదవి దక్కే విధంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు కార్యాచరణను రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ పదవుల పందేరాన్ని ప్రారంభించి విడతల వారీగా భర్తీ చెయ్యాలని ఆయన భావిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొంత మంది మంత్రుల నియామకంతో పాటు, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్ పదవులను భర్తీ చేస్తారని తెలిసింది. దీనిలోభాగంగా మొదటి దశలో రాష్ట్ర మంత్రి వర్గాన్ని పాక్షికంగా ఏర్పాటు చేసి, పార్లమెంటు ఎన్నికలు అనంతరం (తరువాయి 4లో)

సీపీకి షర్మిల ఫిర్యాదు



- సినీహీరో ప్రభాస్‌తో సంబంధాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- ప్రచారం వెనుక టీడీపీ నేతలున్నారంటూ ఫిర్యాదు

4

ఆర్టీసీ 6044 ప్రత్యేక సర్వీసులు



విజయక్రాంతి, హైదరాబాద్: సంక్రాంతి పండుగకు ఆర్టీసీ 6044 ప్రత్యేక సర్వీసులను నడిపించింది. ఈ నెల 10 నుంచి 14 వరకూ పండుగకు వెళ్లే ప్రయాణికుల కోసం 5252 ప్రత్యేక సర్వీసులు నడిస్తామని గతంలోనే ఆర్టీసీ ప్రకటించింది. అయితే ప్రకటించిన సర్వీసుల కంటే ఎక్కువగా నడిపించింది. రెగ్యులర్ సర్వీసులు 3500తో పాటు ప్రత్యేక సర్వీసులు 6044 నడిపించినట్టు తెలిపింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 1779, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 4265 సర్వీసులు నడిపించింది. అయితే ఇన్ని బస్సులు నడిపినప్పటికీ బస్సులు చాలక పండగ సందర్భంగా ఊర్లకు పోవాల్సిన వేలాది మంది పలు ఇబ్బందులు పడ్డారు.



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః


శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:49
సూర్యాస్తమయం	: సా. 06:001
పక్షము	: శుక్ల పక్షం
తిథి	: నవమి 24.44
నక్షత్రం	: అశ్వని 13.56
యోగం	: సిద్ధ 06:53
కరణం	: భాలవ 12:47 కౌలవ 24:44
రాహుకాలం	: సా. 03:11, 04:34
యమగండం	: ఉ. 09:39, మ. 11:02
వర్జ్యం	: ఉ. 09:46, 11:26, రా.11:39, తె.01:16
అమృతకాలం	: లేదు





సూక్తి సుధ



కళ్లకి రెప్పలు ఉన్నట్లే పనికి విశ్రాంతి ఉండాలి.

-రవీంద్రనాథ్ టాగూర్



సంక్రాంతి శోభ

సంక్రాంతి అనగా సం– అంటే విశేషమైన, మిక్కిలి అనీ, క్రాంతి అంటే అభ్యుదయం' అని అర్థం. 'విశేషంగా ప్రజలకు, ప్రకృతికి అభ్యుదయం' కలిగించే పర్వం ఇది. 'సంక్రామంతి సంచరం తృనేన సంక్రమః' అని అమరం చెప్తున్నది. సంక్రమణం, సంక్రమం, సంక్రామం, సంక్రాతం, సంక్రాంతి, సంక్రమించడం ఇవన్నీ సమానార్థన్నే ఇస్తాయి. సంక్రాంతికి నడవడం, కూడుకోవడం, కలవడం, ఏకమవడం, ప్రవేశించడం, ప్రాప్తించడం, దాటడం అనే అర్థాలు. ఇవన్నీ 'యోగం' అనే అర్థానిస్తాయి. ప్రకృతికి – మనిషికి గల అనుసంధానాన్ని తెలిపేది సంక్రాంతి పండుగ.

సంక్రాంతి–ఉత్క్రాంతి

భారతీయ సంస్కృతి చాలా విశిష్టమైంది. మన సంస్కృతిని మన ఆచార సంప్రదాయాలతో పాటు మన పండుగలు తెలియచేస్తాయి. నిరంతర జీవనయానంలో అలసిపోయిన మనిషి మనస్సుకు ఆనందోత్సాహాలు కల్గించి, మానవుల ఆలోచనలు దైవత్వం వైపు నడిపించేవి రోజులే పండుగ రోజులు. కేవలం వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని గాక, మానవుని అన్ని అవసరాలను గమనిస్తూ ప్రకృతిలో జరిగే మార్పుల్ని పరిగణనలోకి తీసుకొని మానవాళిని మంచి మార్గంలో నడిపించే విశిష్టభావనగా మన పండుగలు ఏర్పరచబడ్డాయి.

సూర్యుని మకరరాశి ప్రవేశంతో ప్రారంభం అయ్యే సంక్రాంతి, కొత్త ధాన్యాలు, రైతుల సంబరాలు, ఆడపడుచు గొబ్బిపాటలు, యువకుల కోలాటాలు, కోళ్లపందాలు, హరిదాసుల కీర్తనలు, ఆడపడుచుల అలంకారాలు, గోమాతల పూజలు కనుమ పండుగతో ముగుస్తాయి. మనం సంవత్సరమంతా కష్టపడి పండించిన పంటలు ఇంటికి చేరి, కాసులు ఘల్లుమని, రైతు గుండెల్లో సంతోషం ఇల్లుమంటుంది. రోగాలు పోయి అందరికి శుభయోగాలు వస్తాయి. చక్కని పాటలతో కోమలుల మనస్సులు ఆనందంతో వెల్లివిరిస్తాయి.

'సంక్రమణం' అనగా...

సంక్రాంతి పండుగను గురించి వివరిస్తూ – కాణిమహారాజ్ – 'సంక్రాంతి అనగా సమక్రాంతి. అందరిలో ప్రాప్తించే ఉత్క్రాంతి లేదా మంచి మార్పు. ఈ ఉత్క్రాంతియే సాధకుని సౌభాగ్యం. ప్రకృతిజీవుని అస్తిత్వం రెండు అవస్థల్లో ఉంటుంది. ఒకటి జడశరీరం. రెండవది మనోజీవాత్మ. ఈ అవస్థయందున్న ఉత్తమ కర్మల ద్వారా ఉత్క్రాంతి (పరిణామం) జరుగుతుంది. పరస్పరం ఒక అవస్థలో మార్పు రెండవదానిపై పడి ఉచ్చ అవస్థకు చేరుకొనును. ఆటువంటి పరిణామావస్థకు ముందుగా సాధకుని కుండలినీ జాగృతం కావలసి ఉంది. ఈ కుండలిని జాగృతమే సాధకుని జీవనంలో వాస్తవమైన సంక్రాంతి. ఈ ఆధ్యాత్మిక సంక్రాంతి తర్వాత సాధకుని శరీరం'లో వచ్చు అనుభూతులు గురించి జ్ఞానేశ్వర్ మహరాజ్ చెప్పారు.

మకర సంక్రాంతి:ఖగోళ పరిజ్ఞానం

నెలకు ఒకసారి సూర్యుడు 12 రాశుల్లో సంచరించుట వల్ల సంక్రాంతి వస్తుంది.

తత్ర మేషాదిషు ద్వాదశ రాశిషుక్రమేణ సంచరతః
సూర్యస్యపూర్వస్మాద్రాశేరుత్తరరాశౌ సంక్రమణ ప్రవేశః



సంక్రాంతి సూర్యుడు క్రమంగా మేషాది ద్వాదశరాసుల్లో పూర్వ రాశి నుండి ఉత్తరం వైపు ముఖంగా ప్రవేశిస్తే అదే సంక్రాంతి అని 'జయసింహకల్పద్రుమం' తెలిపింది. ఈ మేషాది పన్నెండు రాశుల్లో గల మకరరాశిలో సూర్యుడు ప్రవేశించుట వల్ల ఏర్పడు సంక్రమణం 'మకర సంక్రమణం' అంటారు. ఇది 'మార్గశీర్ష పుష్య మాసం'లో వస్తుంది. 'మాసానాంమార్గ శీర్షోహం' అన్నాడు కృష్ణుడు. నెలకో సంక్రాంతి ఏర్పడ్డా, ఈ మకర సంక్రాంతి నాటి మార్పులు మరే సంక్రాంతిలో కన్పించవు.

మకరసంక్రాంతి నుండి ఉత్తరాయణం ప్రారంభం అవుతుంది. సూర్యుని సంచారాన్ని రెండు భాగాలుగా చేస్తే–

1. **ఉత్తరాయనం:** సూర్యుడు భూమధ్యరేఖకు ఉత్తర దిశలో ఉన్నప్పుడు (సంక్రాంతి నుండి జూలై మధ్యభాగం వరకు) 'ఉత్తరాయనం' అంటారు. ఈ కాలంలో సూర్యుడు ఉత్తరం వైపు వాలుతూ ఉదయిస్తాడు.
2. **దక్షిణాయనం:** సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో ఉన్నప్పుడు (జూలై మధ్య భాగం నుండి సంక్రాంతి వరకు) 'దక్షిణాయనం' అంటారు. ఈ కాలంలో సూర్యుడు దక్షిణం వైపు వాలుతూ ఉదయిస్తాడు.

సంక్రాంతి పర్వంలో జరిగే ఖగోళ మార్పులను డా॥ పి.నాగమల్లీశ్వరరావు వివరిస్తూ, 'వాస్తవంగా సూర్యుని చుట్టూ భూమి తిరుగుతున్నా భూమిపై నుంచి చూసే వారికి భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నట్లనిపిస్తుంది. అదే భ్రాంతి చక్రం. ఆ భ్రాంతి చక్రం 360 డిగ్రీలు కలిగి ఉంది. సూర్యుడు సుమారు రోజుకొక్క డిగ్రీ చొప్పున సంవత్సరానికి ఒకమారు చుట్టివస్తాడు. కాగా 30 రోజుల్లో 30 డిగ్రీలు – అంటే ఒక్కరాశి. అంటే నెలకొక్కరాశిని తరిస్తాడన్నమాట. ఈ సూర్యుని సుదూర ప్రయాణంలో ముఖ్యమైన మజిలీలు నాలుగు. అవే మేష, తులా, మకర సంక్రాంతులు. సూర్య సంచారంలో ఆరుమాసాలు భూమధ్యరేఖకు దక్షిణంగా ఆరుమాసాలు భూమధ్యరేఖకు ఉత్తరంగా సంచరిస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం రవిమార్గం (ఎక్లిప్టిక్), భూమధ్యేఖ (ఎక్వాటర్) వేర్వేరుగా ఉండటమే. ఈ సంచారంలో భూమధ్యరేఖను దక్షిణం నుంచి ఉత్తరానికి దాటే సమయంలో సూర్యుడు భూమధ్యరేఖను ఖండించే బిందువే ఉత్తర విషువద్బిందువు. అదే వసంత విషువత్తు (స్రింగ్ ఎక్వినాక్స్) అదే మేష సంక్రాంతి. దానికి వ్యతిరేక దిశలో దక్షిణ విషువద్బిందువు ఏర్పడుతుంది. అదే శరద్విషువత్తు (అటర్నల్ ఎక్వినాక్స్) అదే తులాసంక్రాంతి. ఈ రెండు బింధువుల సమయాల్లో అంటే మేష, తులా సంక్రాంతులతో సూర్యుడు సరిగ్గా భూమధ్యరేఖపై ఉంటాడు. కాబట్టి రాత్రింబవళ్ల నిడివి సమానంగా ఉంటుంది. ఈ నాలుగు మజిలీల్లో కటక, మకర సంక్రాంతులకు ఆయనములని పేర్లు. కటక సంక్రాంతి ఆరుమాసాల కాలం దక్షిణాయనం, మకర సంక్రాంతి నుండి ఆరు నెలల కాలం ఉత్తరాయనం. శాస్త్రరీత్యా ఉత్తరాయణం ఉత్కృష్టమైనది కాబట్టి, ఈ ఉత్తరాయనమనే అర్థ సంవత్సరానికి నాందిగా మకర సంక్రాంతిని ఒక్కదానినే 'సంక్రాంతి'గా సంభావిస్తూ పండుగ చేసుకొటున్నాం' అన్నారు. 2 వేల ఏళ్ల క్రితమే పుట్టిన వరాహమిహిరుని గ్రంథాల్లో 16 వందల ఏళ్ల కిందటి భాస్కరాచార్య విరచిత 'సిద్ధాంత శిరోమణి'లో సూర్యుడు సంక్రాంతుల వల్ల సృష్టించే ఈ మార్పులను వివరించారు.



దక్షిణాయనం వర్షాకాలంలో ప్రారంభమై చలి దట్టంగా ఉన్న సమయంలో అంతమవుతుంది. దక్షిణాయనంలో వానలు బాగా కురిసి (అతివృష్ఠిగాను), వానలు లేకపోవుట (అనావృష్టి) వల్ల గాని ప్రజలు ఇబ్బందులకు గురవుతారు. వరదలు, బీభత్సాలు ఎక్కువై పంటనష్టాలు, గ్రామ, నగర నష్టాలు జరుగుతాయి. వరదల వల్ల అనేక రోగాలు వ్యాపించి ప్రజలు ఇబ్బందుల్లో ఉంటారు. దక్షిణాయనం పోయి ఉత్తరాయనం ప్రవేశించగానే ప్రకృతిలో మార్పు వస్తుంది. రాత్రివేళ చలిగా ఉన్నా, పగటివేళ ఉదయభానుని కిరణాల వేడిమితో చలిమటుమాయమవుతుంది. ఉత్తరాయనంలో ఒక్కసారిగా వానలు తగ్గిపోయి ప్రశాంత వాతావరణం ఏర్పడుతుంది. ఉదయం కాగానే గడ్డిపరకలపై ఉన్న మంచు బిందువులు సూర్యుని రాకకోసం ఎదురుచూస్తూ సూర్యుని రాకతో ఒక్కసారిగా అవన్నీ ఎగిరిపోతాయి.

ఉత్తరాయనం – పుణ్యకాలం

ఉత్తరాయనం దేవతలకు, దక్షిణాయనం పితృదేవతలకు ప్రీతికరమైనది. ఉత్తరాయన కాలంలో ఉత్తర ద్వారం తెరిచి ఉంటుందని ప్రజల విశ్వాసం. కాబట్టి దక్షిణాయనంలో కన్నా ఉత్తరాయనంలో మరణించడం శ్రేష్ఠంగా భావిస్తారు. ఈ ఆయనంలో మరణించినవారు దేవమహిమపొంది సూర్యసాయిజ్యం పొందుతాడని వేదవచనం.

ఉత్తరాయనంలో వచ్చే సంక్రాంతి పండుగ మనకు శుభ సంకేతాన్ని అందిస్తుంది. మకరసంక్రాంతి తర్వాత (ఉత్తరాయనంలో) మరణిస్తే మనం పుణ్యలోకాలు పొందుతామని మనకు శాస్త్రాలు కూడా చెబుతున్నాయి. మహా భారత యుద్ధంలో భీష్ముడు తన మరణాన్ని ఉత్తరాయనానికి పొడిగించుకుని అంతవరకు అంపశయ్యపై పరుండి ఉత్తరాయన పుణ్యకాలంలో మరణించాడు.

సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశించగానే దేవతలకు పగలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుండి కర్కాటక రాశిలోకి వెళ్లే వరకు వారికి పగటి కాలమే. అదే సూర్యుడు కర్కాటక రాశిలోకి వెళ్లినపుడు పారంభమైన రాత్రి ధనస్సురాశిలో ఉన్నంత వరకు దేవతలకు రాత్రే. సంక్రాంతి మూడు రోజుల పండుగ. వామనుడు బలిచక్రవర్తి తలభాగంపై మూడవ అడుగుపెట్టాడు. అందువల్ల సంక్రాంతి మూడు రోజుల పండుగ అయ్యింది. అహంకారంపై 'ఆత్మ' విజయానికి ఇది ప్రతీక. దక్షిణాయన కాలంలో పాతాళ లోకానికి వెళ్లిన బలిచక్రవర్తి మళ్ళీ రావాలనే భావంతో 'బలిరాజ్యాన్ని' అందరూ స్మరిస్తారు. అహంకారం అణగి మరలా నూతనోత్సాహంతో రావాలనేది ఈ సందేహం.

మొదటిరోజు గృహం సుందరంగా అలంకరించుకొని, క్రొత్త ధాన్యాలు ఇంటికి తెచ్చుకొని, రకరకాలైన పళ్ళు, పూలు, ధాన్యాలతో ప్రకృతిమాతను అర్చిస్తారు. కొన్ని ప్రాంతాల్లో సంక్రమణం రోజు ప్రజలు ఉపవాసం చేసి పితృదేవతలకు తిలోదకాలు వదలుతారు. యువకులు కోళ్లపందాలు, కోలాటాలు ఆడుతారు. ఆడపడచులు చక్కగా అలంకరించుకొని గొబ్బిళ్ళు తయారుచేసి 'గొబ్బిపాటలు' పాడుతారు.

ఎద్దుల బండ్లు

ఎద్దులను శుభ్రంగా కడిగి అలంకారం చేసి, బళ్లను అందంగా సున్నం, రంగులతో, తోరణాలతో అలంకరించి గ్రామంలోని అన్ని బళ్లను వరుసగా దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. తమిళ ప్రాంతంలోని తిరునల్వేళి, మధుర ప్రాంతాల్లో పశువులకు అలంకరణ చేసి, డప్పులమోత మధ్య పరుగెత్తిస్తారు. వాటిని ఆపి దాని కొమ్ములకు కట్టిన నగదు, రంగు వస్త్రాలను తేవడం ఓ క్రీడ. ఇటీవల ఇలాంటి 'పందాలను' కోర్టులు అడ్డుకొంటున్నాయి. కానీ అవి సాగుతూనే ఉన్నాయి. 2017లో జల్లికట్టుపై చెన్నైలో పెద్ద ఆందోళన చేసే కేంద్రం అనుమతి ఇచ్చింది.



గొబ్బెమ్మలు

ఆవు పేడను క్రిందపడకుండా తెచ్చి, చిన్న చిన్న ముద్దలుగా చేసి, మధ్యలో చేమంతి, బీర, పొట్ల, గుమ్మడి, పిండి పూట (పువ్వులు) గరికె (గడ్డి)ని గుచ్చి, పసుపు కుంకుమలతో అలంకారం చేసి ఇంటి ముంగిట ముగ్గుల మధ్యలో ఉంచి ధాన్యాలు, పుష్పాలు, పండ్లు వాటి చుట్టూ పెడతారు. వీటినే 'గొబ్బిళ్ళు' అంటారు. తెలంగాణ ప్రాంతంలో వీటిని 'గొంతెమ్మ'లు అంటారు.

ప్రకృతిమాతకు ప్రతీకగా భావించే గొబ్బిళ్ళ చుట్టూ ఆడపడుచులందరూ చేరి 'గొబ్బిపాటలు' పాడతారు. దీనిని 'గొబ్బిళ్లాట' అంటారు. ఆ పాటలో ప్రకృతి వర్ణన, దేవతల ప్రార్థన, స్త్రీల ముచ్చట్లు ఉంటాయి.

'కొలని దోపరికి గొబ్బిళ్ళో
యదుకుల స్వామికి గొబ్బిళ్ళో
కొండగొడుగుగా గోవులు గాచిన
కొండొక శివువుకు గొబ్బిళ్ళో...'

అంటూ గానం చేసి కృష్ణలీలల్ని గొబ్బిపాటల్లో తెలియచేశాడు అన్నమయ్య. ఈ విధంగా ఆచార్యుల దగ్గర నుండి ఆడపడుచుల వరకు గొబ్బిపాటలు వ్యాప్తి చెందాయి. 'గొబ్బి' శబ్దం గోపిశబ్దం నుండి వచ్చింది. తమిళంలో గొబ్బిపాటలను 'కుమ్మిప్పాడల్' అంటారు.

మకర సంక్రాంతి

సంక్రాంతి పండుగ రోజు అందరూ గృహాలను అలంకరించుకొని, క్రొత్తవస్త్రాలు ధరించి సూర్యని రూపంలో హరిని, ధాన్యలక్ష్మిని పూజిస్తారు. వివిధ రకాల పూలు, పండ్లు, ధాన్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. మకరసంక్రాంతిరోజే సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. చలితో వణికి కుంచించుకుపోయిన ప్రకృతిని సూర్యుడు సహస్రకిరణాలోతో తిరుమల రామచంద్ర గారు ఓ కొత్త విషయం ప్రస్తావించారు. మకరశ్యాధిపతి శిని శని వాతప్రధానగ్రహమని జ్యోతిశాస్త్రజ్ఞులును, భౌతిక శాస్త్రజ్ఞులును చెప్పచున్నారు. వాతవాట్లు తగ్గును? శాకముల భక్షణము వలనను కదా! కనుకనే ఆనాడు తెలకపిండితో ఒళ్ళు రుద్దుకొని స్నానమాచరించి నువ్వులు, బెల్లము, గుమ్మడికాయలు మున్నగునవి దానమిత్తురు. పితరుల పుణ్యలోకప్రాప్తి నిమిత్తము తక్వణశ్రాద్ధాదులనొనర్తురు. సమృద్ధికి సూచకముగా కలవారును, లేని వారును దాన ధర్మములునొనర్తురు. నాస్తియను శబ్దమానాడు రాకుండా దానమొనర్పవలెనని ధర్మశాస్త్రములు తెలుపుచున్నవి. స్త్రీలు తమ మాంగళ్యాభివృద్ధికై ఇష్టులకును, శిష్టులకులను కుంకమమను సుగంధ ద్రవ్యములు, గుడము, పుష్పములు, వస్త్రములు మున్నగునవి దానమొనర్పలెనని పురాణములు, ఉద్ఘోషించుచున్నవి అన్నారు కొన్ని గ్రంథాలు తిలాధేనుధానం ప్రశస్తంగా చెప్పాయి. అలాగే వస్త్రదానం ఉత్తరాయణంలో విశేషంగా చేయాలని దాని వల్ల మనుషులు రోరవి ముక్తులు, అవుతారని ధర్మశాస్త్రలు చెబుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా కుంకుమ, బియ్యం బెల్లం పూలు, వస్త్రలను కూడా స్త్రీలు బ్రహ్మోణోత్తములకు దానంగా ఇవ్వాలని పురాణావాక్యం

ఈదానం విషయంలో కీ,శే సురవరం ప్రతాపరెడ్డిగారు. తమ హిందువుల పండుగలు గ్రంథాంలో ఉత్తరభారతీయులైన ఓ కొత్త ఆచారం పేర్కొన్నారు. ఈ పండుగనాడు నువ్వులు, నెయ్యి, గొంగళ్ళు బీదలకు దానము చేయవలసినవి ప్రతకారులాదేశించానారు. దానియందు మంచి అర్థము కలదు. ఈ పండుగ శీతాకాలమునందు వచ్చును కావున పై మూడు వస్తువులుష్ణమును గలిగించునని కాన నీ విధి చెప్పబడినది. అన్నారు. ఇందుకనుగుణంగా పురాణకథలు కన్పిస్తున్నాయి.

ద్రోణాచార్యుడి భార్య కృపి ఆశ్రమంలో ఓ రోజు దిగులుగా కూర్చొని ఉండగా ఆశ్రమం వైపు దూర్వాసమిని సమిధలకోసం వచ్చి,ఆమె దిగులును గమనించాడు అమ్మా! నీవెందుకు అలా ఉన్నావని ప్రశ్నించగా మునివర్యా! మా దగ్గర ముసలి ఆవు తప్ప ఏ ఆస్తులు లేవు అని చెప్పపకొన్నది. భాగ్యాన్ని కల్గించే ఏదైన ఉపాయం చెప్పమని ప్రార్థించింది మునిని. అందుకు దూర్వాసుడు పూర్వం యశోదాదేవి సంతానం కోసం ఆచరించిన సంక్రాంతి వ్రతం ఆమెకు ఉపదేశించారు. సంక్రాంతి రోజు నదీస్నానం చేసి పెరుగు సద్బ్రాహ్మణులకు దానం చేస్తారో వారికి చక్కని పుత్ర సంతానం, సంపద సిద్ధిస్తాయని చెప్పగా ఆమె అచరించి ఆశ్వత్థామను పుత్రుడిగా పొందింది. అలాగే మోక్షాన్ని కోరేవారు సంక్రాంతి రోజు 'మహాఘృతకంబళము' మహేశ్వరునికి సమర్పించాలని 'శివరహస్యం' తెలియజేస్తున్నది.

అసితాయాస్సితాయా వాధేనోర్ఘృతమనత్తమమ్
సంపాదనీయం యత్నేన ఘనీభూతంచ శోధితమ్
తద్ఘృతం తులయోత్తీర్ణం ప్రస్థం సార్థశతత్రయం
మహాకంబళ మేతద్ధి ఘృతస్య పరికీర్తితమ్

తెల్ల ఆవు లేదా నల్ల ఆవుది గాని మూడున్నర వందల ప్రస్థముల పేరిన నెయ్యి పరిశుద్ధంగా ఉంటే 'ఘృతకంబళం' అంటారు. ఇంత పెద్ద మొత్తంలో నెయ్యిని సేకరించలేని వారు అందులో సగమో, ఒక భాగమో సేకరించి పరమేశ్వరుణ్ణి అభిషేకించి తర్వాత ఘనీభవించిన ఎఇయ్యని శువుని మస్తకంపై అభిషేకించాలి.

పొంగలి

కొన్ని ప్రాంతాలలో మకరసంక్రాంతిని "పొంగల్" అని కూడా అంటారు. కొత్త పిడతలు (చిన్నకుండలు) తెచ్చి వాటిని సున్నం, పసుపు, కుంకుమలతో అలంకరించి, ఇంటి మధ్యలో ముగ్గువేసి ఆ అందమైన ముగ్గుల మధ్యలో పిడతలు పెట్టి, వాటి చుట్టూ గొబ్బెమ్మలతో అలంకరించి, పూలు, పండ్లు, ధాన్యాలు పెట్టి, కొత్త ధాన్యం (బియ్యం) పోసి, అందులో పాలు, చక్కెర, నెయ్యి మొదలగునవి తియ్యని సాత్విక పదార్థాలు వేస్తారు. పిడతల కింది భాగంలో ఆవు పేడతో వేసిన పిడకల్ని పేర్చి, మండించగా బియ్యం ఉడికి పాలు పొంగుతాయి. అందులో 'పొంగలి' తయారవుతుంది. దీనికి 'పాలుపొంగబెట్టుట' అని పేరు వచ్చిందని అంటారు. అందరూ పొంగలినే ప్రసాదంగా తీసుకుంటారు. పొంగలిని నైవేద్యంగా పెట్టి ప్రసాదంగా తీసుకుంటారు కాబట్టే దీనిని 'పొంగల్' అంటారు. సాయంత్రం ఆడపడుచులు గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతుంటే, యువకులు కోళ్లపందాలు, కోలాటాల వంటి ఉత్సవాల్లో మునిగిపోతారు. సంక్రాంతికి 'మొక్కుల పండుగ' అని మరొకపేరు. ఉదయం చిన్నపిల్లలు పెద్దలకు నమస్కారం చేయడం వల్లనే ఈ పేరు వచ్చింది.

కనుమ పండుగ

కనుమపండుగరోజపు పశుమందిరాలు (పశువులు కట్టివేసే స్థలం) శుభ్రం చేసుకొని, పశువులను అలంకరించుకొని పూజలు చేచేస్తారు. పశువులకొట్టంలో పండిన 'పొలిఅన్నం' పొలాల్లో చల్లుతారు. ఈ పొలి పొంగలిలో పసుపు, కుంకుమ కలిపి చల్లుతారు. గుమ్మడికాయను బలికి ప్రతిగా వాడుతారు. అజ్ఞానం లో పశువులను పూర్వం ఈ పండుగరోజు 'బలి' ఇచ్చేవారట. మనిషిలోని పశుత్వాన్ని బలి ఇవ్వకుండా పశువును బలి ఇవ్వడం ఓ అజ్ఞానం. తర్వాత జరిగిన ఆలోచనలో ఈ పశుబలి అంతరించింది. దానికి బుదులు గుమ్మడిని కూష్మాండబలిగా ఇవ్వడం ప్రారంభమైంది.

హరిదాసుల సంక్రాంతి



సకలకల్యాణ స్వరూపడగు హరినామస్మరణ వినిపిస్తూ, రైతన్నలను ఆశీర్వదిస్తూ, ధనుర్మాసం నెలరోజులు హరిగానం చేసే వారు 'హరిదాసులు'.

వీరు ఉదయమే స్నానం చేసి కాషాయ వస్త్రాలు ధరించి, నొసటిపై త్రిపుండ్రం దిద్దుకొని, మెడలో తులసిమాలలు వేసుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని, నెత్తిపై అక్షయపాత్రను పెట్టుకొని, ఒక చేతితో భుజంపై గల తంబారాను మీటుతూ, ఇంకొక చేతిలో చిరుత పట్టుకొని శ్రావ్యంగా మోగిస్తూ, ఇంటిముందుకు వచ్చి 'హరిలోరంగహరి' అని గానం చేస్తూ, భిక్షను వినయంగా మోకాలిపై వంగి అక్షయప్రాతలో వేయించుకుంటారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ, హరినామస్మరణం చేస్తూ అన్నదాతను ఆలపిస్తూ...

సంకీర్తనాచార్యుల కీర్తనలను ఆలపిస్తూ....

పలుకే బంగారమాయెనా
కోదండపాణి పలుకే బంగారామాయెనా
పలుకే బంగారామాయె పిలిచినా పలుకవేమి
కలలో నీ నామస్మరణ, మరువ చక్కనితండ్రి
॥పలుకే॥

గ్రామంలో ఉన్న పాటలు...

కరుణించావే శారదాంబ, మము
కరుణించావే జగదాంబ, నీలో
నవున్న భావనకూ నన్ను, బలిగా
రక్షించావే శారదాంబ.

ఇతర ప్రాంతాల్లో సంక్రాంతి

మరాఠాప్రాంతంలో నువ్వులు, బెల్లం, ఇతరులకు ఇచ్చి తీల్– గూల్ఖా– గోడ్– గోడ్‌బేల్ అని అంటారు. పంజాబులో మకరసంక్రాంతి కన్నా ఒకరోజు ముందు లోడీ ఉత్సవం చేస్తారు. ఆ రోజు కట్టెలను ప్రోగుచేసి మంటలు మండుతుంటే కాలినకట్టెలను తీసుకోని నేలపై కొడుతూ ఆనందిస్తారు. ఈ సంక్రాంతి పర్వాన్ని వాళ్ళు మాఘీ అంటారు.

ఇటీవల సంక్రాంతికి అహ్మదాబాదులో గాలిపతంగుల ఉత్సవం ఘనంగా చేస్తున్నారు. ఒరిస్సా గిరిజనలకు కొత్త సంవత్సరం సంక్రాంతితో ప్రారంభం అవుతుంది. తమిళులు పొంగల్ పేరుతో సంక్రాంతి జరుపుకొంటారు. గ్రీకులు, రోమన్లు, కూడా సంక్రాంతిని జరుపుకొనేవారని పరిశోధకులు తెలియజేస్తున్నారు.

మన ప్రాంతంలోనే గాక కర్ణాటక ప్రాంతంలో బంధువులకు, స్నేహితులకు నువ్వులు, బెల్లం కలిపి పంచుతూ ఎళ్లు బెల్లతించు ఒళే మాతు మాతాడు (నువ్వులు బెల్లము తిని మంచి మాటలు మాట్లాడు) అంటారు. కొన్ని ప్రాంతాల్లో స్త్రీలు గొబ్బిగౌరీవ్రతం ఆచరిస్తారని తిరిమల రామచంద్రగారు వివరించారు. స్త్రీలు బంకమట్టితో చేసిన గౌరీవిగ్రహాన్ని చిన్న మండపంచేసి అలంకరణతో భోగినాడు నిలురపుతారు. చక్కగా పూజలు చేసి పాటలు పాడుతారు. సంక్రాంతి మూడురోజు స్త్రీలు చేరి ఈ మంటపం ముందు గౌరీదేవి పాటలు పాడుతారు. నాల్గవ రోజు దేవికి ఉద్వాసన చెప్పి మంటపంలో అలంకరించిన కాయగూరలతో గొబ్బికూర చేస్తారు. అదేరోజు సాయంత్రం స్త్రీలు, కన్నెపిల్లల ఆ విగ్రహాన్ని చెఱువులోనో, నదిలోనో ఓలలాడించి నిమజ్జనం చేస్తారు.

రంగురంగుల రంగవల్లి

ధనుర్మాసం మొదలుకొని సంక్రాంతి చివరి రోజు వరకు వాకిళ్లల్లో ముగ్గులు వేస్తారు. తెలుగింటి స్త్రీ గృహ అలంకారశోభను గూర్చి 'క్రీడాభిరామం'లో ఇలా వర్ణించబడింది.


చందనంబున కలయంపి చల్లినారు
మ్రుగ్గులిడినారు కాశ్మీరమున ముదమున
వ్రాసినారిందుజమున రంగవల్లి
కాంజముల తోరణములు కట్టినారు ' – (కీడాభిరామం)



ఈ పద్యంవలన తెలుగింటి స్త్రీల గృహాలంకారం తెలుస్తుంది. అందుకే సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉదయమే ఆడపడుచులు చిక్కగా కల్లాపుజల్లి, గుల్లసున్నం, పిండితో రకరకాల రంగులు కలిపి, ఇంటిముంగిట ముగ్గులను తీర్చిదిద్దుతారు. విష్ణుచక్రం ముగ్గు, శివ, త్రిశూలం ముగ్గు, హంస పాదు ముగ్గు అని అనేక విధాల ముగ్గులు వేస్తారు. ఆ ముగ్గుల గొబ్బెమ్మలను పెట్టి పండ్లు, పూవులు, ధాన్యాలతో అలంకరించి ప్రకృతిమాతను పాటలతో వర్ణిస్తారు.

వాకిళ్లలో పేడతో అలికి, రంగురంగులతో ముగ్గులు పెడతారు కాబట్టే దీనిని 'రంగవల్లి' అంటారు. ఉత్తరభారతదేశంలో 'రంగోలి' అంటారు. ఈ ముగ్గులో ఉండే గుల్లసున్నంలోని కాల్షియం వల్ల ఇంట్లోకి వచ్చే సూక్ష్మక్రిములు చనిపోతాయి. ముగ్గులు వేసే స్త్రీలకు చక్కని వ్యాయామం జరుగుతుంది. రంగు రంగుల ముగ్గులతో ఇళ్లముందు అలంకరింపబడి ప్రకృతి మాటకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఉంటుంది. పూర్వం 365 రోజులకు ప్రతిరోజూ ఓ ముగ్గు ఉండేది. ఆకాశంలో ప్రతిరోజూ జరిగే ఖగోళ మార్పులను ముగ్గుల్లో చూపించేవారు. సంక్రాంతి ఖగోళ సంబంధమైన ప్రాశస్యం గల పండుగ కాబట్టి ఆ పండుగలో మాత్రం ముగ్గు సంప్రదాయం కనుమరుగవలేదు.





అనగననగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తీయగనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినుర వేమ
భావం: పాడగా పాడగా రాగం వృద్ధి అవుతుంది.తినగా తినగా వేపాకు కూడా తియ్యగా ఉంటుంది. అలాగే దృఢ సంకల్పంతో పట్టుదలతో చేపట్టిన పని చెయ్యగా అది తప్పకుండా సమకూరుతుంది.

కృషితో నాస్తి దుర్భిక్షం

వికాసమే విజయం

- శ్రమించడం మనల్ని మూడు అరిష్టాల నుండి దూరం చేస్తుంది..విసుగు చెందడం, పాప ప్రవృత్తి, మరియు పేదరికం.
- పరిశ్రమించడమే అదృష్టానికి మూలం, అలసత్వమే పాపాచరణానికి నాంది.
- ఈ లోకంలో పట్టుదలకు మరేదీ సాటి రాలేదు. ప్రతిభ సరిపోదు, ఓటమి పాలైన ప్రతిభావంతులకు ఈ లోకంలో కొరతే లేదు. మేధస్సు సరిపోదు, సాఫల్యాన్ని పొందని మేధాసంపత్తి దాదాపు లోకప్రసిద్ధం. చదువు సరిపోదు, నిరుపయోగులైన విద్యావంతులతో ఈ లోకమంతా నిండిపోయింది. పట్టుదల, సంకల్పబలాలు మాత్రమే అజేయమైనవి. 'ప్రయత్నించడం మానకు' అనే నినాదం. ఎన్నో సమస్యల్ని పరిష్కరించింది, ఎప్పటికీ పరిష్కరిస్తూనే ఉంటుంది. కూడా!
- కష్టించడంలోనూ రకాలున్నాయి. బుద్ధిబలంతో పని చేసే వారు పరిపాలిస్తారు, శారీరక బలంతో పని చేసే వారు పరిపాలించబడతారు.

గుర్రుపెట్టి నిద్రిస్తున్న పెద్ద ఏనుగు కన్నా కష్టించి పనిచేసే చిన్న చీమే మిన్న!
మీకో సంగతి తెలుసా? చీమలు ఎన్నడూ నిద్రించవూ!

– స్వామి పార్థసఖానంద

గంగకి త్రిపథ అనే నామం ఎలా వచ్చింది?

కుశనాభుడి వృత్తాంతం విన్నాక అలా ముందుకు వెళ్ళిన విశ్వామిత్ర, రామలక్ష్మణులు గంగా నదిని సమీపించారు, అందరూ గంగని చూడగానే ఎంతో సంతోషించారు. అక్కడున్న మహర్షులు మొదలగువారు ఆ గంగలో తమ పితృదేవతలకి తర్పణం సమర్పించి, అగ్నిహోత్రం చేసి ఒడ్డున కూర్చొని, మిగిలిన హవిస్సుని అమృతంగా భావించి తిన్నారు. అప్పుడు విశ్వామిత్రుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు....' కుశనాభుడికి నూరుగురు కుమార్తెలు ఉన్నారు, కాని కుమారులు లేరు. తనకి కుమారులు కలగడం కోసం పుత్రకామేష్టి యాగం ప్రారంభించాడు, ఆ యాగం జరుగుతుండగా కుశనాభుడి తండ్రి అయిన కుశమహారాజు అక్కడికి వచ్చి నీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది, గాధి అనేవాడు నీకు కొడుకుగా జన్మించి మన వంశ పేరు నిలబెడతాడు' అన్నాడు. నేను ఆ గాధి కుమారుడినే రామా అని విశ్వామిత్రుడు రాముడితో చెప్పాడు.

స పితా మమ కాకుత్స్థ గాధిః పరమ ధార్మికః |
కుశ వంశ ప్రసూతో అస్మి కౌశికో రఘునందన ||

అప్పుడు విశ్వామిత్రుడు... ' నేను కుశ వంశంలో జన్మించాను కాబట్టి నన్ను కౌశికుడు అని అంటారు. నా అక్క పేరు సత్యవతి, ఆమె భర్త పేరు ఋచకుడు. కొంతకాలానికి మా బావగారు శరీరం విడిచిపెట్టారు. అప్పుడు మా అక్క ఉండలేక సశరీరంగా బావతో స్వర్గానికి వెళ్ళిపోయింది. మా అక్క కౌశికి అనే నదిగా హిమాలయాల మీద ప్రవహిస్తుంది. అందుకే నేను ఎక్కువగా హిమాలయాల మీద, మా అక్కకి దగ్గరగా ఉంటాను. ఇప్పుడు ఈ సిద్ధాశ్రమానికి యాగం చెయ్యడానికి వచ్చాను, నీ తేజస్సు చేత రక్షింపబడ్డాను ' అని రాముడితో చెప్పాడు.

అక్కడే ఉన్న ఋషులు అప్పుడు.........

విశేషేణ భవాన్ ఏవ విశ్వామిత్ర మహాయశః |
కౌశికీ సరితాం శ్రేష్ఠః కుల ఉద్యోతకరీ తవ ||

నీవంటి వాడు పుట్టడం చేత నీ వంశం ధన్యమయ్యింది, మీ అక్కగారి వల్ల మీ వంశం పరమ పావనం అయ్యింది అని అన్నారు. అప్పుడు రాముడు గంగకి త్రిపథగ అన్న నామం ఎలా వచ్చిందొ చెప్పమన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు ఇలా చెప్పసాగాడు...... ' పూర్వకాలంలో హిమవంతుడు అనే పర్వత రాజు, ఆయన భార్య మనోరమ ఉండేవాళ్ళు. వాళ్ళ పెద్ద కుమార్తె గంగ, రెండవ కుమార్తె ఉమ. స్వేచ్ఛగా ప్రవహించగలిగే గుణమున్న గంగని స్వర్గలోకానికి పంపిస్తే ఆ నదీ జలాలని ఉపయోగించుకొని మేము తరిస్తామని దేవతలు హిమవంతుడిని అడుగగా, దేవకార్యము కనుక హిమవంతుడు సరే అన్నాడు. అలా దేవనదిగా గంగ స్వర్గంలో ప్రవహించేది. ఆయన రెండవ కుమార్తె తన తపస్సు చేత కాముడిని దహించిన శివుడికి అర్థాంగి అయ్యి, హైమవతిగా తన తండ్రి పేరు నిలబెట్టింది. పరమ పావని అయిన గంగ ఒకనాడు భూలోకానికి తేబడి పాతాళానికి చేరింది, 3 లోకముల్లో ప్రవహించినది కనుక గంగని త్రిపథగ అని పిలుస్తారు' అని విశ్వామిత్రుడు చెప్పాడు.మీరు ఈ విషయాలని మనస్సుకి అతుక్కున్నేటట్టు చెప్పగలరు, కావున నదులన్నిటిలోకి పరమ పవిత్రమైనది, మనుష్యుల పాపములు హరించగలిగినది అయిన గంగని గూర్చి మాకు ఇంకా విస్తారంగా చెప్పవలసిందిగా రాముడు విశ్వామిత్రుడిని ప్రార్థించాడు. అప్పుడు విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు....' పార్వతి పరమేశ్వరులు కైలాసంలో 100 దివ్య సంవత్సరాలు క్రీడించారు. ఈ విషయం విన్న దేవతలకి ఆశ్చర్యమేసింది, పార్వతీదేవి శంకరుడి తేజస్సులు అసామాన్యమైనవి, కాబట్టి వాళ్ళ కలయిక వల్ల జన్మించే భూతాన్ని మనం తట్టుకోలేం' అని అనుకున్నారు. ఈ దేవతలంతా బయలుదేరి కైలసానికి వెళ్ళి శంకరుడిని ప్రార్థించారు. అప్పుడు శంకరుడు బయటకి వచ్చాడు. అప్పుడు వాళ్ళు ఆయనతో, స్వామీ! మీరు పార్వతీదేవితో 100 దివ్యసంవత్సరాల నుంచి క్రీడిస్తున్నారు, మీ తేజస్సు కనుక వేరొక ప్రాణి రూపంలో వస్తే, మేము ఎవరమూ దానిని తట్టుకోలేము, కావున మీరు మీ తేజస్సుని మీలోనే పెట్టుకొని పార్వతీదేవితో తపస్సు చేసుకోండి అన్నారు. వాళ్ళు చెప్పినదానికి శంకరుడు సరే అన్నాడు, కాని అప్పటికే రేతస్థానము నుంచి నా తేజస్సు కదిలింది, ఇప్పుడు దాన్ని ఎవరు భరిస్తారు, దాన్ని ఎక్కడ వదిలిపెట్టను అని శంకరుడు అడిగాడు. అప్పుడు ఆ దేవతలు.....

యత్ తేజః క్షుభితం హి అద్య తద్ ధరా ధారయిష్యతి |

మీ తేజస్సుని భూమి భరిస్తుంది, కావున భూమి మీద వదిలిపెట్టండి అన్నారు. శంకరుడు అలానే భూమి మీద తన తేజస్సుని వదిలిపెట్టాడు. వదిలిన ఆ తేజస్సు భూమి అంతా వ్యాపించింది. ఇంతలో పార్వతీదేవి బయటకి వచ్చి, నాకు బిడ్డ పుట్టకుండా చేసి మీరు శంకర తేజస్సుని భూమి మీద పతనం చేశారు. కావున.....

అపత్యం స్వేషు దారేషు న ఉత్పదయితుం అర్హథ |
అద్య ప్రభృతి యుష్మాకం అప్రజాః సంతు పత్నయః ||
ఏవం ఉక్త్వా సురాన్ సర్వాన్ శశాప పృథివీం అపి |
అవనే న ఏక రూపా త్వం బహు భార్యా భవిష్యసి ||
న చ పుత్ర కృతాం ప్రీతిం మత్ క్రోధ కలుషీకృతా |
ప్రాప్స్యసి త్వం సుదుర్మేధే మమ పుత్రం అనిచ్ఛతీ ||

మీ దేవతలు అందరూ వచ్చి నాకు బిడ్డలు కలగకుండా చేశారు కాబట్టి మీకెవరికీ మీ భార్యలందు బిడ్డలు పుట్టరు. నా భర్త అయిన శంకరుడి తేజస్సుని భరించడానికి భూమి ఒప్పుకుంది కాబట్టి, ఇకనుంచి భూమి అనేక రూపాలు పొందుతుంది, ఒకే కాలంలో భూమికి అనేక భర్తలుంటారు, భూమి తన కొడుకుల వలన సిగ్గుతో తల వంచుకుంటుందని శపించింది. ఇది విన్న దేవతలు తలలు వంచుకొని తమ తమ స్థానాలకి వెళ్ళిపోయారు. వ్యాపించిన ఆ శంకరుడి తేజస్సుని భూమి కూడా తట్టుకోలేకపోయింది. అప్పుడు దేవతలు అగ్నిదేవుడిని వాయువుతో కలిసి ఈ రుద్ర తేజస్సుని తనయందు పెట్టుకోమన్నారు. అప్పుడు అగ్ని ఆ తేజస్సుని తనలో పెట్టుకున్నాడు. శంకరుడు పార్వతీదేవితో తపస్సు చేసుకోడానికి పశ్చిమ దిక్కుకి వెళ్ళిపోయాడు. అదే సమయంలో తారకాసురుడు అనే రాక్షసుడు, తను పార్వతీ పరమేశ్వరుల బిడ్డడి చేతిలోనే చనిపోయేటట్టు వరం పొందాడు. ఇది తెలిసిన దేవతలకి ఏమి చెయ్యాలో తెలీక బ్రహ్మగారి దగ్గరికి వెళ్లారు. అప్పుడు బ్రహ్మగారు ఆలోచించి, హిమవంతుడు మనోరమల కుమార్తెలైన గంగా పార్వతులకి తేడా లేదు, కావున పార్వతీదేవి అక్క అయిన గంగలో ఈ తేజస్సుని విడిచిపెడితే, పార్వతీదేవికి కోపం రాదు. కాబట్టి ఆ శివ తేజస్సుని గంగలో విడిచిపెట్టమన్నారు. అప్పుడా దేవతలు గంగమ్మ దగ్గరికి వెళ్ళి, దేవకార్య నిమిత్తము నువ్వు అగ్ని దగ్గర నుంచి శివ తేజస్సుని స్వీకరించి గర్భం ధరించాలి అన్నారు. దేవతా కార్యము కనుక గంగ సరే అన్నది. అప్పుడు గంగ ఒక అందమైన స్త్రీ రూపం దాల్చి ఆ తేజస్సుని అగ్ని నుండి స్వీకరించింది. శివ తేజస్సు గంగలో ప్రవేశించగానే గంగ కేకలేసింది. ఈ తేజస్సుని నేను భరించలేను, నన్ను ఏమి చెయ్యమంటారు అని అడిగింది. అప్పుడు అగ్నిదేవుడు చెప్పిన విధంగా గంగ ఆ తేజస్సుని కైలాస పర్వతం పక్కనున్న భూమి మీద వదిలింది.


అలా భూమి మీద పడ్డ ఆ తేజస్సు కాంతివంతమైన స్వరూపం నుంచి బంగారం, వెండి పుట్టాయి, ఆ తేజస్సు యొక్క మలం నుంచి తగరము, సీసము పుట్టాయి, ఆ తేజస్సు క్షారం నుంచి రాగి, ఇనుము పుట్టాయి, మిగిలిన పదార్థం నుంచి మిగతా ధాతువులన్నీ పుట్టి గనులుగా ఏర్పడ్డాయి. అక్కడ బంగారు పొదలుగా, శరవణ పొదలు పుట్టాయి. అక్కడే ఉన్న తటాకం నుండి ఒక పిల్లవాడి ఏడుపు వినిపించింది. పుట్టిన ఆ పిల్లాడికి పాలు ఎవరు పడతారు అని దేవతలు ఆలోచిస్తుండగా, పార్వతీదేవి అంశ అయిన కృత్తికలు ఆ పిల్లవాడికి మా పుత్రుడిగా కార్తికేయుడు (కృత్తికల పుత్రుడు) అని పిలవాలి, అలా అయితే పాలు పడతాము అన్నారు. దేవతలు సరే అన్నారు.

తతః తు దేవతాః సర్వాః కార్తికేయ ఇతి బ్రువన్ |
పుత్రః త్రైలోక్య విఖ్యాతో భవిష్యతి న సంశయః ||

ఈ మాట విన్న కృత్తికలు ఆనందంగా పాలు పట్టారు. ఆ పుట్టిన పిల్లవాడు 6 ముఖాలతో పుట్టాడు, ఏక కాలంలో 6 కృత్తికల స్తన్యమునందు 6 ముఖాలతో పాలు తాగాడు కనుక ఆయనకి షడాననుడు, షణ్ముఖుడు అనే పేర్లు వచ్చాయి. అలాగే అగ్నిదేవుడి నుండి బయటకి వచ్చిన శివ తేజస్సు కనుక ఆయనకి పావకి, అగ్నిసంభవహా అని నామాలు. అలాగే పరమశివుడి కుమారుడు కనుక ఆయనని కుమారస్వామి అని పిలిచారు. అలాగే శివుడి వీర్యము స్ఖలనమైతే పుట్టినవాడు కనుక స్కందుడు అని పిలిచారు. పార్వతీదేవిలా అందంగా ఉంటాడు కనుక, అమ్మ అందం వచ్చింది కనుక మురుగన్ అని పిలిచారు. పరమశివుడికి ప్రణవార్థాన్ని వివరించాడు కనుక స్వామిమలై అన్నారు' అని విశ్వామిత్రుడు రాముడికి చెప్పాడు.

గంగ అసలు భూమి మీదకి ఎందుకొచ్చిందో చెప్తాను అని విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు 'పూర్వం అయోధ్య నగరాన్ని మీ వంశానికి చెందిన సగరుడు పరిపాలించేవాడు, ఆయనకి కేశిని, సుమతి అని ఇద్దరు భార్యలు. సుమతి గరుక్మంతుడి సోదరి. తనకి కుమారులు కలగడం కోసం తన ఇద్దరు పత్నులతో కలిసి హిమాలయాలలో ఉన్న భృగు ప్రవణాన్ని చేరుకొని 100 సంవత్సరాలు తపస్సు చేశాడు సగరుడు. ఆ భృగు ప్రవణంలో ఉన్న భృగు మహర్షి సంతోషించి, నీకున్న ఇద్దరు భార్యలలో ఒక భార్యకి వంశోద్ధారకుడైన కొడుకు పుడతాడు, రెండవ భార్యకి 60,000 మంది మహా ఉత్సాహవంతులైన కొడుకులు పుడతారు అని వరమిచ్చాడు.

సేకరణ:
నరేందర్ చింతం




ప్రవచనం

– డా।। శ్రీ చాగంటి కోటేశ్వర రావు

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం-7



శ్లోకం :

కలాభ్యాం చూడలంకృతశశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటితఫలాభ్యాం భవతుమే
శివాభ్యా మస్తోక త్రిభువనశివాభ్యాం హృది పునర్భవాభ్యా మానంద స్ఫురదనుభవాభ్యాం నతిరియమ్ ||

భావం:

కళాస్వరూపులు, శిరసునందులంకరించుకొన్న చంద్రకళ గలవారు, తమ తమ తపః ఫలాలుగా ఒకరికొకరు పొందబడినవారు, భక్తులకు కర్మ ఫలాదులను ప్రసాదింపజేయువారు, మంగళకరులు, ముల్లోకాలకు శుభాలనొసంగువారు, తలచినంతనే హృదయంలో మరల మరల ప్రసన్నులగువారు, సంతోషంతో స్ఫురించు రూపాలు గల వారు అగు పార్వతీపరమేశ్వరులకు నమస్కారం.

వివరణ

పార్వతి శివుని కోసం తపస్సు చేసింది.శివుడు కూడా సతీ వియోగానంతరం ఆమెను పొందాలని తప్పించాడు. ఎన్ని యుగాలైనా కల్పాలైనా ఈ జంటను విడదీయలేనంతగా ఒకరి శరీరంలో ఒకరు సగభాగమై ఇమిడిపోయారు. జనన మరణాతీత స్థితిని పొందాలంటే, ఆ జననాన్ని మరణాన్ని జయించిన వారిని ఆరాధిస్తే వారి ఆశీస్సులు పొందవచ్చు. జననానికి కారణం, స్త్రీ పురుషుల మధ్య కామం. ఈ కామం మన్మథ ప్రేరితం. ఆ మన్మథుని జయించినది పరమేశ్వరుడు. తన మూడవ కంటితో మన్మథుడిని మంటపాలు చేసాడు. కాబట్టి జననాతీతమైన స్థితిని పొందాలంటే పరమేశ్వరుడిని ఆరాధించాల్సిందే! ఇక మరణాతీతమైన స్థితి రావాలంటే మరణమంటే భయం ఉండకూడదు. ఆ మరణాన్ని జయించగలిగిన వారికే మరణమంటే భయం ఉండదు. బ్రహ్మ లెక్కప్రకారం మార్కండేయునికి 16 సంవత్సరాలు ఆయుష్షు. పరమేశ్వర లింగాన్ని భక్తితో ఆలింగనం చేసుకొన్నప్పుడు యముడు కూడా అతని ప్రాణాలు తీయలేకపోయాడు.శివుని ఎడమ కాలి తోపుకి కూడా గురి అయ్యాడు. శివునిలో ఆ ఎడమ పాదం అమ్మవారిది. అందువల్ల మరణాతీతమైన స్థితి రావాలంటే అమ్మవారిని ఆశ్రయించవలసిందే. ఆది దంపతులిద్దరూ పూజనీయులు.

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ
సర్వేజనా సుఖినోభవంతు

–డా।। శ్రీరామ్, హైదరాబాద్

దేవుడు ఒక్కడే! పేర్లు అనేకం!


– పరమహంస గూఢార్థ కథలు

ఒకసారి రామచంద్రదత్త, బ్రహ్మ సమాజంలో ఉండే లోపాలను గురించి మాట్లాడటం మొదలు పెట్టాడు. అప్పుడు గురుదేవులు ఇలా చెప్పారు.

ఒక చెరువు ఉంది. దానికి అనేక ఘట్టాలున్నాయి. ఒక ఘట్టాంలో నుంచి హిందువులు బిందెలతో నీళ్ళు తీసుకుపోతున్నారు. ఆ బిందెల్లో ఏముంది? అంటే జలం! అని బదులు చెప్పారు. ఇంకో ఘట్టంలో నుంచి మహమ్మదీయులు తోలు తిత్తుల్లో నీళ్ళు తీసుకుపోతున్నారు. ఆ తిత్తుల్లో ఏముంది? అంటే పానీ! అని వాళ్ళు సమాధానం చెప్పారు. ఇంకో ఘట్టంలో నుంచి క్రైస్తవులు బక్కెట్లతో నీళ్ళు తీసుకుపోతున్నారు. ఆ బక్కెట్లలో ఉన్నది ఏమిటి? అని అడిగితే వాటర్! అని వాళ్ళు చెప్పారు.

చూడండి! ఆ నీళ్ళు తెస్తున్న వాళ్ళలో ఎవరైనా అది జలం కాదు పాని అని అన్నా పాని కాదు వాటర్ అన్నా అది హాస్యాస్పదంగా ఉండదా? వివిధ సంప్రదాయాల మధ్య ఘర్షణలకు, ఆపార్థాలకు తగదాలకు ఇదే కారణం. దీనివల్లనే మానవులు మతాల పేర్లతో ఒకరినొకరు పొడుచుకొని చంపుకుంటున్నారు. రక్తపాతం చేస్తున్నారు. ఇది ఎంతమాత్రం సమంజసమైన పని కాదు నిజానికి ప్రతివారు దేవుని వైపే పురోగమిస్తున్నరు. హృదయంలో వ్యాకులత, నిజాయితీ ఉన్నట్లయితే వాళ్ల దేవుణ్ణి దర్శింస్తారు. అని చెప్పి ఇంకా ఇలా అన్నారు:

మతాలను గురించి బోధించేవాళ్ళు ఒక రితో ఒకరు కొట్లాడుకోవడం నేను కళ్ళారా చూశాను. హిందువులు క్రైస్తవులు, ముసల్మానులు, బ్రహ్మసమాజంవారు. శాక్తేయులు, వైష్ణవులు, శైవులు– ఒకరేమిటి– అందరూ ఒకరితో ఒకరు పోట్లాడుకుంటున్నారు. ఎవడు కృష్ణుడో– వాడే శివుడు! అతడే ఆద్యాశక్తి అనీ జీసస్ అనీ అల్లా అనీ పిలువబడుతున్నాడనే జ్ఞానం వారికి లేదు. ఏక్ రామ్– హజార్ నామ్! దేవుడు ఒక్కడే కానీ



ఆయన అనేక పేర్లతో పిలువబడుతున్నారు.

సత్యం ఒక్కటే! అదే అనేక పేర్లతో వ్యవహరించబడుతున్నది. అందరూ అన్వేషించేది ఆ సత్యాన్నే! వాతావరణం, స్వభావాలు, పేర్లు మొదలైనవే భిన్నంగా కనపడడానికి కారణం. అందువల్ల తమ సరైనదని, ఇతరుల మతాలు సరైనవి కావని అనుకోవడం ఎంతమాత్రం పనికిరాదు. ఉన్నభగవంతుడు ఒక్కడే రెండు ఎన్నటికీ కాదు. ఏకమేవాద్వితీయం బ్రహ్మ

నేల, నింగిల వంతెన నిలచి చూచె
కుటజముల విరిసిన చిన్ని కుసుమ కన్నె
కనుల కింపుగ తోచగా కినుక బట్టె
పంచ రంగులు కూర్చుకు వనము చేరె
ధవళ వర్ణపు శోభల నవని పూచె



తాత్పర్యం: నేలకు, నింగికి వంతెన వేసినట్లున్న ఇంద్రధనస్సు ఎందుకో కిందకు చూచింది. చినుకుల తడికి మెరుస్తున్న చిన్నిపూవులు అందంగా కనిపించాయి. ఒక్క క్షణం వాటిపట్ల అసూయ కలిగింది. గబగబా, తన మేని రంగుల్లో ఓ ఐదింటిని తీసుకుని తోటలోకి వచ్చింది. తెలుపు రంగును బ్రతిమలాడి , ఈ నేలను పువ్వు పూచింది.

–డా..బాలు శర్మ పన్నాల, పుష్పవిలాసం

గోవు చేసే మేలు

ఆరోగ్య ప్రతిభ

జూన్, 2003లో అమెరికాలో "పేటెంటు కార్యాలయం" గోమూత్రం "యాంటీ బయాటిక్"గా పేటెంటు ఇచ్చింది. ఇది కేన్సర్, ట్యూబర్క్లోసిస్ వంటి వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు. ఈ పేటెంట్ "గోవిజ్ఞాన అనుసంధాన కేంద్రం" నాగపూర్ వారికి లభించింది.

ఈ వార్త ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలలో 'గోవు మూత్రం'పై చర్చకు కదలిక తీసుకు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పలు వైద్య విశ్వవిద్యాలయాలు "గోమూత్రం" మీద పరిశోధనలు ప్రారంభించారు. చివరకు "కాపతి" అనే శాస్త్రంగా పిలిచే స్థాయికి పరిశోధనలు చేరుకున్నాయి.మన ప్రాచీన భారతీయులకు "పంచగవ్య చికిత్స" గోమూత్ర విశిష్టత ఎప్పటి నుంచో తెలుసు. ఇదో మూఢ నమ్మకంగా చూస్తున్న ఆధునికులు ఇప్పుడిప్పుడే దీనిని గుర్తించటం ప్రారంభించారు. భారతీయులు 'గోవు'ను మాతృ భావంతో "గోమాత"గా ఆరాధిస్తారు.

గోవు సమస్త దేవాతా స్వరూపంగా భావిస్తారు. 'గోదానం' అన్ని దానాలలో శ్రేష్ఠంగా భావిస్తారు. యజ్ఞ యాగాదులలో గోమాత పాత్ర తప్పనిసరి. గోవును "కామధేనువు'గా, అనగా కోర్కెలు తీర్చే దేవతా స్వరూపంగా భారతీయ సంస్కృతి గుర్తించింది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ కూడా గోమాత ప్రాముఖ్యతని, భారతీయులకు గోమాతకూ ఉన్న అనుబంధమూ తెలియజేస్తాయి.

ఋగ్వేదం 'గోహత్య' మహాపాపంగా అభివర్ణించింది. మహాభారతంలోని 'అనుశాసనిక' పర్వంలో భీష్ముడు 'గోమతీ యాగం' గురించి, గోమాత ప్రాముఖ్యం గురించి చెబుతాడు.

గోవుల మధ్య ఏ విద్యాభ్యాసం చేస్తే ఆ అభ్యాసం పూర్తి ఫలాలనిస్తుంది. గోవు నిరంతరం తన పరిసరాలలో 'పాజిటివ్ వైబ్రేషన్స్' కలిగి ఉండి, ఉపశమన శక్తిని ప్రసాదిస్తుందని భీష్ముడు చెబుతాడు. ఇన్ని వివరణలెందుకు. భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం 1857లో "సిపాయిల తిరుగుబాటు" రూపంలో వెలికి రావటానికి కూడా 'గోవు యొక్క పవిత్రతకు' భంగం రావటమే కారణం. భారతదేశంలో బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు, శూద్రులకు ఆవు అన్నిరకాలుగా ఉపయోగపడుతుంది. పాలు ఇస్తుంది. యజ్ఞ యాగాది క్రతువులలో పాలు పంచుకుంటుంది. గోవుపాలు, పేడ, మూత్రం ఇలా అన్నీ ఉపయోగకరమైనవి. శ్రీకృష్ణుడు కూడా 'గోపాలుడుగా' భారతీయులకు అత్యంత ఆరాధ్యుడు.

పంచగవ్య సిద్ధాంతం



ఆయుర్వేద ఔషధులలో ఈ పంచగవ్యలను విరివిగా ఉపయోగిస్తారు. పంచగవ్యలు అనగా 1.ఆవుపాలు, 2. పెరుగు, 3. నెయ్యి, 4. మూత్రం, 5. పేడ. ఆయుర్వేద గ్రంథాలలో 'చరక సంహిత', 'సుశ్రుత సంహిత', 'వాగ్భట్ట సంహిత'లలో చర్మ వ్యాధులు, బొల్లి వంటి వాటి నివారణ, మూత్ర వ్యాధులు, కీళ్ల వ్యాధులు, కడుపుమంట వంటి పలు రకాల వ్యాధుల నివారణకు పంచగవ్య చికిత్స చెప్పబడింది.


భారతీయ వ్యవసాయ రంగంలో ఆవుపాత్ర విడదీయరానిది. ఆవు పేడ సహజమైన సేంద్రియ ఎరువుగా అనాదిగా మనం ఉపయోగిస్తున్నాం. ఆవు మూత్రం వేప కలిపి పంటలలో చీడల నివారిణిగా కూడా ఉపగిస్తున్నాం. ఈ రంగంలో నేడు అనేక స్వచ్ఛంద సంస్థలు విరివిగా పరిశోధనలు జరుపుతున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సంప్రదాయ ఆరోగ్య విజ్ఞానాన్ని ప్రోత్సహించటం ప్రారంభించిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా "పంచగవ్య చికిత్స'కు ప్రాముఖ్యత లభించింది. నేడు భారత్‌లోనే కాక అమెరికా, ఆఫ్రికా వంటి దేశాలలో కూడా "ఎయిడ్స్" నివారణకు ఈ 'పంచగవ్య' చికిత్సను ఉపయోగించటం ప్రారంభించారు. ఆ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి.

"పంచగవ్యాల'ను యాంటిబయోటిక్స్‌గా కూడా ఆదునికులు గుర్తిస్తున్నారు, ఉపయోగిస్తున్నారు.

సాధారణంగా పర్యావరణ శాస్త్రవేత్తలు కట్టెలు మండించటం వల్ల 'కాలుష్యం' ఎక్కువవుతుందని అంటారు. కానీ ఈ ఆవుపేడతో చేసిన పిడకలను ఉపయోగించి చేసే అగ్నిహోత్రం వలన వాతావరణంలోని 'పొల్యూషన్' తగ్గి వాతావరణం శుభ్రమవుతుందని తెలిసింది. ఇందుకు తార్కాణం భోపాల్ 'గ్యాస్' దుర్ఘటన. ఆనాడు ఆ పరిసరాలలో ఒక ఇంట్లో ప్రమాదానికి ముందు చేసిన "అగ్నిహోత్రం" వలన ఆ ఇంటివారు 'గ్యాస్' లీకేజిలో ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఆ తరువాతి పరిశోధనలలో వారు అగ్నిహోత్రంలో ఉపయోగించిన ఆవు పిడకల నుంచి ఉత్పన్నమైన పొగ వారిని రక్షించిందని తెలిసింది. గోవును రక్షించటం మన విధి. నేడు ఆవులను వీధులలో వదిలివేయకుండా 'గోరక్షణ' సమితులు వీటిని రక్షిస్తున్నాయి. ఈ ఉద్యమంలోఎక్కువగా గుజరాతీయులు, మార్వాడీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు పాలు పంచుకుంటున్నాయి. గోరక్షణ మీదనే భారత వ్యవసాయ రంగం, జీవన విధానం ఆధారపడి ఉన్నాయి. మనం గోవుని రక్షిస్తే గోవు మనలను రక్షిస్తుందిరక్షిస్తుంది.

గురుదక్షిణ



శ్రీభగవాన్ ఉవాచ

తద్విద్ధి ప్రణిపాతేన పరి3పశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినహా।।

తాత్పర్యము

తత్త్వజ్ఞానములు గురువుల దగ్గరకు వినయముగా వెళ్ళి సేవలుచేసి తగిన ప్రశ్నలు వేసి జ్ఞానమును సంపాదించుకోవాలి. వాళ్ళు నిజాన్ని దర్శించినవారు. కాబట్టి వారి మార్గదర్శనం సక్రమంగా ఉంటుంది.

నీతి

కృష్ణపరమాత్ముడు తనే ఉన్నతమైన సత్యము అంటూ భగవద్గీతలోని 7వ అధ్యాయం 7వ శ్లోకం ద్వారా చెప్పాడు. ఆయన గురించి తెలుసుకోవడం, ఆయన దివ్యత్వమును నమ్మడం వలన మనకు జనన మరణ చక్రం నుండి విముక్తి వస్తుంది.

ముఖ్యపదం: నేర్చుకునే ప్రయత్నం



బాల మకరందం

బృందావనంలో ఉన్నప్పుడు బలరామకృష్ణులను యశోద గురుకులానికి పంపలేదు. కంసుడు కారణంగా ఏ నిమిషానికి ఏమి జరుగునోనన్న భయం ఆమెది. కంసవధ జరిగాక ఆ సోదరులను సాందీపుని ఆశ్రమానికి పంపడం జరిగింది. కృష్ణుడు రాకుమారుడైనప్పటికీ, ఆశ్రమంలోని మిగిలిన విద్యార్థులందరివలే అన్ని పనులూ చేసేవాడు. అడవికి వెళ్ళి వంట చెఱుకు కూడా కొట్టి తెచ్చేవాడు. బలారామకృష్ణులు 64 కళలను 64 రోజుల్లో నేర్చుకుని గురువు సాంధీపుని ఆశీర్వచనం పొందారు. విద్యాభ్యాసం ముగిసి మధురకు తిరిగి వెళ్లేవేళ కృష్ణుడు గురువును సమీపించి, ఆయన తమ నుండి కోరే గురుదక్షిణ ఏమిటో తెలిసుకోగోరాడు. సాంధీపుని ఒక్కగానొక్క కుమారుడు చిన్నప్పుడు సముద్రంలో కొట్టుకుపోయాడు. ఆయన ఆ సోదరులకు అసాధ్యమైనది ఏదీ లేదు కాబట్టి తన బిడ్డను తనకు తెచ్చి అప్పంగించమని కోరాడు. బలరామకృష్ణులు అందుకు అంగీకరించారు. పాంచజన్యుడు అనే రాక్షసుడు శంఖు రూపంలో ఉండి, సముద్రాన్ని కబళించి ఉన్నాడు. కృష్ణబలరాములు ఆ రాక్షసుడిని చంపి, గురుపుత్రుని కాపాడారు. ఎంతో కాలం క్రితం తప్పిపోయిన కుమారుడు తిరిగి వచ్చినందుకు గురువు, గురుపత్ని చాలా సంతోషించారు. కృష్ణుడు శంఖమును తన వద్ద ఉంచుకున్నాడు.

గ్రహించవలసిన లక్షణం: గురువు యందు ఆదరణ

–డా।। హరెక్రిష్ణ చంద్రశేకరన్

జల్లికట్టు ఆరంభం.. ఇద్దరి పరిస్థితి విషమం

చెన్నై: తమిళనాడులో పొంగల్ వేడుకల్లో భాగంగా నిర్వహించే సంప్రదాయ సాహస క్రీడ జల్లికట్టు ఘనంగా ప్రారంభమైంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో సంప్రదాయ క్రీడ జల్లికట్టు నిర్వహించేందుకు పలు ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. జల్లికట్టు నిర్వహణకు ప్రసిద్ధిగాంచిన అలంగనల్లూర్లో ఆటగాళ్లు ఎద్దులను సిద్ధం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలైన అవనియాపురం, పాలమేడు వంటి ప్రాంతాల్లోనూ జల్లికట్టుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సంక్రాంతి పండుగకు జల్లికట్టు నిర్వహించడం తమిళుల ఆనవాయితీగా వస్తోంది. వారం రోజుల పాటు ఈ క్రీడను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. మరోవైపు పుదుకొట్టై జిల్లా తసంగుర్చిలో తొలి జల్లికట్టు పోటీలను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విజయ భాస్కర్ ప్రారంభించారు. పోటీలో భాగంగా 300 ఎద్దులను అదుపు చేయడానికి 400 మంది యువకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

యూపీలో కొత్త పొత్తులకు రాహుల్ తహతహ



ఢిల్లీ: సమాజ్‌వాదీ, బహుజన్ పార్టీల పొత్తు నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లౌకికవాద పార్టీలను కాంగ్రెస్ కలుపుకుని ముందుకెళ్లాలన్న యోచనలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఉన్నట్లు తెలుస్తోంది. మీడియాలో వచ్చిన కథనాల ప్రకారం.. ప్రగతిశీల్ సమాజ్‌వాదీ పార్టీలోహియా(పీఎస్పీఎల్) అధ్యక్షుడు శివపాల్ యాదవ్ తో పార్టీతో జట్టు కట్టనున్నారు. అయితే సీట్ల పంపకాల విషయంలో వారి మధ్య సయోధ్య కుదరలేదని సమాచారం. తన పార్టీకి 15 సీట్లు కేటాయించాలని శివపాల్ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానం అప్నా దళ్, అజిత్ సింగ్ పార్టీ ఆర్ఎల్డీ తో చర్చలు జరుపుతోంది. ఎస్పీబీఎస్పీలు కాంగ్రెస్‌ను దూరం పెట్టడంతో ఆ పార్టీని బలోపేతం చేసేలా అధ్యక్షుడు రాహుల్ గాంధీ చర్యలకు ఉపక్రమించారని ఓ మీడియా సంస్థ వెల్లడించింది. ఫిబ్రవరి నెలలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం మొత్తంలో 15 ర్యాలీలు నిర్వహించాలని, రైతుల సమస్యలనే ప్రధానంగా లేవనెత్తాలని యోచిస్తున్నట్లు సమాచారం. అలాగే మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణమాఫీని అమలు చేయడాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని భావిస్తోంది. ఈ ప్రచార కార్యక్రమాలను హాపుర్ జిల్లా నుంచి మొదలు పెట్టాలని, తరవాత మొరాదాబాద్, షహరాన్పూర్, బరేలీ తదితర ప్రాంతాల ద్వారా కొనసాగించాలనుకుంటుంది. పొత్తు ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ..'వారు రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం ఇప్పుడు మా వంతు. మా పూర్తి సామర్థ్యంతో ఈ ఎన్నికల్లో పోటీ పడతాం' అని వ్యాఖ్యానించారు..

ఉత్కంఠగా కర్ణాటకం

(మొదటిపేజీ తరువాయి) అయితే లోక్‌సభ ఎన్నికల్లోగా తమ ప్రభుత్వం ఏర్పాటయితేనే.. ఎంపీ స్థానాలు ఎక్కువగా గెలుచుకునే అవకాశాలుంటాయని బీజేపీ భావిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ప్రయత్నాలు కూడా ఆరంభించనట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లోని అసంతృప్త ఎమ్మెల్యేలతో బీజేపీ నేతలు చర్చలు జరుపుతున్నట్టుగా కథనాలు వస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో జేడీ(ఎస్), కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే.. తమకు నష్టం జరుగుతుందన్న భయంలో బీజేపీ ఉందని, అందుకే సంకీర్ణ సర్కారులో చిచ్చు రేపి పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తోందంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగానే బీజేపీ క్యాంపు రాజకీయాలు మొదలు పెట్టిందంటున్నారు.

తమ పార్టీ ఎమ్మెల్యేలు 104 మందిని రిసార్టులకు చేర్చిందని తెలుస్తోంది. దీంతో కర్ణాటకలో రాజకీయ మార్పు జరుగుతుందన్న ప్రచారం మరింత జోరుగా సాగుతోంది. 120 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్, జేడీ(ఎస్) కూటమి నుంచి కనీసం 14 మందిని చేర్చుకోవడమో లేదా.. వారితో రాజీనామా చేయిస్తే బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశముంటుంది. ఈ దిశలో ఆ పార్టీ ప్రయత్నాలు సఫలమైతే.. సంక్రాంతి తరువాత కర్ణాటకలో బీజేపీ సర్కారు ఏర్పడుతుందన్న కథనాలు వెలువడుతున్నాయి.

ముగ్గురు ఎమ్మెల్యేలు మాయం

ఈ సమయంలో కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేలు ముగ్గురు కన్పించకుండా పోవడంతో బీజేపీ వారిని దాచిందన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. తమ ఎమ్మెల్యేలతో బీజేపీ బేరసారాలు చేస్తోందంటూ ఈ ప్రచారానికి తోడుగా కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ ముఖ్యనేత డీకే శివకుమార వ్యాఖ్యానించారు. మాయమైన ముగ్గురు ఎమ్మెల్యేలు ముంబాయిలోని బీజేపీ నేతలతో ఉన్నారని కూడా ఆయన ప్రకటించారు. దీంతో కర్ణాటక రాజకీయం రసవత్తరంగా మారిపోయింది.

టచ్‌లోనే ఉన్నారు: సీఎం కుమార స్వామి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముగ్గురు తనతో టచ్‌లోకి వచ్చారని ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రకటించారు. వారు ముగ్గురు తమ సొంత పనుల మీద ముంబాయికి వెళ్లారని ఆయన తెలిపారు. అయితే తమ సంకీర్ణాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు బీజేపీ చేస్తోందని, అయితే వారి ప్రయత్నాలను తాము వమ్ము చేస్తున్నామంటూ ప్రకటించారు. కాంగ్రెస్ కర్ణాటక అధ్యక్షుడు దినేష్ గుండూరావు మాట్లాడుతూ తమ సంకీర్ణ సర్కారుకు ముప్పు లేదంటూ వ్యాఖ్యానించారు. ముంబాయిలో ఉన్న తమ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోనే ఉంటారని చెప్పారు. అటవీ శాఖ మంత్రి సతీశ్, ఎమ్మెల్యే గణేశ్ హుక్కేరి బీజేపీలో చేరుతారంటూ ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ తాము బీజేపీలో చేరమని ప్రకటించారు. ఎమ్మెల్యే గణేశ్ హుక్కేరి బీజేపీలో చేరుతానంటూ ఆదివారం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో కలకలం రేగడంతో తాను సరదాగా ఉన్నానని హుక్కేరి వివరణిచ్చారు.

మా ఎమ్మెల్యేలనే ప్రలోభ పెడుతున్నారు: యెడ్యూరప్ప

తమ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టేందుకు కాంగ్రెస్, జేడీ(ఎస్) సర్కారు కుట్ర పన్నుతోందని బీజేపీ కర్ణాటక శాఖ అధ్యక్షుడు బీఎస్ యెడ్యూరప్ప ఆరోపించారు. తమ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు, డబ్బు ఎర వేస్తున్నారని ఆయన తెలిపారు.

కర్ణాటకలో 224 స్థానాలు, పార్టీల బలాబలాలు.
బీజేపీ– 104
కాంగ్రెస్– 80
జేడీ(ఎస్)–37
బీఎస్పీ–01
స్వతంత్రులు –02

సీపీకి షర్మిల ఫిర్యాదు



విజయక్రాంతి, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న అభ్యంతర వ్యాఖ్యలను వైఎస్ఆర్సీపి నేత షర్మిల తీవ్రంగా ఖండించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్సీపి సీనియర్ నేతలతో కలిసి సోమవారం హైదరాబాద్ సీపీ కార్యాలయానికి వెళ్లిన షర్మిల ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం బాధాకరమని, వీటి వెనుక టీడీపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు.

'నాకూ, ప్రభాస్‌కు సంబంధం ఉందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు. నా జీవితంలో ప్రభాస్‌ను ఎప్పుడూ కలవలేదు, ఆయనతో మాట్లాడలేదు. 2014 ఎన్నికల ముందు కూడా ఇలాంటి ప్రచారాలే చేశారు. అప్పుడు పోలీసులు చర్యలు తీసుకోవడంతో కొంతకాలం ఆగింది. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ ఈ దుష్ప్రచారాన్ని మొదలుపెట్టారు. దీని వెనుక టీడీపీ హస్తం ఉంది' అని షర్మిల ఆరోపించారు. ఇది తన ఒక్క దానికే జరిగిన అవమానంగా భావించట్లేదని, స్త్రీల పట్ల చులకనభావంతో రాస్తున్న రాతలను, దుష్ప్రచారాన్ని మన సమాజం ఆమోదించవచ్చా? అని షర్మిల ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, మానవహక్కులు, సమానత్వం లాంటి గొప్ప గొప్ప పదాలు కాగితాలకు, చర్చలకు మాత్రమే పరిమితం కాకూడదన్నారు. ఇవి వాస్తవ రూపం దాల్చాలంటే మనం గొంతెత్తాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ప్రచారాలకు వీలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్న తన ఫిర్యాదుకు ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టులు, మహిళలు మద్దతు పలకాలని కోరారు. షర్మిల, భర్త అనిల్ కుమార్‌తో కలిసి కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. వీరితో పాటూ కమిషనర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వాసిరెడ్డి పద్మ ఉన్నారు.సామాజిక మాధ్యమాల్లో తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ వైఎస్ షర్మిల చేసిన ఫిర్యాదుపై హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ స్పందించారు. షర్మిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాల్సిందిగా సీసీఎస్ పోలీసులను సీపీ ఆదేశించారు. ఐపీసీ 509, 67 ఐటీ చట్టం కింద సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేసేందుకు సైబర్ క్రైమ్ అదనపు డీసీపీ రఘువీర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

శబరిమలలో మకరజ్యోతి దర్శనం

(మొదటిపేజీ తరువాయి) సరిగ్గా ఆరున్నరకు దీపారాధన కార్యక్రమంతో పాటు, స్వామికి దివ్యాభరణాలు ధరింపజేసే 'తిరువాభరణ' ఘట్టం నిర్వహించారు. స్వామిని ఆభరణాలతో అలంకరించి హారతి ఇచ్చే సమయంలోనే.. ఆలయానికి ఈశాన్య దిశలో ఉండే పర్వతాలపై మకరజ్యోతి దర్శనమిచ్చింది. పొన్నాంబల మేడు నుంచి మకరజ్యోతి రూపంలో మణికంఠుడిని కనులారా వీక్షించిన అయ్యప్పలు తన్మయత్వంతో పులకించి పోయారు. ఈ సందర్భంగా స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తుల శరణుఘోషతో శబరిగిరులు మార్మోగాయి. ఈ మకరజ్యోతి దర్శనం వేయి జన్మల పుణ్యఫలంగా మాలలు ధరించిన అయ్యప్ప భక్తులు భావిస్తారు. మకరజ్యోతి దర్శనం కోసం సుమారు 18 లక్షల మంది అయ్యప్ప భక్తులు శబరిమల వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మకర జ్యోతి దర్శనం కోసం పంబానది, సన్నిధానం, హిల్‌టాప్, టోల్ పాజా వద్ద ట్రావెన్‌కోర్ దేవస్థానం ఏర్పాట్లు చేసింది. అలాగే 6 వేల మంది పోలీసులతో భద్రత కల్పించారు. కాగా మహిళల ప్రవేశంపై గత ఏడాది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో శబరిలమలలో ఈ ఏడాది ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనవరి ఆరంభంలో 50 ఏళ వయసులోపు ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించారన్న వార్తల నేపథ్యంలో హిందూ సంస్థల బంద్ , అనంతర పరిణామాలతో గత కొన్ని రోజులుగా ఆలయ పరిసరాలతోపాటు కేరళ వ్యాప్తంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో మకర జ్యోతి దర్శనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు భారీ ఏర్పాట్లు చేసింది. కాగా ఈనెల 19 వరకు అయ్యప్ప స్వామిని భక్తులు దర్శించుకోవచ్చు. 20న పందళ రాజవంశీకులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయాన్ని మూసివేస్తారు.

పదవుల పందేరానికి కసరత్తులు

(మొదటిపేజీ తరువాయి) పూర్తి స్థాయి మంత్రివర్గం ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారని ప్రభుత్వ, పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తొలిదశలో ఆరు నుంచి ఎనిమిది మందికి మంత్రులుగా అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. ఎనిమిది మందికి అవకాశం కల్పిస్తే, ప్రస్తుతం ఉన్న ఇద్దరితో కలిపి పది మంది అవుతారని, వీరితో పార్లమెంటు ఎన్నికలకు వెళ్లి అనంతరం మరో ఎనిమిది మందికి అవకాశం కల్పిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం ఎప్పుడు ఏర్పాటు చెయ్యాలన్న దానిపై ఈనెల 16వ తేదీన ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని, దానికి అనుగుణంగా ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలని సాధారణ పరిపాలనశాఖ అధికారులకు ముఖ్యమంత్రి కార్యాల యం నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున ఎన్నికల నియమావళి మంత్రివర్గం ఏర్పాటుకు అడ్డువస్తుందని కొంత మంది పేర్కొన్నప్పటికీ, పార్టీ రహితంగా జరుగుతున్న ఎన్నికలు కావ టం, రాష్ట్రంలో పరిపాలనకు సంబంధించి మంత్రివర్గం ఏర్పాటు అవుతున్నందున దీనికి నియమావళికి సంబంధం ఉండదని ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది. దీనితో పాటు ఈనెల 17వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారం భం అవుతుండటం, ఈ సమావేశాలలోనే స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలని నిర్ణయించినందున మంత్రి వర్గం పరిమిత స్థాయిలోనే విస్తరణ ఉంటుందని సాధారణ పరిపాలన శాఖ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

ఆశావహుల హడావుడి

పదవుల భర్తీకి సంబంధించి ముఖ్యమంత్రి పలువురితో చర్చిస్తుండటంతో శాసన సభ్యులు, మండలి సభ్యులు, గత ఎన్నికలలో టిక్కట్లు దక్కనివారు తమకి తప్పకుండా ఏదో ఒక పదవి దక్కుతుందనే ఆశలో ఉన్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రిని, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి.రామారావును కలిసి తమ పేర్లు పరిశీలించాలని కోరుతున్నారు. పదవులు ఆశించే వారు పార్టీకార్యాలయాన్ని, ప్రగతిభవన్ సందర్శిస్తూ తమ అవకాశాలపై పార్టీ, ప్రభుత్వ వర్గాల నుంచి ఆరా తీస్తున్నారు. పదవులు ఎవరికీ కేటాయించాలన్న దానిపై ముఖ్యమంత్రిదే తుది నిర్ణయం అయినప్పటికి ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. రాష్ట్ర శాసన సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ విప్ పదవులు, మంత్రివర్గ విస్తరణ ముందుగా జరుగుతున్నందున శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే స్పీకర్ పదవి గురించి పలువురు శాసన సభ్యులతో ముఖ్యమంత్రి మాట్లాడినట్లు తెలిసింది. స్పీకర్ ఎవరన్నది నిర్ణయిస్తే డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్ పదవుల ఎంపిక జరుగుతుందని తెలిసింది.

పార్లమెంటరీ కార్యదర్శుల నియామకంపై కసరత్తు

మరోవైపు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత అనుభవంతో పాటు ఇతర రాష్ట్రాల విధానాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ప్రభుత్వ పరంగా హోదాలు కాకుండా శాసనసభ పరంగా హోదా ఇచ్చే విధంగా కార్యాచరణ ఉండాలని అధికారులకు సీఎం సూచించినట్లు తెలిసింది. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఆరుగురు పార్లమెంటరీ కార్యదర్శులను నియమించగా, అప్పట్లో హైకోర్టు వారి నియామకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఎలాంటి చిక్కులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కొన్ని రాష్ట్రాల్లో పార్లమెంటరీ కార్యదర్శులు ఉన్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు, సాంకేతిక అంశాల పరిశీలన కోసం న్యాయ నిపుణులకు బాధ్యతలు అప్పగించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఏం చేస్తే బాగుంటుంది? ఎలాంటి విధానాలను అనుసరించాలన్న విధానంపై కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా కాకుండా శాసనసభ పరంగా పార్లమెంటరీ కార్యదర్శుల హోదా ఇవ్వాలనే ప్రతిపాదనలు కూడా పరిశీలించాలని సీఎం ఆదేశించడంతో అధికారులు ఈ పదవుల నియామకాలపై తీవ్ర కసరత్తు చేస్తున్నారు. శాసనసభ పరంగా హోదా ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాబోవని, చట్ట సభలకు సంబంధించిన అంశాలపై న్యాయస్థానం కూడా తప్పుపట్టే అవకాశాలు ఉండవని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కార్యకలాపాలు, ఆయా శాఖలకు సంబంధించి అవగాహనకు రావాలన్న ఉద్దేశంతోనే పార్లమెంటరీ కార్యదర్శుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేసీఆర్ ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. శాసనసభ, మండలిలో ప్రభుత్వ విప్ పదవులలాగే పార్లమెంటరీ కార్యదర్శుల నియామానికి వీలుందని అధికారులు అంటున్నారు. అయితే ఇందుకోసం, శాసనసభ, మండలి నిబంధనలను సవరించాల్సి ఉంటుందని తెలుస్తోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పార్లమెంటరీ కార్యదర్శుల నియామాక ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

కన్నయ్య కుమార్‌పై 1200 పేజీల ఛార్జిషీట్

- దేశద్రోహం, క్రిమినల్ కుట్ర, అల్లర్లకు ప్రేరేపణ వంటి సెక్షన్ల నమోదు
- పాటియాలా హౌజ్ కోర్టుకు సమర్పించిన ఢిల్లీ పోలీసులు
- ఎన్నికల వేళ దాఖలు వెనక రాజకీయ కుట్ర ఉందని కన్నయ్య ఆరోపణ



న్యూఢిల్లీ: ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్‌పై సోమవారం ఛార్జిషీట్ నమోదైంది. 2016లో ఆయనతో పాటు పలువురిపై నమోదైన దేశద్రోహం కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు పలు సెక్షన్ల కింద అభియోగ పత్రం రూపొందించారు. కన్నయ్య కుమార్‌తో పాటు విద్యార్థి సంఘం నాయకులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ బట్టాచార్య, అక్విబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రయీరా రసూల్, బషీర్ భట్‌తో పాటు పలువురి పేర్లు కూడా ఇందులో ఉన్నట్లు ఢిల్లీ పోలీస్ కమిషనర్ అమూల్య పట్నాయక్ తెలిపారు. వీరు చేసిన నినాదాలకు సంబంధించి చిత్రీకరించిన వీడియో సరైనదేనని ధ్రువీకరణ జరిగిందని పేర్కొన్నారు. ఈ ఛార్జిషీట్‌లో షీలా రషీద్‌తో పాటు సీపీఐ నేత డా.రాజా కుమార్తె అపరాజిత రాజా పేర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దేశద్రోహం(124ఎ), క్రిమినల్ కుట్ర(120బీ), అల్లర్లకు ప్రేరేపణ(147), అనుమతి లేకుండా సమావేశం కావడం(143) వంటి సెక్షన్ల ద్వారా వారిపై అభియోగాలు నమోదు చేశారు. దేశ వ్యతిరేక నినాదాలు చేశారన్న ఆరోపణలపై 1200 పేజీలతో కూడిన ఛార్జిషీట్‌ను సోమవారం ఢిల్లీలోని పాటియాలా హౌజ్ కోర్టులో సమర్పించారు. కోర్టు మంగళవారం దీన్ని పరిశీలించి విచారణ జరపనుంది. పార్లమెంటుపై దాడి ఘటనలో సూత్రధారి అఫ్జల్ గురుకు ఉరిశిక్ష విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2016 ఫిబ్రవరి 9న జేఎన్‌యూ క్యాంపస్‌లో కన్నయ్యతో పలువురు విద్యార్థి నాయకులు ఆందోళన నిర్వహించారు. ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అఫ్జల్ గురుకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కన్నయ్యకుమార్‌తో పాటు జేఎన్‌యూ విద్యార్థులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య తదితరులు భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఢిల్లీ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. అయితే వారికి మద్దతుగా నాడు జేఎన్‌యూ సహా, దేశ రాజధానిలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

మరోవైపు ఘటన జరిగిన మూడేళ్ల తరువాత ఢిల్లీ పోలీసులు సోమవారం ఛార్జిషీట్‌ను దాఖలు చేయడంపై కన్నయ్య కుమార్ స్పందించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ ప్రభుత్వం తనపై కక్ష్యసా ధింపులో భాగంగా అభియోగాలు నమోదు చేసిందని ఆయన విమర్శించారు. 'ఛార్జిషీట్ దాఖలు చేసిన మాట వాస్తవమైతే.. అందుకు నేను పోలీసులకు, మోదీజీకి కృతజ్ఞతలు తెలియజేస్తాను. మూడేళ్ల తర్వాత ఎన్నికల ముందు దీన్ని దాఖలు చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇలా చేశారని స్పష్టమవుతోంది. నా దేశ న్యాయవ్యవస్థపై నాకు పూర్తి నమ్మకం ఉంది' అని కన్నయ్యకుమార్ అన్నారు.

ప్రధాని మోదీకి ఫిలిప్ కొట్లెర్ పురస్కారం



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యుత్తమ నాయకత్వానికి 'పీపుల్ ప్రాఫిట్ ప్లానెట్' అంశాల ప్రాతిపదికన అందించే ఫిలిప్ కొట్లెర్ ప్రెసిడెన్షియల్ అవార్డు వరించింది. సోమవారం ఢిల్లీలో మోదీ ఈ పురస్కారం అందుకున్నారని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 'మోదీ దేశానికి చేస్తున్న నిస్వార్థ సేవ ఫలితంగా ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో మంచి వృద్ధి కనిపించిందని తయారీ, ఐటీ ఇతర ప్రొఫెషనల్ సేవలకు కేంద్రంగా భారత్‌కు గుర్తింపు మోదీ నాయకత్వంలోనే జరిగిందని' పురస్కార పత్రంలో పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ప్రొఫెసర్ ఫిలిప్ కొట్లెర్ పేరుపై ఈ పురస్కారాన్ని అందజేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఫిలిప్ కొట్లెర్ నార్తర్న్ విశ్వ విద్యాలయంలోని కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో మార్కెటింగ్ విభాగంలో సీనియర్ ఆచార్యుడిగా ఉన్నారు.

అసెంబ్లీ భద్రత పై సమావేశం



విజయక్రాంతి, హైదరాబాద్: శాసనసభ సమావేశాలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 17 వ తేదీనుంచి శాసనసభ,మండలి సమావేశాలు జరుగుతున్నందున తీసుకోవాల్సిన భద్రతపై ఆయన సోమవారం ఉన్నతాధికారులతో అసెంబ్లీ కమిటీ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు,అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహా చార్యులు పాల్గొన్నారు.17న సభ్యుల ప్రమాణ స్వీకారం,18న సభాపతి ఎన్నిక,19న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉన్నందున భద్రతా పరం గా అప్రమత్తంగా వ్యవహరించాలని స్వామిగౌడ్ ఆదేశించారు.

కెరీర్ కు సంబంధించిన సలహాలు,సూచనలు ఉచితం

- చండీగఢ్ యూనివర్సిటీ మీడియా హెడ్ : ప్రొఫెసర్ ప్రభ్ దీప్ సింగ్

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ విద్యార్థులకు కెరీర్ పరంగా ఉచితంగా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా శ్రీకారం చుట్టిన లక్ష్య ప్రచారాన్ని చండీగఢ్ యూనివర్సిటీ మీడియా హెడ్ ప్రొఫెసర్ ప్రభ్ దీప్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమాజీగూడలోని ప్రాంతీయ కార్యాలయంలో మాట్లాడిన ఆయన తెలంగాణ విద్యార్థులకు సంవత్సరం పొడుగున కెరీర్ కు సంబంధించిన సలహాలు, సూచనలు ఉచితంగా ఇస్తామన్నారు ప్రభ్ దీప్ సింగ్ తెలిపారు. పదవతరగతి, ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చి సలహాలు సూచనలు పొందవచ్చని సూచించారు. అయితే ఈ సేవలు పొందగోరే విద్యార్థులు సైకోమెట్రి పరీక్ష పాస్ అవ్వాల్సి ఉంటుందని తెలిపారు. మారుతున్న పరిస్థితులపై విశ్వవిద్యాలయాలు దృష్టిసారించి తదనుగుణంగా తమ ఆకాడమిక్ సిలబస్ ను నవీకరించుకోవాల్సిన అవసరముందని సింగ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం కొత్తతరం ప్రోగ్రాంలు రూపొందించేందుకు విద్యాసంస్థలకు ఇప్పుడు డిమాండ్ ఏర్పడిందన్నారు. చండీఘఢ్ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం తెలంగాణకు చెందిన 250మంది విద్యార్థులు వేర్వేరు వృత్తి విద్యాకోర్సులు చదువుతున్నారని సింగ్ వెల్లడించారు. యూనివర్సిటీలో చదువుతున్న 2018 బ్యాచ్ లో 50 మంది విద్యార్థులకు గాను 43 మంది తెలంగాణ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్ మెంట్ లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పంచాయతీ పోరు.. గుర్తులతో గందరగోళం..!

విజయక్రాంతి, మంథని: పార్టీ రహితంగా జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల సంఘం గుర్తులకు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 21న జరుగనున్నది. అయితే ఈ గుర్తులు ఒకదానితో మరోకటి దగ్గరి పోలికలు ఉండటంతో అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తును పోలి ట్రక్కు గుర్తు ఉండటం, కారు గుర్తు అనుకొని ఓటర్లు పెద్ద ఎత్తున ట్రక్కు గుర్తుకు ఓట్లు వేశారనే ప్రచారం జరిగింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పంచాయతీ ఎన్నికల్లో జరిగే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేరు లేకుండా బ్యాలెట్ పేపర్ ఉంటుంది. అభ్యర్థికి అల్ఫాబెటికల్ ఆర్డర్‌లో నెంబర్‌తో పాటు గుర్తును కేటాయిస్తారు. అంతే కానీ అభ్యర్థి పేరు గానీ, ఫోటో కానీ బ్యాలెట్ పేపర్‌లో ఉండదు. ఓటు వేసే వాళ్లు తమ అభ్యర్థి సీరియల్ నెంబర్ అయినా గుర్తు పెట్టుకోవాలి..లేదంటే అభ్యర్థికి వచ్చిన గుర్తునైనా గుర్తు పెట్టుకోవాలి. అయితే ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తుల్లో తొందరగా గుర్తు పట్టని గుర్తులు ఉండటం, ఒకదానితో మరోటి పోలినట్లు ఉండటం గ్రామీణ నిరక్షరాస్య ఓటర్లు, వృద్ధ ఓటర్లు అయోమయానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ధర్మపురి దేవాలయంలో భక్తుల రద్దీ

విజయక్రాంతి, ధర్మపురి: ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం సోమవారం భోగి పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం గోదావరిలో భక్తులు పవిత్ర స్నానాలను చేసి స్థానిక దైవాలైన శ్రీ లక్ష్మీనృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శించి మొక్కులను చెల్లించుకున్నారు. ధర్మపురి అయ్యప్ప స్వామి దేవాల యంలో అభిషేకం తదితర ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ పూజలలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



ఘనంగా పతంగుల పోటీ



విజయక్రాంతి, నిజామాబాద్అర్బన్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు సోమవారం కైట్ ఫేస్టివల్‌ను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో గల ప్రభుత్వ ఐటిఐలో పతంగుల పోటీని తెలంగాణ జాగృతి యూత్ కన్వీనర్ మహ్మద్ రేహన్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ ఎసీపీ శ్రీనివాస్ కుమార్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ జాన్‌సాంసన్‌లు కైట్ ఫెస్టీవల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులను అందచేశారు. స్వయంగా పతంగులను ఎగురవేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతిరావులతో పాటు జాగృతి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబరమంటే సంక్రాంతి సంబరం

(మొదటిపేజీ తరువాయి) ఉత్తరాయణం ప్రారంభమవుతుంది.. ఉత్తరాయణ కాలం అన్ని శుభాలకు అనుకూలం కావడంతో ఇతర పండగలకు లేని మరో ప్రత్యేకత కూడా సంక్రాంతికి ఉంది. ఈ హేమంత ఋతువులో పంటలు చేతికందడంతో ఆల్లాసంగా, ఉత్సాహంగా దీన్ని జరుపుకోవడానికి ప్రజలకు ఆర్థిక బాధకూడా లేకపోవడంతో పల్లెసీమలు నూతన శోభతో కనువిందు చేస్తాయి.. రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో బంతిపూల ససిడి కాంతులతో ముంగిళ్లు వినూత్న అందాలతో అలరారుతాయి.. ఉదయాన్నే గంగిరెద్దుల గంటల గలగలలు, హరిదాసుల సంకీర్తనా రాగాలతో, తుంబుర నాదాలతో వాడలన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడుతాయి. దేశమంతా జరుపుకునే పండుగే అయినా.. తెలుగు ప్రజలు ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు.. కోస్తాంధ్రలో కోడిపందేల కోలాహలం అంబరాన్ని అంటితే.. తెలంగాణలో అంబరాన్ని తాకుతూ రంగు రంగుల పతంగుల సందడి చేస్తాయి.. తెలుగునేలంతా పండగ ఆచారాలు ఒకటే అయినా.. తెలంగాణలో మాత్రం ఈ పండగ సందర్భంగా గాలిపటాలను ఎగురవేయడం ఆనవాయితీ.. అందుకే ఈ పండుగ 'కైట్స్ ఫెస్టివల్' కూడా ఈ సందర్భంగా పభుత్వం ఇంటర్నేషనల్ కైట్స్ ఫెస్టివల్‌ను ప్రత్యేకంగా నిర్వహిస్తోంది.. దేశ, విదేశాల నుంచి నిపుణులు హైదరాబాద్ చేరుకుని



మూడు రోజులపాటు పతంగులను ఎగురవేసి నగర ప్రజలను అలరింప చేస్తారు. మరోవైపు నగరంలో వివిధ జిల్లాల వారు నివసిస్తుండటం వల్ల పండగ సందర్భంగా వేలాదిమంది నగరవాసులు సొంత ఊర్లకు తరలిపోవడంతో నగరం బోసి పోయింది. తక్కిన పండగలకు ఇలా పెద్ద ఎత్తున తరలి పోవడం ఉండదు.. ఈ విధంగా కూడా సంక్రాంతి ఓ ప్రత్యేకతను సంతరించుకుంది.

కబ్జాపై సామాన్యుడి విజయం

విజయక్రాంతి, హైదరాబాద్: బల్దియా ఆటస్థలం రోడ్ ను కబ్జా చేసి అక్రమంగా చేపట్టిన నిర్మాణం పై ఓ సామాన్యుడు న్యాయ పోరాటం చేసి విజయం సాధించాడు. ప్రతివాదులైన కబ్జాదారులు న్యాయస్థానంలో సాక్ష్యాదారాలు సమర్పించకపోవటాన్ని తప్పు పడుతూ సిటీ సివిల్ కోర్టు నాలుగో జూనియర్ సివిల్ జడ్జి కేసు కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చారు. దాంతో అప్పటి వరకు కబ్జాదారు తెచ్చుకున్న స్టే రద్దు అయినట్లు కబ్జాపై న్యాయస్థానాన్ని ఆశ్రయించిన జన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట నారాయణ తెలిపారు. జీహెచ్ ఎంసీ నిబంధనలు తుంగలో తొక్కుతూ నిర్మాణం జరిపినట్లు పేర్కొన్నారు. స్టే తొలగటంతో ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తెస్తూ విజయక్రాంతి ఓ కథనం ప్రచురించిన విషయం విదితమే. నగరంలోని అంబర్‌పేట మండలం సీఈ కాలనీ సమీపంలో అయ్యప్పగుడి రోడ్‌లో ఈ కబ్జా ఘటన చోటు చేసుకుంది.

గాడి తప్పిన టౌన్ ప్లానింగ్



గతంలో విజయక్రాంతి ప్రచురించిన కథనం

ఘనంగా గోదాదేవి కళ్యాణం

విజయక్రాంతి, పెద్దపల్లి: సుల్తానాబాద్‌లోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాయకుల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై వ్రతానికి సంబంధించి 30 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాశురాలను గోదాకృష్ణ అష్టోత్తర విష్ణు సహస్రనామ పారాయణాలు చేశారు. మంగళహారతులతో స్వామివారిని సేవించారు. అనంతరం గోదా రంగనాయకుల కళ్యాణాన్ని జరిపించారు. అర్చకులు వెంకటా చార్యులు, వేణుమాధవా చార్యులు, శ్రావణకుమార్‌చార్యులు, రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటి చైర్మన్ పల్లా మురళి, డైరెక్టర్ సాదుల భాస్కర్, వెంకటేశ్వర దీక్ష స్వాములు సాదుల సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా భోగి మంటలతో వేడుకలను సుల్తానాబాద్‌లో వైభవోపేతంగా నిర్వహించారు. తెల్లవారు జామున భోగి మంటలు కగుతూ హరిదాసుల నృత్యాలతో, గంగిరెద్దుల ఆటలతో, మహిళల



కోలాటాలతో నిర్వహించిన వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. ప్రస్తుత ఆధునిక జీవన పరిస్థితుల్లో గత సాంప్రదాయాలను అడుగడుగునా చాటుతూ నిర్వాహకులు వేడుకలను జరపడం విశేషం. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి పండుగలు ప్రజలందరిని ఒక్కటి చేసి సంస్కృతిని కాపాడతాయని అన్నారు.

రెచ్చిపోయిన దొంగలు నాలుగిళ్లలో చోరీ

విజయక్రాంతి, వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సింగారపు కాలనీలో ఆదివారం అర్ధరాత్రి నాలుగు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. కాలనీలోని ఇండ్లకు గొల్లాలు పెట్టి దొంగలు బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. కాలనీవాసులు మేల్కొని సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారికి ఫోన్లలో సమాచారం అందించగా, వారు తిరిగి వచ్చి దొంగలు ఎత్తుకెళ్ళిన సొమ్ము వివరాలను పోలీసులకు తెలిపారు. కాలనీలో అద్దెకు ఉంటున్న శకర్‌నాయక్ ఇంట్లో 7 తులాలన్నర బంగారం ఆభరణాలు, అరకిలో వెండి ఆభరణాలు, రూ.40 వేలు నగదు, శ్రీనివాస్ ఇంట్లో రెండు తులాలన్నర బంగారం, రవీందర్ ఇంట్లో మూడు తులాలన్నర బంగారం, రూ.4 వేలు నగదు, చంద్రశేఖర్ ఇంట్లో రూ.20 వేలు చోరీకి గురయ్యాయి. నాలుగు ఇండ్లలో 12 తులాల బంగారం, అరకిలో వెండి, రూ.60 వేలు దొంగిలించబడ్డాయని బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వికారాబాద్ సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మల్లన్న బ్రహ్మోత్సవాలు



విజయక్రాంతి, వరంగల్ అర్బన్: భక్తుల కొంగుబంగారం, కోరిన కోర్కెలు తీర్చే కోరమీసాల స్వామి ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం భోగి పండుగతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మల్లన్న సన్నిధికి వచ్చి స్వామి వారి సేవలో తరించారు. బోనం వండి, పట్నాలు వేసి మల్లన్నకు మొక్కులు సమర్పించారు. ఇక శివసత్తుల నృత్యాలు, ఆలయంలో వరం పడుతున్న మహిళలు, ఒగ్గు పూజారుల డోలు చప్పుళ్లతో ఐలోని మల్లన్న సన్నిధి భక్తి పారవశ్యంతో నిండిపోయింది.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు: ఐనలోని మల్లికార్జున స్వామిని మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీలు సీతారాం నాయక్, రాజ్యసభ సభ్యులు బండా ప్రకాష్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రైతు సమన్వయ కమిటీ సభ్యులు నాగుర్ల వెంకటేశ్వర్లు, ఉమ్మడి వరంగల్ జిల్లా రైతు సంఘం చైర్మన్ మార్నేని రవిందర్‌లు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పత్ర్యేక పూజలు నిర్వహించారు.

నిబద్ధతతో పనిచేయాలి

విజయక్రాంతి, భద్రాచలం: ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేయాలని భద్రాచలం సిఐ సత్యనారాయణ రెడ్డి అన్నారు. వివిధ శాఖల పట్ల జర్నలిస్టులకు అవగాహన పెంపొందించే లక్ష్యంతో కొత్తగా ఏర్పాటైన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ భద్రాద్రి' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేర వార్తల సేకరణ, ప్రచురణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు. ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో వనమా శివ, కురిచేటి శ్రీనివాసరావు, ఈశ్వర్, వనం నందా, కమల్‌రెడ్డి, సాయిభాస్కర్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుతో నిత్యం నరకయాతన

- నాలుగు కిలోమీటర్ల ప్రయాణానికి 40 నిమిషాలు
- మరమ్మత్తులకు నోచుకోని కోటగిరి యాద్గార్‌పూర్ రోడ్డు



విజయక్రాంతి, బోధన్: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామం రోడ్డు పైగల గుంతలతో ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు కలుగుతున్నాయి. రోడ్డువేసిన సంవత్సరంలోనే రోడ్డంతా గుంతలు పడటంతో గ్రామస్తులు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేక పోవటంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కోటగిరి మండల కేంద్రం నుంచి యాద్గార్ పూర్, దోమలేడ్గి, సోంపూర్, టాక్లి, హున్స వైపుకు వెళ్లటానికి ఇదే ప్రధాన రోడ్డు మార్గం కావటంతో నిత్యం కొన్ని వందల వాహనాలు ఈ రోడ్డుగుండా ప్రయాణిస్తాయి. రోడ్డు వేసే కాంట్రాక్టర్ నాణ్యతతో పనులు చేయకపోవటం వల్లే రోడ్డు ఇంత తొందరగా పాడయ్యిందని అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోటగిరి మండల కేంద్రంనుంచి దాదాపు ఐదు గ్రామాలకు వెళ్లటానికి ఇది ప్రధాన మార్గం కావటంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఈ మార్గాన్నే అనుసరిస్తారు. ఈ రోడ్డు ప్రయాణంలో నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాలంటేనే 40 నిమిషాల సమ యం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మంది ప్రయాణించే ఈ రోడ్డు అడుగుకోగుంత పడటంతో వెన్ను నొప్పితో ఆసుపత్రుల పాలు కావలసి వస్తుందని అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డు మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై గుంతలు అధికంగా ఉండటంతో, సరిగ్గా బస్సు సౌకర్యం కూడా లేకపోవటంతో, ఆటోలో వెళ్లాలంటే ఆటోవాళ్లు ఎక్కువగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని లేదంటే రాము పొమ్మంటున్నారని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

కాలుష్యం కోరల్లో బస్టాండ్

- దర్జాగా కబ్జాలు
- పట్టించుకోని అధికారులు

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: నిత్యం వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే నాగర్‌కర్నూల్ బస్టాండ్ నేడు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి డిపోలకు చెందిన బస్సులే గాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ డిపోల బస్సులు నిత్యం ప్రయాణికులను బస్టాండ్ గుండాస్వగ్రామాలకు చేరుస్తాయి. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ అసౌకర్యాలకు నిలయంగా మారింది. తాగేందుకు తాగునీరు, మరుగుదొడ్లు కూడా సరైన సంఖ్యలో లేకపోవడం వల్ల ఉదయం, సాయంత్రం వేలల్లో ప్రయాణికుల వ్యథలు వర్ణనాతీతం. బస్టాండ్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఆర్టీసీ అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారనే విమర్శలున్నాయి.

యథేచ్ఛగా కబ్జాలు..

బస్టాండ్‌ను ఆనుకొని ఉన్న స్థలంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు స్థల వివాదంపై కోర్టును



ఆశ్రయించడంతో ఆర్టీసీ బస్టాండ్ కబ్జాకు గురైంది. కోర్టు తీర్పుతో కొందరు వ్యక్తులు దర్జాగా ఇతరితర వ్యాపారాలకు బస్టాండ్ స్థలాన్ని అద్దెకు ఇవ్వడంతో ఇదే అదునుగా భావించిన వ్యాపారులు మరింత స్థలాన్ని కబ్జా చేసి హోటళ్లను ప్రారంభించడం ద్వారా బస్టాండ్ ప్రాంగణంలో హోటల్ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు, పొయ్యిల ద్వారా వచ్చే పొగతో ఈ ప్రాంతం కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. ఇక్కడ వెలిసిన టిఫిన్ సెంటర్లు ప్రభుత్వ స్థలాన్ని పూర్తిగా కబ్జా చేసి డేరాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని నిర్వహిస్తుండడం వల్ల అనేక మంది ప్రయాణికులు కూడా పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ స్థలాన్ని కాపాడాల్సిన ఉన్నత అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల పలువురు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు .

ఆర్టీసీ ఆదాయానికి గండి..

జిల్లా కేంద్రం నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండ్ ఆదాయానికి అడ్డాగా ఉండగా పలువురు ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి వ్యాపారాలను నిర్వహిస్తున్నప్పటికి వారి ద్వారా ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతున్నదని తెలుస్తుంది. బస్టాండ్ ఆవరణలోని ఒక ప్రాంతం పూర్తిగా వ్యాపారమయంగా మారినప్పటికీ ఆ ప్రాంతం నుంచి వచ్చే కాలుష్యం దుర్వాసనను ప్రయాణికులు భరించలేకపోతున్నామని గతంలో అనేక మంది ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. దీంతో కబ్జాదారుల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. హోటల్స్ ముందు నుంచి వెళ్లాలంటేనే ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పలువురు వ్యాపారులు బస్టాండ్ స్థలాన్ని ఎలాంటి పన్నులు చెల్లించకుండానే వినియోగించుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారు ణం. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతా అధికారులు స్పందిం చి కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



మతసామరస్యానికి ప్రతీక

కేరళలోని ఈ ప్రాంతం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కఠినమైన అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములు మసీదు చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు, చర్చి కొలనులో స్నానాలు చేస్తారు. శబరిమల అయ్యప్పస్వామి కొలువైన కేరళలో చాలా సంవత్సరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. మండలంమకరవిలక్కు యాత్రకు వచ్చే స్వాములు శబరిమలకు 60 కిలోమీటర్ల దూరంలో కొట్టాయం జిల్లాలో ఉన్న ఎరుమేలి నాయనార్ జుమా మసీదు చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. తిరుగు ప్రయాణంలో ఆ పక్కనే అలప్పుజలో ఉన్న అర్థంకల్ సెయింట్ ఆండ్రూస్ బాసిలికా చర్చి ఆవరణలోని చెరువులో స్నానాలు చేస్తారు. నవంబర్-జనవరి నెలల మధ్య ఎన్నో ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. పందాలం రాజు దత్తపుత్రుడైన స్వామి అయ్యప్పకు హజ్రత్ వావర్ షా అనే ముస్లిం, అర్థంకల్ వెలుథచన్ అనే క్రైస్తవ బోధకుడు మంచి స్నేహితులుగా ఉండేవారని ఇక్కడి వారు చెప్పుకుంటుంటారు. వారి మధ్య స్నేహానికి, మత సామరస్యానికి గుర్తుగా అయ్యప్ప దీక్షాపరులు వావర్ పేరుతో ఉన్న మసీదు చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. కేరళతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా స్వాములు వస్తుంటారని వావర్ మసీదు సంయుక్త కార్యదర్శి హకీం తెలిపారు. స్వాములు మసీదు చుట్టూ ప్రదక్షిణలు చేసి, టెంకాయ కొట్టి, కానుకలు సమర్పించి శబరిమల సందర్శనకు బయల్దేరుతారు కాని మసీదు ప్రార్థన మందిరం లోపలికి మాత్రం ప్రవేశించరు. మసీదు లోపల నమాజ్ జరుగుతుండగా వెలుపల అయ్యప్ప భక్తులు శరణం అయ్యప్ప అంటూ ప్రదక్షిణలు చేయడం ఇక్కడ కనిపిస్తుంటుంది. అయ్యప్ప, వావర్ల మధ్య స్నేహగాథ కేరళలో మత సామరస్యం, లౌకికత ఎంతగా ఉందో చెప్పేందుకు ఉదాహరణ అని హకీం అన్నారు. యాత్ర ముగించుకున్న స్వాములు అర్థంకల్ బాసిలికా చర్చి వద్దకు చేరుకుని చర్చి ఆవరణలోని చెరువులోనే ఉన్న స్నానఘట్టాల్లో స్నానాలు చేసి దీక్షను విరమిస్తారు. చర్చిలోని సెయింట్ సెబాస్టియన్ విగ్రహం వద్ద పూజలు చేస్తారని ఫాదర్ క్రిస్టోఫర్ ఎం.అర్థస్సెల్ తెలిపారు.

కశ్మీర్ సమస్య పరిష్కారానికి సరైన సమయం

నేడు కశ్మీర్ పరిస్థితి సగం నీరు ఉన్న గ్లాసులా ఉంది. అవకాశాల గ్లాసు సగం నీటితో ఉంది. సగం ఖాళీగా ఉంది. కశ్మీర్లో అశాంతి కొనసాగాలని కోరుకునే వారు మాత్రం ఖాళీ గ్లాసును మాత్రమే చూసి, నైరాశ్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. కశ్మీర్ అంటే యువకులు రాళ్ల విసరడం, ఉగ్రవాదులు విధ్వంసం సృష్టించడం, పోలీసులు, భద్రతాదళాలు కాల్పులు జరపడం మాత్రమే సాధారణంగా గుర్తుకొస్తాయి. కాని కశ్మీర్ అంటే ఇదేనా?

కానీ వాస్తవం ఏమిటి? ఇటీవలే కశ్మీర్ సహా మొత్తం రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికలలో 74 శాతం పోలింగ్ జరిగింది. ఉగ్రవాదం జాడలు లేని జమ్మూలో 83.5 శాతం ఓటింగ్ జరిగింది. ఉగ్రవాద ప్రభావం ఉన్న కశ్మీర్ లోయలో కూడా 41 శాతం ఓటింగ్ జరిగింది. దీన్నెలా అర్థం చేసుకోవాలి. గ్లాసు సగం నిండినట్టే కదా!! 2017 ఏప్రిల్లో శ్రీనగర్ పార్లమెంటు స్థానానికి ఎన్నికలు జరిగినప్పుడు ఓటింగ్ కేవలం 7.4 శాతం. అనంతనాగ్ లోకసభ స్థానానికి ఎన్నికలే జరగలేదు. గతేడాది మునిసిపల్ ఎన్నికలు జరిగినప్పుడు కశ్మీర్ లోయలో కేవలం 4.27 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. దీనితో పోలిస్తే గ్రామ పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 41 శాతం ఓటింగ్ జరగడం మామూలు విషయం కాదు. అంతే కాదు. ప్రజలు తుపాకులను, తూటాలను లెక్క చేయకుండా ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకున్నారు. పోటీ చేసిన వారిని చంపివేస్తామని ఉగ్రవాదులు బెదిరించినా అభ్యర్థులు పట్టించుకోలేదు. గత ఒక్క ఏడాదిలోనే 238 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. రాళ్ళ విసిరే సంఘటనలూ గణనీయంగా తగ్గాయి.

గత నెల కశ్మీర్ లోయ, ముఖ్యంగా విచ్చిన్న వాదపు బావుటా ఎగరేసే దక్షిణ కశ్మీర్లో 257 మంది యువకులు జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్ ఫాంట్రీ దళంలో చేరారు. స్థానికంగా ఉగ్రవాద శక్తులు బెదిరించినా వీరు పట్టించుకోలేదు. వీరంతా శ్రీనగర్ లోనే శిక్షణ పొందుతున్నారు. ఏడాది తరువాత కశ్మీర్ లోయలోనే పనిచేస్తున్నారు. కశ్మీర్ లోయలో పరిస్థితిలో మార్పు రాకపోతే వీరికి శ్రీనగర్లో కాక ముంబైలో శిక్షణ ఇచ్చి ఉండేవారు.

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియోలో ఉగ్రవాదం, వేర్పాటువాదం కంచుకోట సోపోర్ జిల్లాలోనే కశ్మీరీ యువకులు బుర్హన్ వానీ, జాకిర్ మూసా వంటి ఉగ్రవాదుల పోస్టర్లను చించిపారేస్తున్న దృశ్యాలు ఉన్నాయి. పాక్ సమర్థిత ఉగ్రవాద ముఠాలకు తాము వ్యతిరేకం అని ఈ యువకులు స్పష్టంగా చెబుతున్నారు. ఇవన్నీ పరిస్థితిలో వస్తున్న మార్పునకు సూచనలు. రాళ్ల విసిరే సంఘటనలు తగ్గడం, యువకులు పరీక్షలు వ్రాయడంలో, ఉద్యోగాలు దైనందిన పనుల్లో తలమునకలై ఉన్నారు. అయితే గత ఆరేడు నెలల్లో దాదాపు రెండు వందల మంది యువకులు ఉగ్రవాదం వైపు మొగ్గు చూపారన్నది నిజమే. వారు కశ్మీర్ వదిలి పాకిస్తాన్కు చేరుకుని అక్కడ జెహాదీ ఉగ్రవాద శిక్షణను పొందుతున్నారు. అక్కడక్కడా ఇప్పటికీ రాళ్ల విసిరే సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ సరిహద్దుకు ఆవలి నుంచి సహాయ సహకారాలు అందుతూనే ఉన్నాయి. ఇప్పటికీ బయట నుంచి వచ్చిన జెహాదీ మతోన్మాదులకు స్థానికులు ఆశ్రయాన్నిస్తున్నారు. రాళ్ల విసిరేవాళ్లని మిలటరీ, రాష్ట్రీయ రైఫిల్స్, పోలీసులపై దాడులు చేయించేందుకు వేర్పాటువాదులు ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు. భద్రతాదళాల ఆపరేషన్లకు అడ్డం తగిలేందుకు యువతను ఎగ తోస్తున్నారు. కానీ వాస్తవం ఏమిటంటే ఈ తరహా సంఘటనలు క్రమేపీ తగ్గుతున్నాయి.

ఐ ఎ ఎస్ పోటీ పరీక్షల్లో ఆలిండియా టాపర్గా ఎంపికై, కశ్మీర్ లోయలోనే విధులు నిర్వర్తిస్తున్న షా ఫైసల్ వేర్పాటువాద రాజకీయాల్లో పాల్గొని, ముస్లింల హక్కుల కోసం ఉద్యమించేందుకు తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు. గమనించాల్సిన విషయం ఏమిటంటే ఆయన ఉగ్రవాదం వైపు మొగ్గు చూపలేదు. రాజకీయాల రూటును ఎంచుకుని పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఆయన నేషనల్ కాన్ఫరెన్స్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. రాజకీయంగా తాను నమ్మిన విషయం కోసం ఆయన పోరాడితే ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు.

ప్రస్తుతం కశ్మీర్లోయ ఒక సంధియుగంలో ఉంది. ప్రజలు వేర్పాటువాద ఉద్యమాలు, రాళ్ల విసరడాలు, ఉగ్రవాద చర్యలకు పాల్పడటాలపై ప్రజలు పూర్తిగా విసిగి వేసారిపోయి ఉన్నారు. తాము ఎంత పోరాటం చేసినా తాము కోరుకున్న లక్ష్యాన్ని చేరలేమన్న నిరాసక్తత ప్రజలలో వచ్చేసింది. తమను ఉపయోగించుకుని ఉగ్రవాద నేతలు తమ పబ్బం గడుపుకుంటున్నారన్న విషయం కూడా వారికి బోధపడుతోంది. దీనితో ప్రజలు ఉగ్రవాదులు, వేర్పాటువాదుల మాటలను నమ్మడం లేదు. ఈ సమయంలోనే ఉగ్రవాదాన్ని ఏరివేయడం, స్థానికుల ఆకాంక్షలను గుర్తించి, వారికి వనరులు, వసతులు కల్పించడం, వారి కనీసావసరాలను తీర్చడం చాలా అవసరం. అది మరింత వేగవంతంగా జరగాలి. ఈ పరిస్థితులను సరిగ్గా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. కశ్మీర్లో నేడు అవకాశం ఉంది. అయోమయం కూడా ఉంది. దీనిలో అయోమయాన్ని తగ్గించి, అవకాశాన్ని పెంచే దిశగా పని చేయాల్సిన అవసరం ఉంది.

మోసాన్ని యుక్తితో ఎదుర్కొనాలి



మోసాన్ని పసిగట్టి యుక్తితో ప్రమాదం నుంచి బయట పడాలి.

కథ: ఒక సరస్సు వద్ద కోతి, మొసలి స్నేహంగా ఉన్నాయి. మొసలి భార్య పెద్దది. రోజూ మొసలిని తమ ఇంటికి కోతిని తీసుకొని రమ్మని, కోతి గుండెకాయ చాలా రుచిగా ఉంటుందని విన్నానని, మొసలి భార్య మొసలిని వేధిస్తుండేది. ఆమె బాధ పడలేక, కోతిని మొసలి తన ఇంటికి విందుకు ఆహ్వానించింది. కోతి సంతోషంగా ఒప్పుకుంది. కోతిని మొసలి తన వీపు మీద ఎక్కించుకొని సరస్సులో ఈదటం మొదలు పెట్టింది. ఆ రోజు తనను విందుకు ఆహ్వానించటానికి విశేషం ఏమిటని కోతి ప్రశ్నించింది. మొసలి తన భార్య కోరికను, కోతికి తెలియజేసింది. కోతికి అర్థమయింది, తనను చంపి తన గుండెకాయను తినటానికి తనను తీసికెళుతున్నారని. కోతి మొసలితో 'నీవు ఈ విషయం మొదలే చెప్పాల్సింది, నేను నా గుండెకాయను చెట్టు మీద పెట్టాను, నన్ను వెనక్కు తీసికెళితే నా గుండెకాయను తీసుకొని మళ్ళీ ప్రయాణం చేద్దాం' అని చెప్పింది. అది నిజమని మొసలి నమ్మి, తిరుగు ప్రయాణం చేసి, కోతిని ఒడ్డుకు చేర్చింది. వెంటనే కోతి చెట్టు మీదకు ఎక్కి 'ఓసి తెలివి తక్కువ మొసలీ, గుండెకాయ ఎప్పుడైనా దేహానికి వేరుగా ఉంటుందా, అది దేహంలోనే ఉంటుంది. నీ మోసాన్ని నేను యుక్తితో ఎదుర్కొన్నాను' అని చెప్పి వెళ్ళి రమ్మంది మొసలిని.

పొదుపు, తృప్తి గలవాడే ధనవంతుడు

కష్టపడి సంపాదించిన సొమ్ము అన్నివిధాలా మంచిది. అనాయాసంగా సంపాదించిన సొమ్ము అన్ని ద్వారాలు దాటి పోతుంది. తన బాధలకు తానే కారణంగాని వేరేవారు కాదు. పరిమితంగా సంపాదించిన సొమ్ము మనది. అపరిమితంగా సంపాదించిన సొమ్ము పరుల పాలవుతుంది అని గుర్తుంచుకోవాలి. పాపపు పనులతో, ఇతరులను మోసగించి దక్కించుకున్న ప్రయోజనం విషంతో సమానం. ఏనాటికైనా అవమానంతో కృంగిపోవటం ఖాయం అని గుర్తుంచుకోవాలి. మన సంపద పరమాత్మ ప్రసాదంగా భావించి, దానిని మనం ట్రస్టీలుగా మెలగాలి.

అన్నిటిని అదుపులో ఉంచుకోవటమే పొదుపు. డబ్బు విషయములోనే కాక నీరు, ఆహారపదార్థాలు, బట్టలు, అవసరాలు తీర్చుకోవటం మొదలగు అన్ని విషయాలలో పొదుపు అవసరం. అవసరం లేని వస్తువులు కొనటం అలవాటయితే, కొన్నాళ్ళకు అవసరం ఉన్న వస్తువులను అమ్ముకోవాల్సి వస్తుంది. వస్తువుల విలువ అవి లేనప్పుడు తెలుస్తుంది. ఆదాయం కంటే ఖర్చు తక్కువ ఉన్నవాడు ఐశ్వర్యవంతుడు. ధనికుడైనా ఆదాయం కంటే ఖర్చు ఎక్కువైనపుడు దరిద్రుడవుతాడు. పిల్లలకు చిన్నప్పుడే పొదుపు నేర్పాలి. వారు ఏది కావాలంటే అది కొని పెట్టే ముందు, వారికి అది అవసరమా లేదా అని అర్థమయ్యేటట్లు చెప్పాలి. డబ్బులు చెట్లకు కాయవని, కష్టపడితేగాని రావని చెప్పాలి. అందుకే ఈ మధ్య కొంతమంది కోటీశ్వరులు తమ పిల్లలను ఒంటరిగా తెలియని ప్రదేశాలకు కొంత డబ్బిచ్చి పంపించి, నెలకో, రెండు నెలలకో ఆ డబ్బుతోనే గడపాలని, తన్నుతానే తమ తండ్రి పేరు, అడ్రసు చెప్పకుండా సొంతంగా సంపాదించి దానిమీద బ్రతకాలని పంపిస్తున్నారు. అప్పుడు వారికి డబ్బు విలువ తెలుస్తుంది. లేకపోతే ఏ.టి.ఎమ్.కు వెళ్లి కార్డు పెడితే డబ్బులొస్తాయి అనుకుంటున్నారు పిల్లలు. అలా డబ్బులు ఏ.టి.ఎమ్ నుంచి రావాలంటే, ముందు బ్యాంకులో డబ్బులు జమచేయాలని, వారికి వివరించాలి.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

పోలీసులు ఉద్యమకారుల మధ్య హోరాహోరీ పోరాటం

(నిన్నటి తరువాయి) ఏమైతేనేం, పరిస్థితి మరీ దిగజారి పోయింది. ఇంగితజ్ఞానంలేని ప్రభుత్వం ఆ మర్నాడు జూన్ 3వ తేదీ నుండి మొదలవవలసిన పరీక్షలను కొనసాగించడానికే నిర్ణయించింది. ముఖ్యమంత్రిని కేంద్ర నాయకులు హుటాహుటి ఢిల్లీ పిలిపించారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు దేశీయాంగ మంత్రి వారాంతంలో నగరానికి రాగలడని ముఖ్యమంత్రికి ప్రధాని తెలియ జేశారు. జూన్ నాలుగున రాజధాని నగరమంతా యుద్ధభూమిగా స్మశానవాటికగా మారిపోయింది. టెలిఫోన్, విద్యుచ్ఛక్తి స్థంభాలను పీకిన కోపోద్రిక్తులైన ప్రజలు వాటిని రోడ్డుకు అడ్డంగా వేశారు. పెక్కుచోట్ల విద్యాశాఖ కార్యాలయాలకు, పాఠశాలలకు నిప్పుపెట్టారు. సైనికులు, పోలీసులు పెక్కుచోట్ల కాల్పులు జరిపారు. రాజభవన్ వద్ద, నగరంలో అనేక ఇతర ప్రాంతాలలోను పోలీసులకు ఉద్యమకారుల మధ్య జరిగిన హోరాహోరీ పోరాటంలో పలువురు పోలీసులకు గాయాలవటం మరి కొందరి తలలు పగలడం జరిగింది. లాఠీచార్జీలతోను, భాష్పవాయువు ప్రయోగంతోను ప్రజలను రెచ్చగొట్టి వారికి పిచ్చెంక్కించిన పోలీసులు జరిపిన విచక్షణా రహిత తుపాకీ కాల్పులలో ఎంతమంది అమాయకులు చనిపోయారో తెలియదు. అయితే బ్రహ్మానందరెడ్డి దూరపు బంధువులైన కొందరు పోలీసు అధికారుల సలహా, సహాయాలతో నగర పోలీసు కమిషనర్ కల్యాణరావు మృత దేహాలను సామూహికంగా తగల బెట్టించారని, తర్వాత రోజులలో పోలీసు వర్గంలోనే గుసగుసలు వినిపించాయి. పోలీసులు, సైనికులు కర్ఫ్యూను గట్టిగా అమలు జరుపడంతో ఆ రాత్రి సామాన్య జనం ఎవరూ తమ నివాసాల నుండి బయటకు వచ్చే సాహసం చేయలేక పోయారు.

వరంగల్ పట్టణంలో కూడా కాల్పులు జరిగాయి. సుమారు 30 మంది ప్రాణాలు పోయాయని ఆ రాత్రి వార్తలు తెలిపాయి. వేలమందికి తుపాకీ గాయాలు, లాఠీ దెబ్బలు తగిలాయి. వెంటనే కర్ఫ్యూ విధించబడినది. ఆ రాత్రి పోలీసులు అనేక ప్రాంతాలలో నివాస గృహాలలో చొరబడి తలుపులు ద్వారా బంధాలు పగులకొట్టి వేల మందిని అరెస్టు చేశారు. దొంగతనాలు దోపిడీలు చేసి, మహిళలను అవమానపరిచారు.

కేంద్ర గూఢాచార సంస్థ స్థానిక అధికారి శ్రీ పి.యస్. రామమోహన్రావు నిష్పక్షపాత, నిర్మొహమాట వైఖరి వలన వాస్తవ పరిస్థితి గురించి, కాల్పులలో మృతుల గురించి వాస్తవ సమాచారం ఢిల్లీ చేరింది. ఢిల్లీలోనే ఉన్న ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు చొక్కారావుతో హడావిడిగా పరిస్థితిని సమీక్షించి, హుటాహుటిన ముందుగా విమానంలో ఢిల్లీ నుండి వచ్చిన ముఖ్యమంత్రికి కూడా ప్రధాని హైదరాబాదు రానున్న సంగతి రాత్రి 7.30 గంట వరకు తెలియదు. కర్ఫ్యూ అమలులో ఉన్నందున, ప్రధాని రాగానే ప్రభుత్వ అధికారులే ప్రజాసమితి, విద్యార్థి నాయకుల కొరకు వాహనాలను పంపించి పిలిపించారు.

'పట్టుదలలకు పోకుండా కనీసం 24 గంటల ముందుగా వచ్చినట్లయితే కనీసం 30 నిండు ప్రాణాలు దక్కించేవారు కదా?' అని శ్రీ చెన్నారెడ్డి, తనను కలువగానే చేసిన తొలి వ్యాఖ్యకు ఆమె నిర్విణ్ణురాలై పోయారు. 'ప్రజా సమితి నాయకుడిగా కాక నా మాజీ సహచరుడిగా,' పరిస్థితి ఎలా అదుపు చేయాలో తనకు సలహా ఇవ్వవలసినదిగా ఆమె చెన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆ మర్నాడే ఆమె ఆఫ్ఘనిస్తాన్ వెళ్ళవలసియున్నందున, ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తే, తిరిగి వచ్చిన అనంతరం అన్ని విషయాలు చర్చించుకొన వచ్చునని ప్రధాని అన్నారు.

పరిస్థితులు తాను కానీ, ప్రజాసమితి నాయకులు మరొకరు కానీ ఏమీ చేయగలిగేట్టు లేవనీ, కేంద్ర ప్రభుత్వం కనీస ఔదార్యం చూపించాలనీ, కనీసం రాష్ట్రపతి పాలననైనా ప్రవేశపెడితే, చర్చలకు అనువైన వాతావరణం ఏర్పడేందుకు, ఉద్యమం తాత్కాలికంగా నిలుపుదల చేసే విషయం మిత్రులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగలమని శ్రీ చెన్నారెడ్డి సమాధానం ఇచ్చారు. తెల్లవారు జామున ఆమె తిరిగి ఢిల్లీ వెళ్ళారు. 33 గంటల అనంతరం 6వ తేదీన ఉదయం కర్ఫ్యూ సడలించారు. మూడు రోజుల పర్యటనపై కేంద్ర దేశీయాంగ మంత్రి శ్రీ చవాన్ నగరానికి వచ్చారు. పాఠశాలల పరీక్షలను వాయిదా వేయక ప్రభుత్వానికి తప్పలేదు. జూన్ 7న ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ విద్యుచ్ఛక్తి బోర్డు తదితర సంస్థలకు చెందిన రెండున్నర లక్షల మంది కార్మికులు నిరవధిక సమ్మె ప్రారంభించగా, పదకొండవ తేదీ నుండి నిరవధిక సమ్మె చేయాలని యన్.జి.ఓ.ల సంఘం నిర్ణయించినది. ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టభద్రులు కూడ సమావేశం జరిపి ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ తీర్మానించారు.

ఉద్యమం విరమించినట్లయితే తెలంగాణ ఏర్పాటుతో సహా అన్ని విషయాలు చర్చించుకొనవచ్చునని శ్రీ చవాన్ చేసిన విజ్ఞప్తిని ఎవరూ వినలేదు. అనేక ప్రతినిధి వర్గాలను కలుసుకొని పలువురితో సంప్రదించి ఆయన తిరిగి వెళ్ళిపోయారు. అంతకుముందు రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులోని సాధకబాధకాలు చర్చించడానికి అంగీకరిస్తేతప్ప కేంద్ర ప్రభుత్వ నాయకులతో తమ సమాలోచనలకు ప్రాతిపదికయేలేదని, విద్యార్థి నాయకులు, ప్రజాసమితి నాయకులు శ్రీ చవాన్తో అన్నారు. ముఖ్యమంత్రి పదవి నుండి శ్రీ బ్రహ్మానందరెడ్డిని వైదొలగించాలని వారు కోరారు. అయితే, తనను పదవి నుండి తొలగించేందుకే కొందరు ఈ ఉద్యమాన్ని నడుపుతున్నారనే అభిప్రాయం కలుగజేసేందుకుగాను, తన 'నిష్క్రమణ రాష్ట్ర సమగ్రతను పరిరక్షించడానికి దోహదం చేస్తే' తాను పదవి నుండి వైదొలగగలనని జూన్ 8న ముఖ్యమంత్రి ప్రకటించారు. అప్పట్లో ఏర్పడి ఉన్న అఖిల భారత కాంగ్రెస్లోని ముఠారాజకీయాలు తనను పదవి నుండి తప్పుకోనీయవని కూడా ఆయనకు తెలుసు.

దేశీయాంగ మంత్రి నగరం నుండి వెళ్ళగానే పోలీసులు యన్.జి.ఓలపై విరుచకపడి వందల మంది నాయకులను నిర్బంధించారు. అయినప్పటికీ మొక్కవోని పట్టుదలతో తెలంగాణ ప్రాంతమంతటా యన్.జి.ఓలు తమ కార్యక్రమం ప్రకారం 10వ తేదీన సమ్మె ప్రారంభించారు. చరిత్రాత్మకమైన ఈ సమ్మె 35 రోజులు కొనసాగింది. కేంద్ర పాలకులు తమ నిర్లిప్త వైఖరిని విడనాడనందున, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ప్రజాసమితి, విద్యార్థి సంఘం నిర్ణయించాయి. ప్రభుత్వ అణచివేత విధానాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రాంతమంతటా జూన్ 15న హర్తాళ్ జరిగింది. జూన్ 17వ తేదీన ఉద్యమ భవిష్యత్ కార్యక్రమాన్ని వివరిస్తూ ప్రజాసమితి షట్సూత్ర కార్యక్రమాన్ని నిర్ణయించింది.

సత్యాగ్రహాలు కొనసాగించటం, ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించే ప్రజాప్రతినిధుల ఇండ్లముందు వారి వారి ఓటర్లు తిష్టవేసి కూర్చొనడం, ప్రజలు ప్రభుత్వానికి సహాయపడకపోవడం, పన్నులు చెల్లించకపోవడం, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ తమ పదవులకు రాజీనామా ఇచ్చి ఉప ఎన్నికలు కల్పించి ప్రజాభిప్రాయం వెల్లడయే పరిస్థితి కలుగజేయడం ఈ షట్సూత్ర కార్యక్రమంలోని అంశాలు. 19వ తేదీ నుండి 24వ తేదీ వరకు సత్యాగ్రహాలు ముమ్మరంగా చేసి లక్షల మంది అరెస్టు కావాలని నిర్ణయించారు. పిలుపు ఇవ్వడమే ఆలస్యంగా వందల మంది ప్రజాప్రతినిధులు తమ తమ రాజీనామా లేఖలను ప్రజాసమితి అధ్యక్షునకు పంపించారు. ఆ రోజులలో ఈ ప్రాంతాన్ని సందర్శించిన వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు తెలంగాణలో నిజమైన ప్రజా ఉద్యమం జరుగుతున్నట్టు అంగీకరించారు. ఇలాంటి వారిలో పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు మొదలైన వారు ఉన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు శ్రీ చిత్తబాసు (యం.పి) శ్రీ మండల్ (బెంగాల్ న్యాయ శాఖా మంత్రి), ప్రజాసమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ జి. నారాయణరావు, టి.పి.సి.సి. నాయకుడు మెదక్ జిల్లా సమితి అధ్యక్షులు శ్రీ రామచంద్రారెడ్డి, శాసనసభ్యుడు శ్రీ మానిక్ రావులు వెంటరాగా వివిధ ప్రాంతాలలో పర్యటించారు. ప్రజలలో వెల్లివిరిసిన చైతన్యాన్ని వారు ప్రత్యక్షంగా తిలకించి ఆశ్చర్య చకితులైనారు. నిజమైన ప్రజా ఉద్యమమంటే ఇదేనని వారు అభిప్రాయ పడినారు.

ఈలోగా ఢిల్లీలో సమావేశమైన కాంగ్రెస్ కార్యవర్గం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటును త్రోసి పుచ్చాలని తీర్మానించింది. చర్చలలో పాల్గొనవలసినదిగా పంపిన ఆహ్వానాలను శ్రీ చెన్నారెడ్డి, శ్రీ కొండా లక్ష్మన్ త్రోసిపుచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటును చర్చించకుండానే త్రోసి పుచ్చిన అనంతరం తాము మాట్లాడవలసినది ఇంకేమీ లేదని వారు స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో సహా అన్ని విషయాలు చర్చించేందుకు తమ సంసిద్ధతను తెలుపుతూ, చర్చలలో పాల్గొనవలసినదిగా శ్రీ చెన్నారెడ్డి, శ్రీ లక్ష్మణ్ ప్రభృతులకు మర్నాడే ఢిల్లీ నుండి మరొక విజ్ఞప్తిని కేంద్ర నాయకులు పంపించారు. క్షణ క్షణం ఢిల్లీ నుండి టెలిఫోన్ వస్తుంటే మొదట ఆహ్వానం తిరస్కరించి నప్పటి నుండి తిరిగి ఈ నాయకులు ఇద్దరూ ఢిల్లీ వెళ్ళేవరకూ ప్రజా సమితి, విద్యార్థి కార్యాచరణ సమితి, టి.పి.సి.సి కార్యవర్గ సంయుక్త సమావేశాలు రెండు రోజులు కొనసాగుతూనే ఉన్నవి.

ఢిల్లీ చర్చల వలన ఏ ఫలితం చేకూరలేదు. ఉద్యమ నాయకులతో చర్చించి అంగీకార యోగ్యమైన పరిష్కారాన్ని సాధించే బాధ్యతను శ్రీ మొరార్జీ, శ్రీ చవాన్కు కాంగ్రెస్ కార్యవర్గం అప్పగించింది. ఉద్యమం నిలుపు చేయాలని శ్రీ మొరార్జీ, అసంభవమని, ఉద్యమ నాయకులు వాదించుకున్నారు. ఆ తర్వాత మొరార్జీ తన ప్రయత్నాలను విరమించుకున్నారు. హైదరాబాద్కు పెట్టుకొన దలిచిన పర్యటనను మానుకున్నారు. 24వ తేదీన సమితి నాయకులిద్దరూ హైదరాబాదు తిరిగి వచ్చారు. కాంగ్రెస్ సమావేశాలలో తమ నాయకులు గైకొనిన ఖచ్చితమైన వైఖరికి ప్రజలు అఖండ స్వాగతం తెలియజేశారు. ఆనాడు తెలంగాణ అంతటా ఒక సత్యాగ్రహ శిబిరంగా మారింది. లక్షల మంది సత్యాగ్రహం చేశారు. రైళ్ళు, బస్సుల రాక పోకలు రద్దయినవి. కళాశాలలు, పాఠశాలలు, ఆసపత్రులు జైళ్ళుగా మార్చినప్పటికీ వసతి చాలక లక్షల మందిని పోలీసులు వదిలిపెట్టారు. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

సంక్రాంతి లక్ష్మికి స్వాగతం



తెలుగుదనం ఉట్టిపడేలా
పండుగ ఆనందం
కట్టిపడేసేలా సింగారించుకున్న
సంక్రాంతికి స్వాగతం ..

తెలుగు ప్రజల వారసత్వానికి
వెలుగు రేఖల సౌరభాలకి
నెలాంతం విరిసిన
ముగ్గుల లోగిళ్లతో
సంక్రాంతికి స్వాగతం ..

గొబ్బెమ్మల సంబరాలకి
నారీమణుల పాటల పరిమళాలకి
హేమంతపు శ్రీమంతం
పేరంటాల నడుమ
సంక్రాంతికి స్వాగతం ..

పల్లెతల్లి ఒడిలో
తెలుగమ్మ నీడలో
గంగిరెద్దుల వడివడి అడుగుల్లో
హరిదాసుల పాటల పేరడీల్తో
విచ్చేసిన సంక్రాంతి లక్ష్మికి
స్వాగతం.. సుస్వాగతం...

– చివుకుల వాసుదేవమూర్తి
9849651444

సైనికుల సేవలు వెలకట్టలేనివి

మీకోసం

భారతీయ సైనికులతో కూడిన మొదటి బ్యాచ్లో సైన్యంలో చేరి 1942లో లెఫ్టినెంట్ కల్నల్ అయిన ఫీల్డ్ మార్షల్ కె.ఎం.కరియప్ప 28.1.1899న జన్మించారు. అప్పటికి కమాండర్ ఇన్ చీఫ్గా ఉన్న బ్రిటీష్ దేశస్థుడు సర్ రాయ్ బుచర్ నుంచి 15.1.1949న కమాండర్ ఇన్ చీఫ్ బాధ్యతలు చేపట్టిన తొలి భారతీయుడు కరియప్పే. అందుకు గుర్తుగా జనవరి 15 తేదీని భారతీయ సైనిక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ రోజున దేశరాజధాని ఢిల్లీలో ఆరు ఆర్మీ కమాండ్ల ప్రధాన కార్యాలయాల్లో పెరేడ్లు, ఇతర ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఆధునాతన ఆయుధాలతో నిత్యం అప్రమత్తంగా దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న భారతీయ సైనికుల శక్తి ఎనలేనిది, వెలకట్టలేనిది.వారిని గౌరవిద్దాం, వారి సేవలను స్మరిద్దాం, అమర సైనికుల కుటుంబాలకు అండగా నిలుద్దాం.

– కామిడి సతీష్రెడ్డి, జడలపేట,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా

దేశహితానికే ప్రజల తీర్పు

భారతదేశ చరిత్ర, సంస్కృతి, ఆదర్శాలు ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన కానుక. భారతదేశ జీవన విధానంలో మతం పాత్ర అమరమైనది. విశ్వవేదికపై అనేక దేశాలున్నాయి. భారతదేశం సహస్రాబ్దాల నుండి విశ్వమానవ జాతికి ప్రేరణ కేంద్రంగా ఉన్నది. మన పూర్వులు అనేక ఉదాత్త భావంతో సంపూర్ణ విశ్వసంచారం చేసినారు. 'కృణ్వంతో విశ్వమార్యమ్' సంపూర్ణ విశ్వాన్ని శ్రేష్ఠమైనదిగా భావించినారు. 'వసుదైవ కుటుంబకమ్' సంపూర్ణ భూమండలాన్ని ఒక కుటుంబం అన్నారు. 'స్వదేశోభవనత్రయమ్' ముల్లోకాలు మనకు స్వదేశాలే అన్న ఉదాత్త భావనలతో విశ్వం యొక్క సుఖసమృద్ధుల కొరకు తత్వశాస్త్రజ్ఞానాన్ని అందించారు. అందుకే భారతదేశం జగద్గురువుగా ఖ్యాతిచెందింది.

భారతదేశం వివిధ ఉపాసనా మార్గాలకు నిలయం. శైవము, వైష్ణవము, సౌరము, స్కాందము, శాక్తేయము, గాణాపత్యముల ఆరాధనతోపాటు 'చారువాకా'న్ని కూడా గౌరవించినారు. అందుకే విదేశీమతాలైన ఇస్లాం, క్రైస్తవ మతాలు వేదాలను అనుసరించకపోయినప్పటికి, విగ్రహారాధకులను చిన్నచూపు చూసినప్పటికి, పునఃర్జన్మను నమ్మకపోయినప్పటికి అట్టి మతాలను కూడా గౌరవించడం హిందుత్వ స్వభావం. మానవులందరు ప్రకృతి సిద్ధంగా దివ్యత్వమున్నవారే, మనుష్యులలోని దైవత్వాన్ని తెలుసుకోవడమే మానవ జన్మ ప్రధాన లక్ష్యం అనే అత్యున్నతమైన, విశిష్టమైన భావనను ఆదిశంకరుడు, వివేకానందుడు, అరవింద ఘోష్ లాంటి ఉద్దండులైన యుగద్రష్టల భావన ప్రకటనను ఆకలింపుచేసుకొన్న మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి వేరు వేరు దేశాధినేతలతోబాటు మనకు చిరకాల శత్రువైన పాకిస్తాన్ దేశ ప్రధానమంత్రిని కూడా ఆహ్వానించారు. కాని ఆత్మలేని ఆధ్యాత్మికతను అవసరానికి వాడుకునే స్వార్థపూరిత, మోసపూరిత రాజకీయ నాయకులు విమర్శిస్తుంటారు.

అక్రమంగా పురస్కారాలు పొందినవారు జాతీయ నిష్టగల నరేంద్రమోడీ ప్రధానమంత్రి కాగానే జీర్ణించుకోలేని కమ్మీలు పురస్కారాల గౌరవాన్ని పొందుతూ, సమాజంలో పెద్దరికాన్ని ఆస్వాదిస్తూ, వివిధ రకాల లబ్ధి పొందినవారు అసహిష్ణత పేరుతో పురస్కార తిరస్కారం పేరుతో గావుకేకలు పెట్టినారు. విదేశాల నుండి మత ప్రచారానికి వచ్చే ఆర్థిక వనరులను క్రమబద్ధీకరించగానే విదేశాల నుండి అక్రమంగా వచ్చే డబ్బుతో జలసాలు చేసే పెద్ద మనుషుల ఆగడాలకు అడ్డుకట్టపడింది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన రాజకీయ పార్టీల నాయకుల కార్యక్రమాలు ఆగిపోవడంతోపాటు అక్రమ సంపాదన కేసులతో తలమునకలు కావలసి వస్తున్నది. 'బెయిల్' మీద బైట తిరగవలసి వస్తున్నది.

నాస్తికులుగా చెలామణి చెప్పుకుంటున్నవారు, హిందువులు కానివారు మహిళాహక్కుల పేరుతో శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయ ప్రవేశం స్త్రీలకు కల్పించాలని న్యాయస్థానాలలో కేసులు వేసినారు. కేసులు వేసినవారి పూర్వాపరాలు, దేవాలయం యొక్క నియమ నిబంధనలను పరిగణలోనికి తీసికోకుండా ఆగమేఘాలపై న్యాయస్థానం తీర్పు ఇవ్వడం మసీదులపై ఉన్న మైకులను తొలగించమని న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఖాతరుచేయని కేరళ ముఖ్యమంత్రి అయ్యప్పస్వామి ఆలయ ప్రవేశం స్త్రీలకు కల్పించాలని ఇచ్చిన తీర్పును అమలుపరచడం న్యాయస్థానం తీర్పును గౌరవించినట్లుగా ప్రజలకు భ్రమలు కల్పిస్తారు కమ్యూనిస్టు పార్టీకి చెందిన ముఖ్యమంత్రి.

ప్రజా సంక్షేమమే పరమావధి అని చెప్పుకుంటూ ఉపాధి, ఉద్యోగం, రైతురుణమాఫీ, గిట్టుబాటు ధర, డ్వాక్రా సంఘాలు, కులసంఘాలు, చేపలు, గొర్రెలు, బర్రెలు పంపకాలంటూ ప్రచారం చేసుకుంటూ జాతీయ రహదారులు, రోడ్లు, రైల్వేలు, విమానయానాలు, సముద్రయానాలు, విద్యుత్తు, వ్యవసాయాభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, వంట గ్యాసు రక్షణ వ్యవస్థలను నీరుగారుస్తూ అక్రమసంపాదన వచ్చే పథకాలను తాత్కాలికమైన వాటికి ప్రాధాన్యతనిస్తూ, మద్యపానాన్ని ఏరులు పారిస్తూ బీదల జేబులు కాళీ చేస్తున్న ప్రభుత్వాల పనితీరును ప్రజలు గమనిస్తున్నారు. గుర్తిస్తున్నారు. అక్రమసంపాదనలకు అలవాటుపడిన కుటుంబ పాలకులు రాజ్యాంగం విలువలను తుంగలో తొక్కినారు. సామాన్య కుటుంబం నుండి వ్యక్తిగత కృషి, జాతీయనిష్ఠ, సమాజశ్రేయస్సే ధ్యేయంగా పెట్టుకొని పనిచేస్తున్న నరేంద్ర మోడీ ప్రజల మన్ననలు పొందిన ప్రజా నాయకుడు. ప్రజల హృదయాంతరాలను గెలిచిన ఛాయ్వాలా ముప్పై సంవత్సరాల తరువాత అత్యధిక పూర్తి మెజారిటీ సాధించినాడు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకపడి కష్టార్జితంతో నాలుగువేళ్ళు నోట్లోకి పోయే కుటుంబం నుండి వచ్చిన నరేంద్రమోడీ దేశ ప్రధాని కావడం అక్రమసంపాదకులు, కుటుంబ పాలకులకు ప్రిస్టేజిగా మారినాడు. దానిని జీర్ణించుకోలేని సంపన్నులు పచ్చి అబద్ధాలను నిరంతరంగా వల్లిస్తూ నరేంద్రమోడీ పాలనను మసకబార్చే ప్రయత్నం చేస్తున్నారు.

డిమానిటైజేషన్ ద్వారా అక్రమ సంపాదకులు, నక్సలైట్లు, తీవ్రవాదులను నడ్డి విరిచినాడు, జిఎస్టి ద్వారా వ్యాపారస్థులను నిజాయితీపరులను చేస్తూ సామాన్య జనాలకు ఆర్థికభారం తగ్గించినాడు. యూరియాకు 'నీమ్' కోటింగ్ చేయించి అక్రమమార్గాలకు తరలకుండా వ్యవసాయధారులకు అందుబాటులోకి తెచ్చినాడు. జాతీయస్థాయిలో అనేక సంస్కరణలు తెచ్చినాడు. విదేశాల ప్రభుత్వాలకు స్నేహహస్తం అందించి ప్రపంచ శాంతికి బాటలు వేసినాడు. శత్రుదేశాలవారికి వణుకు పుట్టించినాడు. భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ సాధించిన విజయాలను చూస్తున్న ప్రతిపక్షాల నాయకులకు అధికారం అందనంత దూరం ఆకాశాన్ని తాకుటను సహించలేక వివిధ పార్టీల నాయకులు వారి వారి జెండాలను, అజెండాలను, సిద్ధాంతాలను, వారి మధ్య ఉండే శత్రుత్వాన్ని, వ్యతిరేకతను మైమరిచి అందరు ఒకటై నరేంద్రమోడీని ఓడించటమే వారి ధ్యేయంగా మార్చుకున్నారు తప్పా వాళ్ళ కలయిక దేశ హితం కోసం కాదనేది దేశప్రజలు గుర్తిస్తున్నారు.

బీజేపి యేతర కూటముల చేత ఏర్పడే ప్రభుత్వం విదేశీ మతాలైన ఇస్లాం, క్రైస్తవాలను, విదేశీ సిద్ధాంతంతో ఏర్పడ్డ కమ్యూనిష్టుల కార్యకలాపాలతో హిందువులను మట్టికరిపించే చట్టాలు మాత్రమే ఏర్పాటౌతాయి, అమలౌతాయి తప్ప దేశ ప్రజల సంక్షేమం పట్టదనేది సుస్పష్టమౌతుంది. సమాజ హితం కొఱకు ఏర్పాటుచేయబడిన న్యాయస్థానాలను, సిబిఐ, ఇడి, ఎన్.ఐ.ఏ, ఎన్నికల కమీషన్, రక్షణ విభాగం మొదలైన అనేక వ్యవస్థలను గౌరవించలేని, అవమానించే రాజకీయ నాయకులు కులాలపరంగా, మతాలపరంగా రిజర్వేషన్స్ ఇస్తామని అమలు సాధ్యంకాని, కులాల వారి, మతాలవారిగా సమాజంలో చిచ్చుపెట్టే కార్యకలాపాలను ప్రేరేపిస్తూ తాత్కాలిక లబ్ధి పొందే పార్టీలే! కాని'సబ్కా సాత్ సబ్కా వికాస్' అని చెప్పే ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'ఆర్థిక వెనుకబాటుతనం'(ఎకనామికల్లీ బ్యాక్వర్డ్) వారికి కుల మతాలకతీతంగా శ్రేయస్కర సమాజం కోసం 'రిజర్వేషన్స్'కు శ్రీకారం చుట్టినారు. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయంగా, జాతీయనిష్ఠతో పరిపాలించే సామాన్య కుటుంబం నుండి వచ్చినవారిని గౌరవించే భారత ప్రజలు విజ్ఞులు.

–బలుసా జగతయ్య
9000443379

పీజీటీ పోస్టుల కోసం అభ్యర్థులకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్

పీజీటీ పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కోసం 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ మేరకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కోసం ఎంపిక చేసిన పీజీటీ (బయాలజికల్ సైన్స్), పీజీటీ (ఫిజికల్ సైన్స్) అభ్యర్థుల హాల్ టికెట్ నెంబర్లను టీఆర్ఈఐ–ఆర్‌బీ వెబ్‌సైట్‌లో పెట్టారు. జనవరి 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఆర్ఈఐ–ఆర్‌బీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సరాసరి (AVERAGE)

పోటీ పరీక్షల కోసం

మనం సరాసరి లేదా సగటు లేదా సరి సమానంగా లేదా యావరేజ్ అనే పదాలను నిత్యజీవితంలో చాలా సార్లు వింటూంటాం. చదువుకున్న వారైతే సరాసరి = రాశుల మొత్తం/రాశుల సంఖ్య అంటారు. కానీ వాస్తవానికి సరాసరి అంటే మన భాషలో సమానత్వం

ex: గ్రామాల్లో కోతలకు లేదా నాట్లకు కొంతమంది గుంపులుగా ఏర్పడి ఆ పనులు పూర్తయిన తర్వాత వ్యక్తిగత శక్తి సామర్థ్యాలతో పని లేకుండా రాబడిన మొత్తం సొమ్మును సమానంగా పంచుకుంటారు. ఇదే సరాసరి అంటే. వీళ్ళకు గణితంలో పట్టాలు పొందక్కర్లే, అసలు చదువు రా అక్కర్లేదు. నిత్య జీవితంలో ఇలాంటి ఉదాహరణలు కోకోల్లలు. అందుకే ఈ లెక్కలు చేసేటప్పుడు ఈ విధానం చాలా బెటర్.

ex 1: ఒక తరగతిలో 100 మంది విద్యార్థులు కలరు. వీరిలో బాలుర సంఖ్య అనేది బాలికల సంఖ్య కంటే 10 ఎక్కువ. బాలుర సగటు బరువు 50 కేజీలు & ఆ తరగతి బాలబాలికలందరి సగటు బరువు 45.5kg లు అయితే బాలికల సగటు ఎంత? (telangana s.i 2016ప్రిలిమినరీ పరీక్ష).

A) 40 B) 45 C) 50 D)52

జవాబు: లెక్క చేయకుండా నే ఆన్సరు చెప్పగలం

దత్తాంశం ప్రకారం బాలురు సంఖ్య ఎక్కువైనప్పటికీ బాలికలు కలిసిన తర్వాత 50kgల నుంచి 45.5kg లుగా మారింది. అనగా బాలికల సగటు 45.5 కంటే చాలా తక్కువ ఉండే అవకాశం.

కానీ పైన ఇవ్వబడిన ఆప్షన్‌లో అలాంటి ఆప్షన్ మాత్రమే.

ex 2: కొన్ని సంఖ్యల సగటు 15. వీటిలో మొదటి సంఖ్యకు 30 కలిపి చివరి సంఖ్య నుంచి 5ను తీసివేసినపుడు సగటు 17.5 అయిన ఆ సంఖ్యలు ఎన్ని? (DELHI Police previous bit)

A)10 B) 12 C) 15 D)20

జవాబు: ఎలాంటి ఫార్ములాను & x, y లు అనుకోనక్కర్లేదు.

సమూహంలో కలిపిన & తీసివేసినా అది సమూహానికే సంబంధించినది కావున, మొదట 30 కలిపి చివర 5 తీసేశాము. అంటే ఇంకా 25 ఉంది. దీనివలనే సగటు 2.5 పెరిగింది. అంటే 25ను 10 సంఖ్యలకు మించినట్లు (25/10=2.5). ఆన్సర్: **A**

1) మొదటి 19 వరుస సరి సంఖ్యల వర్గాల సరాసరి?

A) 520 B) 420 C) 620 D)500

2)ఒక కంపెనీకి చెందిన ఉత్పత్తులు 3 సంవత్సరాలలో 10%, 20%, 40% పెరిగాయి. ఉత్పత్తిలో సంవత్సరానికి సరాసరి ఎంత పెరిగినట్లు?

A)25% B)30% C)20% D) 22%

3) ఒక రైలు మొత్తం ప్రయాణంను 50% దూరంను గంటకు 30km వేగంతోను 25% దూరంను గంటకు 25km వేగంతోనూ మిగిలిన దూరంను గంటకు 20km వేగంతో ప్రయాణించింది. రైలు మొత్తం ప్రయాణంలో సరాసరి వేగం ఎంత?

A) 1200/47 B) 1250/47 C) 1400/47 D)none

4) 5మంది సరాసరి వయస్సు 21. వారిలో చిన్నవాడి వయస్సు 5 సంవత్సరాలు. అతను పుట్టిన నాటికి ఆ కుటుంబం సరాసరి?

A)18 B)32 C) 20.5 D)20

5) 3సంవత్సరాల క్రితం కుటుంబంలోని 5గురు వ్యక్తుల సగటు వయస్సు 27 సంవత్సరాలు. వారి కుటుంబంలోకి ఒక పిల్లవాడు అదనంగా వచ్చిన ఆ కుటుంబం సరాసరి 27 సంవత్సరాలు ప్రస్తుతం ఆ కుటుంబంలోకి కొత్తగా వచ్చిన పిల్లవాడి వయస్సు ఎంత?

A) 24 B)25 C)20 D)12

6) ఒక హాస్టలులో 35 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టలులో 7 మంది విద్యార్థులు పెరిగినట్లయితే ప్రతి రోజూ 42 రూపాయల అదనపు భారం పడుతుంది. ప్రతి వ్యక్తిపై ఖర్చు పేట్టే సగటులో ఒక రూపాయి తగ్గించ బడును. వాస్తవికంగా వారి భోజనపు ఖర్చు ఎంత అవుతుంది?

A)480 B)440 C)520 D)420

7) ఒక వర్క్ షాప్‌లో పనిచేసే కూలీలు సగటు నెలసరి జీతం 850 రూపాయలు. ఒకవేళ ఏడుగురు టెక్నీషియన్ల సగటు జీతం 1000 రూపాయలు. మిగిలిన వారి సగటు జీతం 780 రూపాయలు. అయితే వర్క్ షాప్‌లో పనిచేసే వారెందరు?

A)26 B)24 C)28 D)22

8) ఒక కంపెనీలో 15 మంది ఉపాధ్యాయుల సగటు నెలసరి జీతం నలభై ఐదు వందల రూపాయలు. వారిలో నుండి ముగ్గురు ఉద్యోగులు వెళ్ళిపోతే వారి సగటు జీతం 175 రూపాయలు తగ్గింది. అయితే వెళ్లిపోయిన ముగ్గురు ఉద్యోగుల మొత్తం జీతం ఎంత?

A)15600 B) 13500 C) 14500 D)15500

9) ఎ మరియు బి ల సరాసరి వయస్సు 20 సంవత్సరాలు. ఒకవేళ సి ఏ స్థానంలో వచ్చిన సరాసరి 19 సంవత్సరాలు ఒకవేళ బి స్థానంలో సి వచ్చిన సరాసరి 21 సంవత్సరాలు అయితే A,B,C వయసులు ఎంత?

A) 22,18,20 B)20,22,18 C)18,30,25 D)none

10) మంగళవారం బుధవారం గురువారం మూడురోజుల సగటు ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెంటిగ్రేడ్ బుధవారం గురువారం శుక్రవారం సగటు ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెంటిగ్రేడ్ ఒకవేళ శుక్రవారం ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెంటిగ్రేడ్ అయితే మంగళవారం ఉష్ణోగ్రత ఎంత?

A)37 B)36 C)35 D)33

11) సచిన్ టెండూల్కర్ ఒక సెషన్లో చివరి ఆటకు ముందు అతడు చేసిన పరుగులు 750. చివరి రెండు ఆటలలో అతడు చేసిన పరుగులు 6. అప్పుడు సగటు రెండు తగ్గినది ఆ సెషన్ మొత్తంలో సగటు పరుగులు ఎన్ని?

A)30 B)28 C)26 D)24

12) 11 పలితాలు సగటు 50 మొదటి ఆరు ఫలితాలు సగటు 49 చివరి ఆరు ఫలితాలు సగటు 52 ఆరవ ఫలితం ఎంత?

A)56 B)57 C)53 D)54

13) ఒక బ్యాట్స్‌మెన్ 9 మ్యాచ్‌లలో కొంత సగటు పరుగులు నమోదు చేశాడు. తన పదవ ఆటలో 100 పరుగులు చేయడం వల్ల సరాసరి 8 పరుగులు పెరిగినది. కొత్త సరాసరి ఎంత?

A)36 B)32 C)28 D)40

14) ఒక పుస్తకంలో తప్పుగా అచ్చు వేయబడిన సంఖ్యల సగటు పేజీకి 4 మొత్తం పేజీల సంఖ్య 512 ఒకవేళ మొత్తం మొదటి 302 పేజీలలో తప్పుగా అచ్చు వేయబడిన సంఖ్యలు 1208 అయితే మిగిలిన పేజీల పరంగా సగటున పేజీలు ఎన్ని అచ్చు తప్పు పడినట్లు?

A)0 B)4 C)840 D)90

15) మూడు సంఖ్యలలో రెండో సంఖ్యకు మొదటి సంఖ్య నాలుగు రెట్లు మూడో సంఖ్యకు మొదటి సంఖ్య మూడు రెట్లు ఆ మూడు సంఖ్యల సరాసరి 95 అయినా మూడో సంఖ్య ఎంత?

A)57 B)76 C)38 D)60

16)A , B , C , D మరియు ఈ అను బేసి సంఖ్యల సరాసరి ఎంత?

A) 5(A+4) B) ABCDE /5 C)A+4 D)NONE

17) నాలుగు మ్యాచ్‌లలో ఒక బ్యాట్స్‌మెన్ సగటు పరుగులు 50. అతని యొక్క అత్యధిక పరుగులకు అత్యల్ప పరుగులకు మధ్య భేదం 172 పరుగులు. ఒకవేళ అతని యొక్క రెండు మ్యా చ్ లు మినహాయిస్తే సరాసరి రెండు పరుగులు తగ్గుతుంది. అతను నమోదు చేసిన అత్యధిక పరుగులు ఎన్ని?

A) 86 B) 92 C) 174 D)170

18) 3 సంఖ్యలో మొదటి సంఖ్య రెండవ సంఖ్యకు రెండు రెట్లు మరియు మూడో సంఖ్యకు మూడు రెట్లు ఒకవేళ ఈ సంఖ్యల సరాసరి 49.50 అయితే మొదటి సంఖ్య మూడో సంఖ్యకు బేదం ఎంత?

A) 54 B) 28 C) 39.50 D)41.50

19) 50 సంఖ్యల సరాసరి 38 వీటిలో నుండి రెండు సంఖ్యలు 45, 55 తొలగించబడ్డాయి అయినా మిగిలిన సంఖ్యల సరాసరి ఎంత?

A) 37.5 B) 36.5 C) 38 D)39

20) 10 సంఖ్యల సరాసరి 15 దీనిలో 36 కు బదులు ఒక సంఖ్యను 26 గా తీసుకున్నాడు సరి అయిన యావరేజ్ ఎంత?

A) 15 B) 16 C) 17 D)18

21) కొంతమంది విద్యార్థుల సరాసరి వయస్సు 40 సంవత్సరాలు 12 మంది కొత్త విద్యార్థులు వయస్సు 32 సంవత్సరాల సరాసరితో వీరితో కలిస్తే మొత్తం సరాసరి నాలుగు సంవత్సరాలు తగ్గినది తరగతి తరగతిలో వాస్తవికంగా ఎంతమంది విద్యార్థులు ఉండేవారు?

A) 10 B) 12 C) 15 D)16

22) ఒక పరీక్షలో 120 మంది విద్యార్థుల సరాసరి మార్కులు 35 పాసైన విద్యార్థుల సగటు 39 ఫెయిల్ అయిన విద్యార్థులకు సరాసరి మార్కులు 15 అయితే పాసైన విద్యార్థులు ఎందరూ?

A) 100 B) 80 C)90 D)70

23) A, B, Cల ముగ్గురి బరువుల సరాసరి 84 వీరితో డి కలిసిన వారి సరాసరి 80 కేజీలు ఒకవేళ డి స్థానంలో E వస్తె మొత్తం బరువులో మూడు కేజీలు బరువు పెరుగుతుంది B,C,D,E ల సరాసరి 79 కేజీలు A బరువు ఎంత?

A) 76 B) 77 C) 75 D)79

24) ఏ ఐదు నిమిషాలలో ఒక పేజీని టైపు చేయ గలరు బి ఆరు నిమిషాలలో సి 12 నిమిషాలలో ఒక పేజీని టైపు చేయ గలరు ప్రతి వ్యక్తి ఒక గంటలో ఎన్ని పేజీలను టైపు చేయ గలరు?

A) 9 B) 8 C)6 D)7

25) ఒక కారు మొదటి 5000మైళ్ళ దూరము లీటర్ కి 40 మైళ్ళ మైలేజ్ తో ప్రయాణించి చున్నది ఆ తర్వాత 5000 మైళ్ల దూరం లీటర్ కు 36 మైళ్ల మైలేజ్ ప్రయాణించి చున్నది మొత్తం మొత్తం పదివేల మైళ్ల ప్రయాణంలో ఎంత పెట్రోలు లీటర్ కి తగ్గుతున్నది?

A) 0.026 B) 0.025 C) 0.024 D)0.023

26) సోమ మంగళ బుధ గురు వారాల్లో సగటు ఉష్ణోగ్రత 38 డిగ్రీలు. మంగళ బుధ గురు శుక్రవారాల్లో సరాసరి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు. సోమవారం 30 డిగ్రీల సెంటిగ్రేడ్ అయినా శుక్రవారం ఉష్ణోగ్రత ఎంత?

A) 37 B) 38 C) 39 D)40

Key: 1). A 2). C 3). A 4). D 5). D 6). D 7). D 8). A 9). A 10). B 11). B 12). A 13). C 14). B 15). D 16). C 17). C 18). A 19). A 20). B 21). B 22) A. 23) C. 24) A. 25) A. 26).B



– ముత్తినేని వీరయ్య
ఎంఫిల్, మ్యాథ్స్, బీఈడీ
గణిత విశ్లేషకులు,
అర్థమేటిక్& రీజనింగ్
షార్ట్ కట్స్ రచయిత,
సీనియర్ కాలమిస్ట్,
డైరెక్టర్, రామానుజన్ స్టడీ సర్కిల్

విద్యా విధానం పిల్లలపై ప్రభావం చూపుతుందా..?



మిమ్మల్ని మీరు విద్యావంతుల్ని చేసుకోవడంలోని ప్రాథమిక ఉద్దేశం మీ దృక్పథాలను విశాల పరచుకోవడం కొరకే. విద్య ద్వారా మీ పరిమితత్వానికి అతీతంగా మిమ్మల్ని మీరు విస్తృతపరచుకోవాలి అనుకుంటారు. ఈ రోజుల్లో సమాచారం సులభంగా, విస్తృతంగా లభిస్తున్నప్పటికీ, దురదృష్టవశాత్తూ ప్రస్తుతం అందించబడుతున్న విద్య, మనిషి ఆలోచనలను, చుట్టూ ఉన్న జీవులను తమతో పాటు కలుపుకుపోయే తత్వాన్ని కుంచించుకుపోయేలా చేస్తోంది.

దురదృష్టవశాత్తూ, జనాలు విద్యను అర్జించే కొద్దీ వారి కోరికలు నమ్మలేనంతగా పరిణమిస్తున్నాయి. జనం ఎంతగా కోరికల్ని సృష్టించుకుంటున్నారంటే, అవి తీర్చుకోవడానికి కావలిసిన వనరుల కోసం ప్రతీ ఒక్కరికీ ఒక్కో గ్రహం కావాలి. అందరూ ఒక గ్రహం మీద జీవించలేరు. దురదృష్టవశాత్తూ, ఇదీ మన విద్య ఫలితం. దీనర్థం చదువులో లోపం ఉందని కాదు, కానీ ఖచ్చితంగా ఏదో లోపం చదువు చెప్పే విధానంలోనే ఉంది. సమాజాన్ని నాశనం చేస్తోంది విద్య కాదు, విద్యను ఏ సందర్భంలో, ఎలా అందిస్తున్నారనేదే.

ప్రస్తుతం, విద్య అనే కార్యక్రమం మొత్తం మనుగడ గురించే అయిపోయింది. కానీ విద్య కేవలం మనుగడ కోసమే కాదు, కాకూడదు. అది మీ దృక్పథాలను విశాలం చేయడానికి ఉపయోగపడాలి. జనం వారి ఆర్థిక స్థితి పట్ల పిచ్చిపట్టిన వారిలా తయారై, విద్య మొత్తాన్ని ప్రపంచం నుంచి డబ్బులు పిండడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇది మారాలి! పిల్లవాడి సహజ తెలివితేటలను తికమక పెట్టకుండా ఉంటే, అతనిని ఎక్కడ ఉంచినా సరే బ్రతుకుతాడు. మనం అతన్ని అద్భుతమైన లేక ప్రేమమయ వ్యక్తిగా మాత్రమే కాదు, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల ధైర్యవంతుడిగా కూడా తయారుచేయాలి. మీరు అతన్ని నరకంలో పెట్టినా, దాన్ని అతను క్రమ క్రమంగా స్వర్గంలా మార్చుకోగలగాలి.

CARDIOVASCULAR SYSTEM – KEYS

నర్సింగ్ పోటీ పరీక్షల కోసం
NURSING - SHORT KEYS


The cardiovascular system is so vital that its activity defines the presence of life. The cardiovascular system begins its activity when the fetus is barely a month old and is the last body system to cease activity in the end of life.

More than 55% Indian population have one or more types of cardiovascular disease which includes hypertension, coronary artery disease, heart failure, and other congenital cardiovascular defects. Because of the prevalence of cardiovascular diseases, nurses practicing in any setting should have a clear understanding of various conditions affecting the cardiovascular care.

To help you grasp the core concepts of **Cardiovascular Care Nursing** (or Cardiac Care Nursing), hereare important nursing mnemonics and tips to make study easy!

1. Heart Blocks:

"The Heart Block Poem"



Heart blocks are abnormal heart rhythm where the heart beats too slowly. In this condition, the electrical signals that tell that heart to contract are partially or totally blocked between the upper chambers (atria) and lower chambers (ventricles).

2. Right–Sided Heart Failure Manifestations: "AW HEAD"

When the right ventricle fails in right sided heart failure, congestion in the peripheral tissues and the viscera predominates. This occurs because the right side of the heart cannot eject blood and cannot accommodate all the blood that normally returns to it from the venous circulation. Rightsided heart failure primarily produces systemic signs and symptoms.

- **A: Anorexia and nausea**

Results from the venous engorgement and venous stasis within the abdominal organs.

- **W: Weight gain**

Due to retention of fluid.

- **H: Hepatomegaly**

Results from the venous engorgement of the liver; increased pressure may interfere with the liver's ability to function.

- **E: Edema (Bipedal)**

Edema usually affects the feet and ankles and worsens when the patient stands or sits for a long period.

- **A: Ascites**

Is the accumulation of fluid in the peritoneal cavity; increased pressure within the portal vessels forces fluid into the abdominal cavity.

- **D: Distended neck vein**

Increased venous pressure leads to distended neck veins.

3. LeftSided Heart Failure: "DO CHAP"

Pulmonary congestion usually occurs in leftsided heart failure; when the left ventricle cannot effectively pump blood out of the ventricle into the aorta and to the systemic circulation. Blood volume and pressure in the left atrium increases which decreases blood flow from the pulmonary vessels. Pulmonary venous blood volume and pressure increase, forcing fluid from the pulmonary capillaries into the pulmonary tissues and alveoli, causing pulmonary interstitial edema and impaired gas exchange.

- **D: Dyspnea**

May be precipitated by minimal to moderate activity; also occurs during rest.

- **O: Orthopnea**

Dyspnea that develops in the recumbent position and is relieved with elevation of the head with pillows.

- **C: Cough**

Cough is initially dry and nonproductive. Large volume of frothy sputum, which is sometimes pink, may be produced, usually indicating severe pulmonary congestion.

- **H: Hemoptysis**

Pink or blood–tinged sputum may be produced.

- **A: Adventitious breath sounds**

May be heard in various areas of the lungs; as failure worsen, pulmonary congestion increases and crackles may be auscultated throughout the lung fields.

- **P: Pulmonary congestion (crackles/rales)**

Sustained high pressure in the pulmonary veins eventually forces some fluid from the blood into the surrounding microscopic air sacs (alveoli), which transfer oxygen to the bloodstream.

4. Management of Heart Failure: "DAD BOND CLASH"

Management of HF are to relieve patient symptoms, to improve functional status and quality of life, and to extend survival. Medical management depends on the type, severity, and cause of HF — it can include reducing the workload of the heart by reducing preload and afterload; elimination of contributing factors such as hypertension. Remember the mnemonic "DAD BOND CLASH" for the medical management of heart failure.

- **D: Digitalis**

Increases the force of myocardial contraction and slows conduction through the atrioventricular node; improves contractility, increasing left ventricular output, and enhances diuresis.

- **A: ACE Inhibitors**

Promotes vasodilation and diuresis by decreasing afterload and preload, ultimately decreasing the workload of the heart.

- **D: Dobutamine**

IV medication administered to patients with significant left ventricular dysfunction and hypoperfusion; stimulates the beta1adrenergic receptors.

- **B: Beta–blockers**

Reduces mortality and morbidity in HF by reducing the adverse effects from constant stimulation of the sympathetic nervous system.

- **O: Oxygen**

Oxygen may be necessary as HF progresses; need is based on the degree of pulmonary congestion and resulting hypoxia.

- **N: Nitrates**

Causes venous dilation, which reduces the amount of blood return to the heart and lowers preload.

- **D: Diuretics**

To remove excess extracellular fluid by increasing the rate of urine produced in patients with fluid overload.

- **C: Calcium Channel Blockers**

Causes vasodilation, reducing systemic vascular resistance.

- **L: Lifestyle Changes**

Restriction of dietary sodium, avoidance of excess fluid intake, weight reduction, and regular exercise.

- **A: Angiotensin II Receptor Blockers**

ARBs block the effects of angiotensin II at its receptor; have similar hemodynamic effects as of ACE inhibitors. Serves as alternative for for patients who cannot tolerate ACE inhibitors.

- **S: Sodium restriction**

A lowsodium diet (2 to 3 g/day) diet and avoidance of drinking excess amounts of fluid is recommended.



- **H: Hydralazine**

Lowers systemic vascular resistance and left ventricular afterload.

5. Hypertension Complications "5 C's of Hypertension Complications"

The excessive pressure on the artery walls caused by hypertension or high blood pressurecan damage the blood vessels, as well as organs in the body. The higher the blood pressureand the longer it goes uncontrolled, the greater the damage. With time, hypertension increases the risk of heart disease, kidney disease, and stroke.

- **C: Coronary Artery Disease**

Can lead to narrowing of blood vessels making them more likely to block from blood clots or fat breaking off from the lining of the blood vessel wall; also weakens the walls.

- **C: Chronic Renal Failure**

Constant high blood pressure can damage small blood vessels in the kidneys making it not to function properly.

- **C: Congestive Heart Failure**

Pumping blood against the higher pressure in the vessels causes the heart muscles to thicken. Eventually, the heart muscles may have a hard time pumping enough blood to meet the physiologic needs of the body leading to heart failure.

- **C: Cardiac Arrest**

High blood pressure can cause CAD, damaged arteries cannot deliver enough oxygen to other parts of the body eventually leading to heart attack.

- **C: Cerebrovascular Accident**

Hypertension leads to atherosclerosis and hardening of the large arteries. This, in turn, can lead to blockage of small blood vessels in the brain. It can also weaken the blood vessels in the brain causing them to balloon and burst.

6. Immediate Treatment of a Myocardial Infarction Client "MONA TASS"

MONA is a mnemonic that stands for: Morphine, Oxygen, Nitrates, and Aspirin. These are the four primary interventions that are performed when treating a patient with Heart Attack/Myocardial Infarction (MI). However, MONA does not represent the order in which you should administer these treatments as a nurse. It is a mnemonic intended to help you remember the components of MI treatment, not the prioritization of them.

- **M: Morphine**

Analgesic drugs such as morphine are to reduce pain and anxiety, also has other beneficial effects as a vasodilator and decreases the workload of the heart by reducing preload and afterload.

- **O: Oxygen**

To provide and improve oxygenation of ischemic myocardial tissue; enforced together with bedrest to help reduce myocardial oxygen consumption. Given via nasal cannula at 2 to 4 L/min.

- **N: Nitroglycerine**

Firstline of treatment for angina pectoris and acute MI; causes vasodilation and increases blood flow to the myocardium.

- **A: Aspirin**

Aspirin prevents the formation of thromboxane A2 which causes platelets to aggregate and arteries to constrict. The earlier the patient receives ASA after symptom onset, the greater the potential benefit.

- **T: Thrombolytics**

To dissolve the thrombus in a coronary artery, allowing blood to flow through again, minimizing the size of the infarction and preserving ventricular function; given in some patients with MI.

- **A: Anticoagulants**

Given to prevent clots from becoming larger and block coronary arteries. They are usually given with other anticlotting medicines to help prevent or reduce heart muscle damage.

- **S: Stool Softeners**

Given to avoid intense straining that may trigger arrhythmias or another cardiac arrest.

- **S: Sedatives**

In order to limit the size of infarction and give rest to the patient. Valium or an equivalent is usually given.

7. Myocardial Infarction Management: "INFARCTIONS"

Goals of treatment during MI are to minimize myocardial damage, preserve myocardial function, and prevent complications. These goals can be achieved by reperfusing the area with the emergency use of thrombolytic medications or by PCI. Reducing myocardial oxygen demand, and increasing oxygen supply with medications, oxygen administration and bed rest can minimize myocardial damage.

- **I: IV access**

Two IV lines are placed usually to ensure that access is available for administering emergency medications.

- **N: Narcotic analgesics**

Morphine is the analgesic of choice for MI and is administered in IV boluses to reduce pain and anxiety; reduces preload and afterload and relaxes bronchioles to enhance oxygenation.

- **F: Facilities for defibrillation (DF)**

Have the crash cart available and ready.

- **A: Aspirin**

Inhibits platelet aggregation. Treatment should be initiated immediately and continued for years.

- **R: Rest**

Bed rest promotes comfort and healing.

- **C: Converting enzyme inhibitor**

ACEinhibitors lowers the blood pressure and the kidneys excrete sodium and fluid.

- **T: Thrombolytics**

Administered via IV to dissolve the thrombus in a coronary artery, allowing blood reperfusion, minimizing the size of the infarction and preserving ventricular function.

- **I: IV beta blocker**

Longterm therapy with betablockers decreases the future incidences of cardiac events.

(ఇంకా వుంది)



– ప్రదీప్త మామిడి
నర్స్–ఎడ్యుకేటర్,
అపోలోమెడ్‌స్కిల్స్

విజయక్రాంతి
మంగళవారం 15 జనవరి 2019
హైదరాబాద్

సంక్రాంతి సుమగంధం





బిజీలైఫ్.. పొట్టి జడను, పోనిటెయిల్‌ను సపోర్ట్ చేసినా, ఆకేషనల్ షెడ్యూల్ మాత్రం వాలు జడ... పూలజడనే సవరిస్తోంది. ఇందుకు సాక్ష్యం ఈ సంక్రాంతి పండుగే. అయితే ఈ అలకంరణ ఇదివరకటిలా అమ్మ.. అత్తమ్మ.. అమ్మమ్మలు చేయడం లేదు స్పెషల్ డిజైనర్లు అందంగా అల్లుతున్నారు.

సంస్కృతిని చాటే పండుగ పబ్బాలకు సంప్రదాయ సొబగులే అసలైన ఆకర్షణ. మాములప్పుడు ఎలా ఉన్నా పర్వదినాలకు మాత్రం బారేడు జడ.. మూరెడు పూలతో కాంతులీనుతుంటారు కాంతలు. ఈ ముస్తాబు ఆరేళ్ల పాప నుంచి అరవై ఏళ్ల అమ్మమ్మల దాక అందరికి ప్రీతి పాత్రమే. అంతకు ముందు జడలో మల్లెలు, మరువాలు, బంతులు, చేమంతులు, కనకాంబరాలు చేరేవి. కట్టేది చీరైనా, పరికిణి జాకెట్టయినా, ఓణి అయినా పూలు ఇవే.. జడలో తురిమేవైనమూ ఇదే. అయితే ఇప్పుడు కాలం మారింది. అభిరుచి పాతదే అయినా అమలయ్యే తీరు కొత్తందాన్ని సంతరించుకుంది. విదేశీ పుష్పాలు సైతం కురులకు కలరింగ్ ఇస్తున్నాయి. కొంచెం సృజన ఉన్నవాల్లు ఈ జడను అప్‌డేట్ చేసి పూలజడ డిజైనర్లుగా అడ్రస్ చాటుకుంటున్నారు.



పువ్వులతో పాటు

బుజ్జి బుజ్జి నడకల తన బుజ్జాయి బుల్లి జడకు పువ్వులు భారమవుతాయని అమ్మలు భావిస్తే, వీసమెత్తు బరువులేని కనకాంబరం లాంటి పూలతో పాటు టిష్యూ లేసులు, కుందన్ బిళ్లలు, ముత్యాలు, రతనాలను జడ ఒంపుల్లో చేర్చి చిన్నారులను బంగారు బొమ్మల్లా తీర్చిదిద్దుతున్నారు. అరచేతి వెడల్పున డిజైన్లు సృష్టించి, వాటిని జడ పొడవునా పొదుగుతున్నారు. ఒక్కో వేడుకకు ఒక్కో విధమైన వైవిధ్యాన్ని పూలజడల్లో చూపిస్తున్నారు.

రంగులను బట్టి...

చీర, లంగా ఓణిల రంగులను బట్టి పువ్వులను వాటి చుట్టూ వాడే పూసలను ఎంచుకుంటున్నారు. ఉదాహరణకు తెలుపు చీరయితే ప్రకృతి ఇచ్చిన మల్లె, లిల్లీ సుమాలు.. మధ్య మధ్యలో ముత్యాలు, కృత్రిమంగా చేసిన గోల్డ్ ఫ్లవర్స్, మోటివ్స్‌ని జత చేర్చి జడలో కూర్చుతున్నారు. ఆకుపచ్చ రంగు చీరయితే హైలెట్‌గా మరువాన్ని వాడుతారు. వంకాయ రంగుకు ఆర్కిడ్స్, డబుల్ షేడెడ్ పూలతో పాటు కార్నేషన్ ఆడుతున్నారు. ఏరంగు చీరైనా, లంగా ఓణీ అయినా దానికి తగ్గట్లుగా వీటిని అమరుస్తారు. ఈ పూలజడలు డిజైన్ బట్టి ధర ఉంటుంది. 2 వేల నుంచి 3,500 వరకు ఉన్నాయి. మరింత ఖరీదైన జడబిళ్లలు వాడాలంటే ఖర్చు దానికి తగిన విధంగానే ఉంటుంది.

- విజయారెడ్డి





ఏ చిన్న వేడుకైనా అమ్మాయిల అలంకరణ కోసం డిజైనర్ పూల జడలను అడుగుతున్నారు. పండుగలకు, పెళ్లి సంబరాల్లో డిజైనర్ పూలజడలకు మంచి గిరాకీ ఉంటోంది. ఆర్డర్ మీద వీటిని తయారు చేస్తుంటాం

-కల్పన రాజేష్,
పూల జడల డిజైనర్
97015 26474





సిల్క్‌తో తళుకులు



సొగసైన చేతులకు మరింత సొబగులు అద్దుతాయి గాజులు. మట్టి, ప్లాస్టిక్ గాజులైనా... రాళ్ల గాజులైనా రవ్వల గాజులైనా... పడతి చేతులకు గాజులు ఉండాల్సిందే. అయితే కన్నులారా చూసినా తనివి తీరనంత అందం తెచ్చే గాజుల గురించి మీకు తెలుసా? బంగారం కాదు. వజ్రాలు ఉండవు. అయినా వాటి మెరుపులు మనోహరంగా ఉంటాయి. అవే ఈ గాజులు. వీటిని చేయడానికి వాడింది కేవలం సిల్క్ దారం. అవును! సిల్క్ దారాలతో నేసిన ఎన్ని దుస్తులు ధరించి ఉంటాం! కానీ ఇప్పుడు వాటితో గాజులు కూడా తయారు చేస్తున్నారు. సిల్క్‌కు తళుకుల్ని మరింత ఇనుమడింపజేయడానికి రాళ్లు, రవ్వలు అద్దుతున్నారు. రక రకాలు వర్ణాలు... ఎన్నో రకాల డిజైన్లు... చూసేకొద్దీ మనసు లాగుతుంది. వేసిన కొద్దీ మక్కువ పెరుగుతుంది.






పామ్ బ్రేస్‌లెట్స్

నేటి యవతకు ఎప్పటికప్పుడు న్యూ ఫ్యాషన్ ఐటమ్స్ కావాలి. చెవి రింగులు, ముక్కు పుడకలు, చేతికి గాజులు, కాళ్లకు పట్టీలు.. ఇలా అన్నీ పెట్టుకోవాల్సిందే. అయితే ఇప్పుడు ముంజేతిని మాత్రం అలా ఖాళీగా ఎందుకు వదిలేయాలి అనుకున్నారేమో కానీ.. మన డిజైనర్లు వాటికి కూడా ఆభరణాలు కనిపెట్టేశారు. వాటినే మార్కెట్లో పామ్ బ్రేస్‌లెట్ల పేరుతో అమ్ముతున్నారు. అయితే ఈ పామ్ బ్రేస్ లెట్లు జారిపోకుండా కూడా చాలా తెలివిగా వేళ్లను చుట్టుకుని ఉండేలా మరో కొత్త మోడల్‌ని తీసుకొచ్చారు. దీంతో ఒకే దెబ్బకి రెండు పిట్టలు అన్న టైప్‌లో అటు పామ్‌తో పాటు.. వేలికి ఉంగరాలు పెట్టుకునే పని కూడా ఉండదు. మంచి పార్టీలకు వెళ్లినప్పుడు ఇవి పెట్టుకుంటే చాలా స్టైలిష్‌గా ఉంటాయి. మీరూ ఒక సారి ట్రై చేయండి..







చిట్టి చిట్కాలు



- ఆహారంలో వెల్లుల్లిని క్రమం తప్పకుండా వాడేవారికి ఎప్పటికీ ఎముకలబలం తగ్గదు.
- రెండుపూటలా పచ్చి ఉల్లిగడ్డ మజ్జిగ అన్నంతో తినేవారు నిత్య ఆరోగ్యవంతులుగా రాణిస్తారు.
- రెండుపూటలా ధనియాల కషాయం తాగుతుంటే మూత్రంలో వీర్యం పోవడం ఆగిపోతుంది.
- పత్రబీజం ఆకులు నూరి కట్టు కడితే గాయం త్వరగా మానుతుంది.
- కరక్కాయను సిరాతో నూరి పట్టిస్తే దీర్ఘకాల తామర మూడు రోజుల్లో మటుమాయం.
- వాము నిప్పులపై వేసి ఆ పొగను మాటి మాటికీ పీలుస్తుంటే జలుబు పూర్తిగా తగ్గుతుంది.
- ఆహారానికి గంట ముందు కప్పు వేడినీళ్ళు తాగుతుంటే రక్తశుద్ధి.

మధురమైన 'మీఠా' మురుకులు



సంక్రాంతి పండుగ అంటే గుర్తుకొచ్చేది పిండి వంటలు. ప్రతి ఇల్లు ఘుమఘుమలాడుతూ ఉంటుంది. కమ్మటి వాసనలతో బోలెడు వెరైటీలు నోరూరిస్తాయి. వంటలతో ఆ ఇల్లు సందడిగా ఉంటుంది. పిల్లాపాపలతో కేరింతలు కొడుతుంది. ప్రతి ఒక్కరి నోరు కొత్త రుచులు చూస్తుంది. సంక్రాంతికి చేసే పిండి వంటలు వందల రకాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం... తయారీ విధానాన్ని చూద్దాం..

ఉసిరి లడ్డూ


రెండే రెండు పదార్థాలతో ఈ స్వీట్ చేసేసుకోవచ్చు..

కావలసిన పదార్థాలు

ఉసిరికాయలు అరకిలో, పంచదారఅరకిలో, యాలకుల పొడి చెంచా..

తయారీ విధానం

ఉసిరికాయలను బాగా కడిగి కుక్కర్లో వేసి ఉడికించాలి. ఇవి చల్లారక చిన్న ముక్కలుగా కట్ చేసి మిక్సీ చేసుకోవాలి. ఇప్పుడు ఓ కడాయిలో ఉసరి పేస్ట్, పంచదార వేసి గరిటెతో కలుపుతుండాలి.. చక్కెర పూర్తిగా కరిగి బంగారు రంగులోకి రాగానే యాలకులపొడి వేసి కలిపి చల్లార్చుకోవాలి. చల్లారిన తర్వాత గుండ్రంటి పరిమాణంలో చుట్టుకుంటే ఉసిరి లడ్డూ రెడీ.





కావలసిన పదార్థాలు

బియ్యం: 1/2 కేజీ పెసరపప్పు: 1/2 కేజీ మిరియాలు: 2 టీస్పూన్లు ఎండుమిర్చి: ఆవాలు: 2 టీస్పూన్లు నెయ్యి : 4 టీస్పూన్లు జీడిపప్పు: 10 ఉప్పు : రుచికి తగినంత కరివేపాకు : 2 రెబ్బలు

తయారీ విధానం

1. ముందుగా బియ్యం శుభ్రంగా కడిగి నానబెట్టుకోవాలి. 2. తరువాత బియ్యం పప్పు కలిపి ఉడకబెట్టాలి. 3. బాగా మెత్తగా ఉడికిన తర్వాత నెయ్యిలో మిరియాలు, ఎండుమిర్చి, ఆవాలు, జీడిపప్పు, కరివేపాకు వేసి తాలింపు పెట్టి ఈ ఉడకబెట్టిన అన్నం, పప్పును అందులో కలపాలి. 4. తినేటప్పుడు పైన కొద్దిగా నెయ్యి వేసుకుని తింటే చాలా బావుంటుంది. దీనికి కొబ్బరి వేయించిన శనగపప్పుతో చట్నీ మంచి కాంబినేషన్...

కట్టెపొంగలి

పప్పుల మురుకులు

కావలసిన పదార్థాలు

మినపప్పు 2 గ్లాసులు, పెసరపప్పు 2 గ్లాసులు, బియ్యం అరగ్లాసు, కారం, వాము రెండు చెంచాలు, ఉప్పు రుచికి సరిపడినంతా, వెన్న పావుకప్పు, నూనె వేయించడానికి సరిపడా..

తయారీ విధానం

ముందుగా మినపప్పు, పెసరపప్పు, బియ్యాన్ని ఒకదాని తర్వాత ఒకటి వేయించుకోవాలి. ఇవి పూర్తిగా చల్లారక పిండి పట్టించాలి.. ఇప్పుడు మిక్సింగ్ బౌల్ తీసుకున్న పట్టుకున్న పిండిలో కారం, వాము, ఉప్పు, వెన్నె వేసి కలపాలి. కడాయిలో నూనె వేసి వేడిచేసుకోవాలి. ఈ నూనెలో కలిపిన పిండిని జంతికల గొట్టంలో తీసుకుని జంతికల్లా వేసుకోవాలి.. వేగాక తీసేస్తే కరకరలాడే మినపప్పు జంతికలు సిద్ధం.





కావలసిన పదార్థాలు

తెల్ల బ్రెడ్ స్లయిసులు 8, పాలు 1 కప్పు, పంచదార మూడున్నర టేబుల్ స్పూన్లు, మీగడ 3 టే.స్పూన్లు, నెయ్యి 2 టే.స్పూన్లు, నానబెట్టి, తొక్కతీసి, తరిగిన బాదం 12, తరిగిన పిస్తా అర కప్పు, కుంకుమ పువ్వు చిటికెడు,

తయారీ విధానం

పాలను మందపాటి గిన్నెలో మరిగించాలి. మరో గిన్నెలో పంచదార, రెండు టే.స్పూన్ల నీళ్లు వేసి పాకం పట్టాలి. బ్రెడ్ స్లయిసులను త్రికోణాకారంలో కత్తిరించి నెయ్యితో రెండు వైపులా కాల్చుకోవాలి. పాలు మరిగాక మీగడ వేసి చిక్కబడేవరకూ మరిగించాలి. వేయించిన బ్రెడ్ ముక్కలను చక్కెర పాకంలో ముంచి తీసి మరో గిన్నెలో పరుచుకోవాలి. తరిగిన బాదం పప్పులు, పిస్తా పప్పులు చల్లి, మరిగిన పాలను కూడా చేర్చి చిన్న మంట మీద ఉంచాలి. 10 నిమిషాల్లో నెయ్యి పైకి తేలుతూ డబుల్ కా మీఠా నోరూరించేలా తయారవుతుంది.

డబుల్ కా మీఠా


భయపెడుతున్న స్వైన్‌ఫ్లూ

హెల్త్

స్వైన్‌ఫ్లూ భయపెడుతోంది. రోజు రోజుకు స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య పెరిగిపోతుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో స్వైన్‌ఫ్లూ అనుమానంతో చేరుతున్న వారు పెరిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో స్వైన్‌ఫ్లూ అంటే ఏమిటి? స్వైన్‌ఫ్లూ వస్తే ఎలాంటి లక్షణాలుంటాయి? స్వైన్‌ఫ్లూ రాకుండా నివారణగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనుమానం వస్తే వెంటనే తీసుకోవాల్సిన చర్యలేమిటి? ఆసుపత్రుల్లో అందే చికిత్స ఎలా ఉంటుంది? ఎలాంటి ఆహారం తీసుకోవాలనే తదితర విషయాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. ఈ వైరస్ వ్యాప్తిపై ప్రజల్లో తీవ్ర భయాందోళనలు చోటుచేసుకుంటున్నాయి.

స్వైన్ ఫ్లూ అనేది ఒక ఇన్‌ఫ్లూయెంజా మహమ్మారి. హెచ్1ఎన్1 వైరస్ కలిగిన రెండు ప్రమాదకరమైన వ్యాధిల్లో ఒకటి. 2009లో ఏప్రిల్ మొట్టమొదటి సారిగా మనిషిలో ఈ వ్యాధిని కనుగొన్నారు. హెచ్1ఎన్1 వైరస్ కొత్త రూపం తీసుకున్నదే స్వైన్ ఫ్లూ. అంతకు ముందు ఉన్న పక్షి, పంది, మనిషుల ఫ్లూ వైరస్‌లు యురేపియన్ పంది ఫ్లూ వైరస్‌లు కలిస్తే వచ్చిన కొత్తరకం వైరసే స్వైఫ్లూ.

మనలో చాలా మంది ఫ్లూ చలికాలంలోనే వస్తుందని అనుకుంటారు. కానీ, ఫ్లూ జ్వరాలు ఏ కాలంలోనైనా రావొచ్చు. చలికాలంలో తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా ఫ్లూ కారక వైరస్ గాలిలో ఎక్కువ కాలం బతికి ఉండటం వల్ల ఎక్కువగా వ్యాపించే ప్రమాదం ఉంటుంది. అయితే మిగిలిన కాలాల్లోను వైరస్ వ్యాప్తి ఆగదు. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకూ దేశంలో మొత్తం 1094 మంది స్వైన్ ఫ్లూ కారణంగా మృత్యువాతపడ్డారు. ఒక్క ఆగస్టు నెలలోనే 342 మంది మరణించారు. మహారాష్ట్రలో 437 మంది, గోవాలో 269 మంది, రాజస్థాన్ లో 69 మంది మరణించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ మహమ్మారి బారిన పడి నలుగురైదుగురు మృత్యువాత పడ్డారు. ప్రజలు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరికలు కూడా జారీ చేశాయి. ఈ నేపథ్యంలో.. స్వైన్ ఫ్లూ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం. స్వైన్ ఫ్లూ వ్యాధి హెచ్ 1 ఎన్;1 అనే వైరస్ మూలంగా వస్తుంది. స్వైన్ ఫ్లూలోనూ సాధారణ ఫ్లూ జ్వరం లక్షణాలే కనిపిస్తాయి.



ఎవరికి ముప్పు?

స్వైన్ ఫ్లూ ఎవరికైనా రావచ్చు. అయితే, పిల్లలు, వృద్ధులు, మహిళ ఈ వైరస్ బారిన పడ అవకాశాలు ఎక్కువ. స్త్రీలలో ప్రత్యేకించి గర్భిణీలు ఈ వైరస్‌కు గురయ్యే అవకాశాలు మరీ ఎక్కువ. రెండేళ్ల లోపు చిన్న పిల్లలు, ఆస్తమా బాధితులు, దీర్ఘకాలికంగా ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడే వారు కూడా చాలా త్వరితంగా ఈ వైరస్‌బారిన పడతారు. గుండె జబ్బులు, కాలేయ, కిడ్నీ సమస్యలు గలవారు, జీవక్రియల సమస్యలతో ఉన్నవారు, మధుమేహ వ్యాధి గ్రస్తులు కూడా ఈ వైరస్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. అన్నింటికి మించి రోగ నిరోధక శక్తి తగ్గిన వారు స్వైన్ ఫ్లూ వైరస్ ఎక్కువగా గురవుతుంటారు.

స్వైన్‌ఫ్లూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

స్వైన్ ఫ్లూ నివారించడానికి కాలానుగుణ ఫ్లూ టీకాలు వేయవద్దు. కాలానుగుణ ఫ్లూ టీకా స్వైన్ ఫ్లూ నుండి రక్షించదు. H1N1 స్వైన్ ఫ్లూ టీకా అనేది ప్రత్యేక టీకా టమిఫ్లు.

స్వై ఫ్లూ వ్యాధిని నివారించడానికి ముఖం మాస్క్ మీద లెక్కించవద్దు. శానిటైజర్‌తో చేతులు శుభ్రంగా కడుక్కుంటుండాలి. చేతులు కడుక్కోకుండా కళ్లు, ముక్కు, నోటిని తాకకూడదు. స్వైన్ ఫ్లూ విజృంభిస్తున్న సమయంలో పనుల నిమిత్తం బయటకు వెళ్లే వార్లు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నోటికి అడ్డంగా రుమాలు చుట్టుకోవటం మేలు. మీరు ఫ్లూ లాంటి లక్షణాలను కలిగి ఉంటే ఇంటిని వదిలివేయవద్దు. జ్వరం, దగ్గు, గొంతు, రన్నీ లేదా పిత్తాశయ ముక్కు, శరీర నొప్పులు, తలనొప్పి, చలి, మరియు అలసట; అతిసారం మరియు వాంతులు తదితర లక్షణాలు ఉన్నవారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలి.


మామూలు ఫ్లూ లక్షణాలు కనిపిస్తే పెద్దగా ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇంట్లోనే ఉండి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. కానీ లక్షణాలు ముదురుతుంటే మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి. సిట్రస్ ఫ్రూట్స్‌తో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని, తద్వారా స్వైన్ ఫ్లూను ఎదుర్కొనే సత్తా శరీరానికి లభిస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. విటమిన్ సి పుష్కలంగా ఉండే నిమ్మరసాన్ని తీసుకుంటూ వుండాలి. అలాగే ఆరెంజ్, బత్తాయి వంటి పండ్లను శీతాకాలంలో కూడా వేడినీటిలో కలిపి తీసుకోవడం ద్వారా స్వైన్ ఫ్లూను దూరం చేసుకోవచ్చు. కుటుంబ సభ్యులు, బంధువులెవరైనా స్వైఫ్లూ బారిన పడితే మిగిలినవాళ్లు అప్రమత్తంగా ఉండాలి. రోగికి చికిత్స అందిస్తూనే సొంత రక్షణ చర్యలు తీసుకో వాలి. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకో వాలి. వేడినీళ్లతో నోటిని పుక్కిలిస్తుండాలి.

వీటి లక్షణాలు

- జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి.. స్త్వన్ ఫ్లూ వ్యాధి ప్రధాన లక్షణాలు.
- ముక్కు దిబ్బడ, ముక్కు కారటం కూడా ఉంటాయి.
- జ్వరానికి తోడు దగ్గు, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన నీరసం ఉంటాయి.
- కొంత మందికి వాంతులు, విరేచనాలు కూడా కావొచ్చు.
- మొదట ఇది మామూలు జ్వరం మాదిరిగానే ప్రారంభమవుతుంది. ఆ తర్వాత లక్షణాలు తీవ్రమవుతాయి.

లక్షణాలు తీవ్రంగా ఉన్నా తగు చికిత్స తీసుకోక పోతే న్యుమోనియా తీవ్రమయ్యే ప్రమాదం ఉం టుంది. స్వైన్ ఫ్లూ మరణాలకు చాలా వరకూ ఇదే కారణం.

కాలేయ వ్యాధుల పట్ల అప్రమత్తం



కాలేయానికి వచ్చే ఒక రకమైన వ్యాధి సిర్రోసిస్. సిర్రోసిస్ అనేది గ్రీకు పదం. దీని అర్థం నారింజ పసుపు రంగు వ్యాధి. వ్యాధి సోకిన కాలేయం నారింజ పసుపు రంగులోకి మారడం వల్ల దీనికి ఈ పేరు వచ్చింది. వ్యాధిగ్రస్తుల్లో కాలేయం లోపలి కణజాలం పాడైపోవడం, కాలేయానికి రక్త ప్రసరణ తగ్గిపోవడం, కాలేయం సరిగ్గా పనిచేయలేని స్థితికి చేరుకుంటుంది.

వ్యాధి కారణాలు

ఈ వ్యాధి రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన కారణం మద్యపానం. ఈ మద్యం తీసుకునే వారిలో కాలయం ముక్కలుగా విడగొట్టబడి ఎసిటోల్‌డిహైడ్ అనే ప్రమాదకరమైన రసాయనం విడుదల అవుతుంది. ఇది కాలేయాన్ని కాటేస్తుంది. మాములుగా పేగులో ఉండే బ్యాక్టీరియా ఎండిటా క్సిన్స్అనే విషపదార్థాలను తయారు చేసుకుంటుంది. ఈ మద్యం కారణంగా ఈ విష పదార్థాలను కాలేయం తనలో ఇముడ్చుకుంటుంది. దీంతో కాలేయంలో కణజాలం దెబ్బతింటుంది. పాడైపోయిన కాలేయం సైటికీన్స్ అనే రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది.

వ్యాధి లక్షణాలు

- అలసట, బలహీనత
- ఆకలి లేకపోవడం
- బరువు పెరగడం లేదా తగ్గడం
- కడుపులో నొప్పి
- వికారం
- రక్తంతో కాని లేదా నీళ్లతో కూడిన వాంతులు
- కన్ను, శరీరం పసుపు రంగుగా మారడం

చికిత్స

- తక్కువ సోడియం అంటే ఉప్పు తక్కువగా వాడాలి.
- మద్యం తీసుకోవడం ఆపేయాలి.
- ఈ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకే ఔషధాలు తీసుకోవాలి.
- యాంటిబయాటిక్స్, డైమురిటిక్స్, పెయిన్ కిల్లర్స్ లాంటి మందులు వాడకూడదు.
- చివరగా శస్త్రచికిత్స అంటే కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేసుకోవాల్సి ఉంటుంది.



ఆర్. కవిత
కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్
(నేషనల్ హెల్త్ మిషన్)



ఇది నా సొంత స్క్రిప్ట్

సీనియర్ నటుడు నటసార్వభౌముడు ఎన్టీఆర్ బయోపిక్ విడుదలై పాజిటివ్ టాక్తో సాగుతుంది. ఈ సినిమా గురించి తెగ చర్చ జరగడం తో పాటు అంతా కూడా దర్శకుడు క్రిష్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సినిమాకు ఈ స్థాయి క్రేజ్ రావడానికి ప్రధాన కారణం ఖచ్చితంగా క్రిష్ అంటూ అంతా బాహాటంగానే అంటున్నారు. మొదట ఈ సినిమాకు తేజను అనుకున్నారు. కానీ ఆతర్వాత క్రిష్ రంగంలోకి దిగాడు. ఎన్టీఆర్ సినిమా బాధ్యతను తేజకు అప్పగించిన సమయంలో దాదాపు రెండు నెలల పాటు స్క్రిప్ట్ వర్క్ చేసాడు. ఆ తర్వాత సినిమా ప్రారంభోత్సవం కూడా చేశాడు. ఆ తర్వాత తప్పుకున్నాడు. కనుక తేజ రెడీ చేసిన స్క్రిప్ట్ తోనే సినిమా తెరకెక్కిందనే టాక్ ఉంది. కానీ ఆవార్తలను దర్శకుడు క్రిష్ కొట్టిపారేశాడు. తన సొంత స్క్రిప్ట్ తోనే సినిమాను చేసినట్లుగా చెప్పుకొచ్చాడు. తాజాగా క్రిష్ మీడియాతో మాట్లాడిన సందర్భంగా తేజ గురించి స్పందిస్తూ.. ఈ సినిమాను తేజ గారు ఎందుకు వదిలేశారో నాకు తెలియదు. ఎన్టీఆర్ సినిమా టైటిల్స్ కార్డు లో నాపేరు రావడం నా పూర్వ జన్మ సుకృతం గా భావిస్తున్నాను. నావద్దకు ఒక స్క్రిప్ట్ ను నిర్మాత తీసుకు వచ్చారు. కానీ నేను అన్ని పూర్తిగా మార్చి మళ్ళీ నా స్టయిల్ లో మార్చనంటూ చెప్పుకొచ్చాడు. ఎన్టీఆర్ కథానాయకుడుకి మంచి రెస్పాన్స్ వచ్చిన నేపథ్యంలో ఎన్టీఆర్ మహానాయకుడు సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి.



ఏప్రిల్ 5న మజిలి

పెళ్లి తర్వాత అక్కినేని నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న తొలి చిత్రం మజిలి. న్యూ ఇయర్ సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు రెండో లుక్ సంక్రాంతి సందర్భంగా విడుదల చేసారు చిత్రయూనిట్. నాగచైతన్యతోపాటు ఈ చిత్రంలో రెండో హీరోయిన్గా నటిస్తున్న దివ్యాంశ కౌశిక్ ఈ లుక్ లో ఉన్నారు.. అది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఫస్ట్ లుక్ లో గడ్డంతో కనిపించిన నాగచైతన్య.. ఈసారి మాత్రం క్లీన్ షేవ్తో ఉన్నారు. పైగా చేతిలో క్రికెట్ బ్యాట్ పట్టుకుని చాలా స్టైలిష్గా ఉన్నారు నాగచైతన్య. దివ్యాంశ కౌశిక్ కూడా చాలా అందంగా కనిపిస్తున్నారు. ఈ లుక్కు కూడా అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. దేర్ ఈజ్ లవ్.. దేర్ ఈజ్ పెయిన్ అనే ట్యాగ్ లైన్తో వస్తున్న ఈ చిత్రం వైజాగ్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివనిర్వాన. నిన్నుకోరి తర్వాత శివనిర్వాన తెరకెక్కిస్తున్న రొమాంటిక్ ఎంటర్ టైనర్ ఈ మజిలి చిత్రం. 80 శాతం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. రావు రమేష్, పోసాని కృష్ణమురళి, సుబ్బరాజ్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గోపీసుందర్ సంగీతం అందిస్తుండగా.. విష్ణు వర్మ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

షైన్ స్క్రీన్ బ్యానర్ పై సాహు గరపాటి, హరీష్ పెద్ది మజిలి సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. అక్కినేని నాగచైతన్య, సమంత, దివ్యాంశ కౌశిక్, రావు రమేష్, సుబ్బరాజు, పోసాని కృష్ణమురళి తదితరులు నటిస్తున్నారు.


మార్చి 1న అల్లు శిరీష్ ఏబిసిడీ



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఏబీసీడీ. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే హిందీ శాటిలైట్ డిజిటల్ రైట్స్ ఫ్యాన్సీ రేట్కు అమ్ముడైన విషయం తెలిసిందే. సీనియర్ నిర్మాత డి.సురేష్ బాబు ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తుండడం విశేషం. ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. మెగా బ్రదర్ నాగబాబు ఇందులో అల్లు శిరీష్కు తండ్రి పాత్రలో నటించారు. బాల నటుడిగా మనకు సుపరిచితమైన భరత్ ఇందులో హీరో ఫ్రెండ్ పాత్రలో నటిస్తున్నాడు. రుక్సార్ థిల్లాన్ హీరోయిన్. సంజీవ్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమౌతున్నారు. బిగ్ బెన్ సినిమాస్ యశ్ రంగినేని తో కలిసి మధుర ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్లో మధుర శ్రీధర్ ఈ ఎంటర్ టైనర్ని నిర్మిస్తున్నారు. కన్నడ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జుధా సాంధీ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని మార్చి 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ... మలయాళంలో సూపర్ సక్సెస్ అందుకున్న ఏబీసీడీ చిత్రాన్ని తెలుగులో అల్లు శిరీష్తో నిర్మిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. మలయాళంలో దుల్కర్ పోషించిన పాత్రను తెలుగులో శిరీష్ పోషిస్తున్నారు. సురేష్బాబు గారు ఈ సినిమాకు సమర్పకులుగా సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ ద్వారా మార్చి 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా రిలీజ్ చేయబోతున్నాం. మెగా బ్రదర్ నాగబాబు గారు ఇందులో శిరీష్కు తండ్రి పాత్రలో నటించారు. మాస్టర్ భరత్ అల్లు శిరీష్ స్నేహితుడిగా నటిస్తున్నాడు. తెలుగు ప్రేక్షకులంతా హ్యాపీగా ఎంజాయ్ చేసే కథ కావడంతో రీమేక్

చేస్తున్నాం. కృష్ణార్జున యుద్ధం ఫేం రుక్సార్ థిల్లాన్ ను హీరోయిన్గా నటిస్తోంది. కన్నడ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జుధా సాంధీ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండడం విశేషం. దర్శకుడు సంజీవ్ రెడ్డి తెలుగు ప్రేక్షకులు మెచ్చే విధంగా కథను తీర్చిదిద్దారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేసే ఈ చిత్రాన్ని మార్చి 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం. అని అన్నారు.

మాధవన్‌తో
ముద్దుగుమ్మలు ముగ్గురు





ప్రముఖ చలన చిత్ర నిర్మాణ సంస్థలు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంయుక్తంగా ఓ చిత్రాన్ని పలుభాషలలో నిర్మించటానికి సన్నాహాలు చేస్తున్నాయి. తెలుగు, తమిళం, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు తో నిర్మితమవుతున్న తొలి క్రాస్ ఓవర్ చిత్రమిది. 'హార్రర్ థ్రిల్లర్' గా రూపొందుతున్న ఈ చిత్రంలో బహుభాషా నటుడు మాధవన్, అనుష్క శెట్టి, అంజలి, షాలిని పాండే, అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజులు ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్, గోపి సుందర్, షనీల్ డియో,గోపి మోహన్, నీరజ కోన లు ఈ చిత్రానికి సాంకేతిక నిపుణులు. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియ పరుస్తాము. మార్చి నెలలో చిత్రం షూటింగ్ అమెరికా లో ప్రారంభమవుతుందని, 2019 ద్వితీయార్ధంలో చిత్రం విడుదల అవుతుందని, సినిమా ప్రేక్షకులకు, అభిమానులకు, మీడియా వారికి చిత్ర నిర్మాణ సంస్థల అధినేతలు టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్ లు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



సుబ్రహ్మణ్యపురం దర్శకునితో సందీప్ కిషన్



యువ కథానాయకుడు సందీప్ కిషన్, 'సుబ్రహ్మణ్యపురం' చిత్రంతో విమర్శకుల మెప్పు పొందిన సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో క్రీడా నేపధ్యంలో ఒక సినిమా చేయబోతున్నారు.


భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలు గురుదక్షిణగా తీసుకు న్నాడు ద్రోణాచార్యులు. ఈ ఆధునికకాలంలో అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడు అనే ఉత్సుకత రేకెత్తించే కధాంశంతో రూపొందించే ఈ చిత్రానికి నిర్మాత 'కార్తికేయ' లాంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్. మిగిలిన నటీనటుల మరియు సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియచేస్తారు.

యువదర్శకుడి ప్రేమలో హనీ



మెహరీన్ గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకు లకు బాగా దగ్గరయ్యారు మెహ రీన్. అగ్ర హీరోయిన్ స్థానంలో చేరిపోయారు మెహరీన్. తాజాగా మెహరీన్ ఎఫ్ 2 చిత్రం ద్వారా సంక్రాం తికి సందడి చేసి మెహరీన్ క్యారెక్టర్కి మంచి పేరు వచ్చిం ది. హనీ అనే క్యారెక్టర్ లో ఓ ఇన్నోసెంట్ గర్ల్గా చేసి ప్రేక్షకుల మదిని దోచింది. ఐతే ఈమెపై సినీపరిశ్రమలో ఒక ప్రచారం జరుగుతోంది. ఆమె ఓ యువ దర్శకుడితో పీకల్లోతు ప్రేమ లో ఉందట. వరుస హిట్ సినిమా లతో అగ్ర దర్శకుల జాబితాలో చేరిపోయిన సదరు దర్శకుడు ఇప్పటికే మెహరీన్తో కలిసి ఓ చిత్రం కూడా చేశాడట. మరి ఇది ఎప్పటిలానే గాలివార్తగా మిగిలిపో తుందేమో కానీ ప్రచారం అయితే జరుగుతోంది. మరి ఈ ఫన్ అండ్ ఫ్రస్టేషన్ చిత్రం విడుదలై అఖండ విజయం సాధించినందుకు ఇక పై మెహరీన్కి ఎలాంటి అవకాశాలు వస్తాయో వేచి చూడాలి.

'అక్షర' మోషన్ పోస్టర్



నందితాశ్వేత ప్రధాన పాత్రలో రూపొందుతున్నఅక్షర మూవీ మోషన్ పోస్టర్ భోగి సందర్భంగా విడుదల చేసింది చిత్ర యూనిట్. ప్రస్తుతం సమాజంలో విద్యకు మించిన వ్యాపారం లేదనే మాట ఎక్కువుగా వినపడుతుంది. కానీ సమాజాన్ని మార్చే ఆయుధం విద్యే అనే అందరూ ఒప్పుకుంటారు. అక్షర ప్రయాణం ఎలా ఉండబోతుంది అనే ఆలోచనలకు ఈ మోషన్ అద్దం పడుతుంది.బలమైన కంటెంట్ ని ఎఫెక్టివ్ గా ప్రజెంట్ చేయడంలో చిత్ర యూనిట్ సక్సెస్ అయ్యింది. మోషన్ పోస్టర్ సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటుంది.

దర్శకుడు బి. చిన్నికృష్ణ మాట్లాడుతూ..

"విద్య సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం. కానీ విద్యావ్యవస్థ ఫక్తు వ్యాపారం లా మారిపో యింది. అలాంటి వ్యవస్థ పై అక్షర చేసే పోరాటం వినూత్నంగా ఉంటుంది. నందిత శ్వేత అక్షర పాత్రకు ప్రాణం పోస్తుంది. ఆమె కెరియర్లో బెస్ట్గా ఈ పాత్ర బెస్ట్ గా నిలుస్తుంది.సురేష్ బొబ్బిలి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలెట్ న్లిస్తుంది.ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది. శరవేగంగా మిగతా షూట్ ని కంప్లీట్ చేసుకొని సమ్మర్లో విడుదలకు ప్లాన్ చేస్తున్నాం" అన్నారు.


నిర్మాత అహితేజ బెల్లంకొండ మాట్లాడుతూ..

"సినిమా కాన్సెప్ట్ ని టీజర్ గా రిలీజ్ చేసాం దానికి మంచి స్పందన వచ్చింది. మోషన్ పోస్టర్ ని కూడా కాన్సెప్ట్ ని ఎలివేట్ చేసే విధంగా ప్లాన్ చేసాం. ఎడ్యుకేషన్ వ్యవస్థ లోని లోపాలను బోల్ గా తెరమీదకు తీసుకురాబోతున్నాం. భోగి సందర్భంగా విడుదల చేసిన మోషన్ పోస్టర్ కి మంచి స్పందన లభించింది." అన్నారు

మరో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ..

మోషన్ పోస్టర్కి వస్తున్నస్పందన చాలా ఆనందాన్ని కలిగించింది. ప్రేక్షకుల ఆలోచనలలో మార్పు తెచ్చే విధంగా అక్షర రూపు దిద్దు కుంటుంది. విద్యాకి వ్యాపారం పర్యయపదం అయ్యింది. అలాంటి ఆలోచనలు మార్చేందుకు అక్షర చేసే ప్రయత్నం ఆకట్టుకుంటుంది అన్నారు.

సిరులు కురిపించే సంక్రాంతి



సంక్రాంతి అంటే చల్లని గాలుల నడుమ, పచ్చని పైరుల నడుమ, ప్రతీ ఊరు, ప్రతీ ఇల్లు ధాన్యపు రాశులతో, డూ..డూ.. బసవన్నల నృత్యాలు, గంగిరెద్దు వాళ్ళ విన్యాసాలు, ఉదయాన్నే హరిదాసు చేసే గజ్జెల చప్పుళ్ళు, భం..భం.. అనే జంగర దేవరలు, మా ఇంటికి రండీ అని స్వాగతించే గొబ్బెమ్మల చుట్టూ నృత్యం చేస్తున్న అమ్మాయిలు, గాలి పటాలతో సందడి చేసే పిల్లలు, ముంగిట్లో ఇంద్ర ధనస్సును నిలిపే రంగవల్లులు, చిట్టి పొట్టి పాపల బుడి బుడి అడుగులు, కొత్తగా పెళ్ళైన జంటలు, ఇలా అందరి సమక్షంలో బొమ్మల కొలువులతో, భోగి మంటల చాటున చల్లని ఉదయాన్ని ఆస్వాదిస్తూ, ప్రమాదాలు జరగకుండా అందరూ సుఖ సంతోషాలతో కలిసి ఉండాలి. ప్రతీ ఇల్లు ఒక హరివిల్లులా మారాలి. అదే అసలైన సంక్రాంతి, అందమైన, ఆనందమైన జీవితాలలో తొలి కాంతి. పంట చేతికొచ్చిన ఆనందంలో రైతన్నల కళ్ళల్లో విరిసే కోటి కాంతులతో, అనందాల కోలాహలంతో, ఈ పండుగను మూడు రోజులుగా చేసుకోవడం ఎప్పటినుంచో వస్తున్న ఆచారం. అందుకే దీనిని పెద్ద పండుగా అంటారు.

మకర సంక్రాంతి రెండవ రోజే అసలైన పండుగ సంక్రాంతి. తెల్లవారగానే పాలు పొంగించి, కొత్త బట్టలు వేసుకుని, రుచికరమైన పిండి వంటలు తింటూ, సంతోషంగా గడుపుతూ ఈ పండుగను ఆస్వాదిస్తారు. ఇటువంటి కొన్ని ఆనందాలను పండగలకు మాత్రమే పొందగలుగుతాం. పిల్లలు గాలిపటాలు ఎగరవేస్తూ సరదాగా గడుపుతారు. దాదాపుగా అందరి ఇళ్ళలో అరిసెలు, బొబ్బట్లు, జంతికలు, చకినాలు, నువ్వుల లడ్డూలు, సేమియా పాయసం, పరమాన్నం, పులిహోర, గారెలు మొదలయిన వంటకాలు చేసి, కొత్తబట్టలు ధరించి ఆనందంగా గడుపుతారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ప్రతీ సంక్రమణానికీ పితృ తర్పణాలు ఇవ్వాలి. కాని మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వక పోయినా, ఈ మకర సంక్రమణానికి మాత్రం తప్పకుండా పితృ తర్పణాలు ఇస్తారు. సంక్రాంతి రోజులలో మనము చూసే ఇంకో సుందర దృశ్యం. గంగిరెద్దుల మేళం. చక్కగా అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తిప్పుతూ, డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయిస్తూ, దండాలు పెట్టిస్తూ, అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్ళు సందడి చేస్తారు. కొత్త దాన్యము వచ్చిన సంతోషంతో మనము వారికి దాన్యం ఇస్తాము.



తిల తర్పణం సంవత్సరంలో మిగిలిన రోజులలో నల్ల నువ్వులు వాడరు. కాని సంక్రాంతి పర్వధినాన మాత్రం నల్ల నువ్వులతో మరణించిన పిత్రుదేవతలందరికీ తర్పణములలు ఇవ్వడం ఎక్కువగా చేస్తుంటారు. దీన్నే పెద్దలకు పెట్టుకోవడం అంటుంటారు. సంక్రాంతి పర్వధినాలలో వారి వారి ఆచార సంప్రదాయాలను అనుసరించి ఈ కార్యక్రమము చేస్తుంటారు. ఈ రోజు బూడిద గుమ్మడి కాయ దానము ఇస్తారు.

హరిదాసు

గొబ్బిళ్ళతో ఇంటి ముందరి భాగాన్ని అలంకరించి హరిని కీర్తించే భక్తులకు సాక్షాత్ శ్రీకృష్ణుడే హరిదాసు రూపంలో వస్తాడని సంకేతం. హరిలో రంగ హరీ అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లుమనగా చిందులు తొక్కుతూ, చేతుల్లో చిరుతలు కొడుతూ కోడిగుడ్డు లాంటి బోడి తలపై రాగి అక్షయపాత్ర కదలకుండా హరిదాసు ప్రత్యక్షమవుతాడు.

గంగిరెద్దు



ముందు వెనుకల చెరో ప్రమదునితో {శివ గణం} ఎత్తైన మూపురం శివలింగాకృతిని గుర్తుచేస్తూ శివునితో సహ తను సంక్రాంతి సంభరాలకు హాజరయ్యానని చెప్పె సంకేతం గంగిరెద్దు. ఆవు లేదా ఎద్దు ఇంటి ముందు ముగ్గులో నిలిచిందంటే ఆనేల ధర్మభద్దమైనదని అర్థం.

కనుమ

మూడవ రోజయిన కనుమ నాడు వ్యవసాయంలో తమకు చేదోడువాదోడు ఉండి పంట చేతికి రావడానికి తమతోపాటు శ్రమించిన పశువులకు వ్యవసాయదారులు కతజ్ఞతలు తెలపడం కనుమ రోజటి విశిష్టత. కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు వనభోజనాలను కూడా నిర్వహిస్తారు. కనుమ నాడు మినుము తినాలనేది సామెత. దీనికి అనుగుణంగా, ఆ రోజున గారెలు, ఆవడలు చేసుకోవడం ఆనవాయితీ. కనుమ మరునాటిని ముక్కనుమ అని అంటారు. దీనికి బొమ్మల పండుగ అని పేరు. దక్షిణ భారతదేశంలోని ప్రజలు ఈ పండుగ మూడు రోజులను శ్రద్ధాసక్తులతో జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో మాత్రం ఈ పండుగలోని రెండవ రోజయిన మకర్సంక్రాంతి లేదా లోరీని మాత్రమే జరుపుకుంటారు.

కనుమ రోజున మాంసాహారం తినడం ఆంధ్ర దేశాన ఆనవాయితీగా వస్తుంది. మాంసాహారులు కాని వారు, గారెలతో సంతృప్తి పడతారు. అలాగే కనుమ రోజున ప్రయాణాలు చెయ్యకపోవడం కూడా సాంప్రదాయం. పండుగకు పుట్టింటికి వెళ్లిన ఆడపిల్లలు కనుమ మరునాడు వారి ఇండ్లకు కట్నకానుకాలతో అమ్మచేసి ఇచ్చిన పిండి వంటలను వడి నింపుకొని తిరుగు ప్రయాణం అవుతారు.



ముగ్గులు

సంక్రాంతి నిలిపించి మొదలు నెల రోజులకు పైగా రంగవల్లులతో వాకిళ్లు, కళకళ లాడుతుంటాయి. ఆకాశం నుంచి నక్షత్రాలు భూమిపైకి రాలాయా అన్న రీతిలో అందంగా వరుస కట్టి నాట్యమాడుతున్నట్టు లతలతో, పూలతో అల్లుకుపోతాయి చుక్కలు. భోగి నుంచి కనుమ వరకు వివిధ రంగుల సమ్మేళనంతో ముగ్గులు ఇంద్రధనుస్సును నేలకు దింపుతారు అతివలు.

కనుమ రథం

మూడు రోజులతో పూర్తవుతూ అందరికీ ఆనందాన్ని పంచే పండుగను ఘనంగా సాగనంపేందుకు పుట్టినదే రథం ముగ్గు. అందరూ ఒకరికి ఒకరు తోడుంటూ కలసి సహజీవనం సాగించాలి అనే సంకేతాలతో ఒక రథం ముగ్గు తాడును మరొక ఇంటి వారి ముగ్గుతో కలుపుతూ ముచ్చటపడుతారు.

పెద్ద వయసు స్త్రీలు ముగ్గులు పెడుతుంటే చిన్న వయసు ఆడపిల్లలు ఆవు పేడతో చేసి పెట్టే గొబ్బెమ్మలు కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలకు సంకేతం. గొబ్బెమ్మల తలమీద కనుపించే రంగుల పూలరేకులు, పసుపు కుంకుమలు పునిస్త్రీలకు సంకేతం. ఆ గోపికా స్త్రీల రూపాలకు సంకేతమే గోపీ+బొమ్మలు= గొబ్బెమ్మలు. మధ్య ఉండే పెద్ద గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం. సంక్రాంతి రోజులలో వీటి చుట్టూ తిరుగుతూ పాటలు పడుతూ నృత్యం చేసే బాలికలంతా కృష్ణ భక్తి తమకూ కలగాలని ప్రార్థిస్తుంటారు. గొబ్బెమ్మలను ముగ్గు మధ్యలో ఉంచి, దానిపై గుమ్మడి పూలుతో అలంకారం చేస్తే చాలా అందంగా గోదాదేవి అక్కడ ఆసీనురాలైన భావన కలుగుతుంది.



వైష్ణవ భక్తులు నెలరోజులు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి సంక్రాంతి పండుగ రోజున గోదాకల్యాణం జరిపి తమ వ్రతాన్ని పరిసమాప్తిగావించి బంధుమిత్రులకు వాయినాలను, కట్నకానుకలను ఇచ్చి పుచ్చుకొని సంతప్తి పడతారు.

ధనుర్మాసం, సంక్రాంతి నెల ముగింపుగా నెలరోజులు ఆలయాలలో పూజలందుకున్న దేవుళ్ల ఉత్సవ మూర్తులై ఊరేగింపుగా బయలుదేరతారు. గ్రామలలో విధిగా జరిపించే కార్యక్రమం ఇది. ప్రజలందరూ దేవుడి రథం వెంట నడుస్తూ గోవింద నామాలతో, శివనామస్మరణతో భక్తి పాటలు ఆలపిస్తూ ఆనందిస్తారు.






చిన్నారుల సంక్రాంతి

ఆధునికత సంప్రదాయాల మేలు కలయిక నేటి మన పండుగలు. తరాలు మారినా పండుగల తీరు మారలేదు. పేదా గొప్పా తారతమ్యం లేకుండా పండుగల ప్రాముఖ్యతను ఆస్వాదిస్తారు ప్రతి ఒక్కరు. నవనాగరిక సమాజం లో నాటి వేడుకలు సందడులు వెనకబడి పోయాయనే చిన్న అపోహ చాలా మందిని కలవరపెడుతున్న మాట కొంత వాస్తవమే అయినప్పటికీ గడచినా తరం ఆచారాలను సంప్రదాయాలను నేటి తరం పునరాగమన స్వాగత గీతాలను ఆలపించే ప్రయత్నం చేస్తుండడం అభినందించదగ్గ విషయం. దీనికి సంకేతంగా ఊళ్ళల్లో వున్నా నగరాల బాట పట్టినా విదేశీ కొలువుల కారణంగా వేరయినా పిల్లలకు మాత్రం ఆ తీపి మధురాలను రుచి చూపిస్తున్నారు నేటి తరం అమ్మానాన్నలు. పండుగల ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేస్తూ చిన్నారులను భాగస్వామ్యులను చేయడం మెచ్చుకోతగ్గ విషయం. ఇళ్లల్లోనే కాకుండా పాఠశాలల్లో కూడా పండుగల ఉనికి, గొప్పతనం, పండుగల ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్, పాటలు నాట్యం, వివిధ సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ప్రశంసించదగ్గ విషయం. సంక్రాతి సందర్భంగా గ్లోబ్ టాటర్స్ స్కూల్, జూబిలీ హిల్స్, నిర్వహించిన సంక్రాతి సంబురాలలో పాల్గొన్న చిన్నారులు పట్టు లంగాలతో పతంగులు చేతబట్టి గంగిరెద్దులు వెంట రాగా రంగైన రంగవల్లికల మధ్య సందడి చేసారు. ఆటాపాటై కోకిల గానం చేస్తూ సీతాకోక చిలుకల్లా మురిపాలు చిందిస్తూ సంక్రాతి శోభకు వన్నె తెచ్చారు చిరంజీవులు వేద, అనఘ, శ్రీనిక. ఈ ముద్దులొలికే గొబ్బెమ్మలకు సంక్రాతి ఆశీస్సులు చెప్పాల్సిందే మరి.

ముంగిట్లో ముగ్గు









భాగ్యలక్ష్మి .కె
హైదరాబాద్







ఉదయాన్నే నీళ్లు తాగేస్తే...

ఏ వేసవి కాలమో అయితే దాహం వేస్తది తాగుతాం. కానీ ఈ చలికాలంలో నీళ్లు తాగడం ఏంటి అనుకుంటున్నారా! కాలం, వాతావరణ పరిస్థితులు ఏవైనా, పరగడుపున కాసిన్ని మంచి నీళ్లు తాగడం మంచిది. వీటితో ఆరోగ్యానికి ప్రయోజనాలు బాగానే ఉన్నాయి.

ఎన్నో అనారోగ్య సమస్యలకు నివారిణిగా పనిచేస్తుందని వైద్య శాస్త్రం కూడా ధ్రువీకరించింది. నీటిని ఎక్కువగా తాగనివారు కూడా ఒకసారి ఆలోచంచండి. నిద్ర లేవగానే ఒకటిన్నర లీటరు మంచినీటిని తాగాలి. తర్వాత గంట వరకు ఎలాంటి ఆహారం తీసుకోకూడదని నిపుణులు తెలుపుతున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం మంచినీళ్ళు తాగడం ప్రారంభించేయండి.

- పరగడుపున ఖాళీ కడుపుతో మంచినీళ్ళు తాగడం వలన పెద్ద పేగు శుభ్రపడి, మరిన్ని పోషకాలను గ్రహిస్తుంది.
- కొత్త రక్తం తయారీని, కండర కణాల అభివృద్ధిని పెంచుతుంది.
- పొద్దున్నే కనీసం అరలీటరు నీటిని తాగడం వలన 24 శాతం శరీర మెటబాలిజాన్ని పెంచుతుంది. తద్వారా బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది.
- రక్త కణాలను శుద్ధిచేయడం వలన శరీరంలోని మలినాలు తొలగుతాయి. దానితో శరీర ఛాయ ప్రకాశిస్తుంది. శ్వేత ధాతువులను సమతుల్యం చేస్తుంది. ఈ గ్రంథుల వలన రోజువారీ కార్యక్రమాలలో ఎలాంటి ఆటంకం లేకుండా, శరీర ద్రవపదార్థాన్ని కోల్పోకుండా, ఇన్‌ఫెక్షన్స్ దరిచేరకుండా పోరాడుతుంది.

మాటే మంత్రం..



మనకి మంచి చెప్పేవాళ్లు దొరకడం మన అదృష్టం..
ఆ మంచి వినకపోవడం మన దురదృష్టం..

పెట్స్‌తో హ్యాపీనెస్...



కొందరికి పెంపుడు జంతువులంటే చాలా ఇష్టం. అవి ఏవైనా పిల్లి, కుక్క, పక్షులు మొదలైన అన్ని పెంపుడు జంతువులు భిన్నమైన, చురుకైన అలవాట్లను కలిగి ఉంటాయి. వీటి ప్రవర్తన, ఆట మనసుకు హాయిగా అనిపిస్తుంది. వీటితో గడుపుతుంటే టైమ్ కూడా తెలియదు. ఒత్తిడి గురైనప్పుడు, విసుగ్గా అనిపించినపుడు, బాధలో అయినా, ప్రేమగా అయినా వీటితో గడిపి చూడండి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడి కూడా తగ్గుతుంది.



'చిటికె'లో సాధ్యం..!

- లెదర్ బ్యాగులపై బేబీ ఆయిల్ వేసి రుద్దితే, బ్యాగ్స్ మెరుస్తాయి.
- ఆలూ త్వరగా ఉడకాలంటే, కొద్దిగా పసుపు, వంటనూనె వేయాలి.
- కూరలో ఉప్పు ఎక్కువైతే, కాస్త బియ్యంపిండి కలపాలి.

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	433	విజయవాడ	443
ముంబయి	495	ఢిల్లీ	460
చెన్నై	450	బెంగళూరు	445



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	115	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135



సెన్సెక్స్ –156.28
35,853



నిఫ్టీ –57.35
10,737

రూపాయి
₹70.93
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
33,100
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

8 నెలల కనిష్టంలో టోకు ధరలు



ఢిల్లీ: చమురు ధరలు అదుపులోకి రావడం, కొన్ని ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడంతో గత నెల టోకు ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్ఠానికి చేరింది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2018 డిసెంబరులో టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.80శాతంగా నమోదైంది. అంతక్రితం నవంబరులో 4.64శాతంగా ఉంది. ఇక 2017 డిసెంబరులో ఇది 3.58శాతంగా నమోదైంది. 2018 ఏప్రిల్‌లో నమోదైన 3.62శాతం టోకు ద్రవ్యోల్బణం తర్వాత ఇదే కనిష్ఠం కావడం గమనార్హం. డిసెంబరు నెలలో కూరగాయల ధరల ద్రవ్యోల్బణం 26.98శాతం నుంచి 17.55శాతానికి తగ్గింది.

ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 16.28శాతం నుంచి 8.38 శాతానికి తగ్గింది. దాదాపు సగం మేర తగ్గుదలను నమోదు చేసుకుంది. డిసెంబరు నెలలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వల్లే ఇది జరిగింది. ఇక బంగాళ దుంపల ధరలు చౌక కావడంతో కూరగాయల ద్రవ్యోల్బణం 86.45శాతం నుంచి 48.68శాతానికి చేరింది. పప్పు ధాన్యాల ధరల్లో వృద్ధి 2.11శాతంగా ఉంది. అటు భారత పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) 17నెలల్లోనే అత్యల్ప వృద్ధి నమోదు చేసింది. నవంబరులో 0.5శాతంగా నమోదైంది. మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు సహా తయారీ రంగాలు నిరాశపరచడమే ఇందుకు కారణం.

జెట్ ఎయిర్‌వేస్ వాటాలను కొనుగోలు చేయనున్న ఎతిహాద్

లండన్: కష్టాల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్‌ను ఆదుకునేందుకు ఎతిహాద్ కీలక చర్యలు చేపట్టింది. జెట్ ఎయిర్‌వేస్‌లో తన వాటాను 49శాతానికి పెంచుకోవాలని ఎతిహాద్ ఎయిర్‌వేస్ పీజేఎస్‌సీ నిర్ణయించింది. దీనిలో భాగంగా ఛైర్మన్ నరేష్ గోయల్ తన వాటాలను విక్రయించనున్నారు. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో నరేష్ గోయల్‌కు 51శాతం వాటా ఉంది. ఈ డీల్ అనంతరం ఆయన వాటా 20శాతం కంటే దిగువకు పడిపోనుంది. దీంతోపాటు ఆయనకు 10శాతం ఓటింగ్ హక్కులు లభించనున్నాయి. దీనిపై ఇరువర్గాల నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు.మరో పక్క మార్కెట్లో జెట్ ఎయిర్‌వేస్ షేర్లు 19శాతం లాభపడ్డాయి. నవంబర్ 15 నుంచి ఇప్పటి వరకు ఈ షేర్ కౌంటర్‌లో వచ్చిన అతిపెద్ద లాభం ఇదే. దేశంలో రెండో అతిపెద్ద ఎయిర్‌లైన్‌గా పేరొందిన జెట్ ఎయిర్‌వేస్ గత 11ఏళ్లలో 9 సంవత్సరాలు నష్టాలనే చవిచూసింది. ప్రస్తుతం ఎతిహాద్‌కు మొత్తం 24శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌కు చెందిన ఎయిర్‌లైన్స్‌లో సంస్థలో విదేశీ సంస్థలు 49శాతం మాత్రమే పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. దీంతో ఎతిహాద్ ఆమేరకు వాటాలను కొనుగోలు చేయనుంది.

మార్కెట్లు ఢమాల్..నష్టాలతో ముగిసిన దలాల్ స్ట్రీట్



- 156 పాయింట్ల నష్టంలో సెన్సెక్స్
- లాభాల్లో యస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, మారుతి కంపెనీల షేర్లు
- మళ్లీ పెరిగిన చమురు ధరలు

ముంబయి: గత వారంలో నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లో సోమవారం కూడా అదే దారిలో నడిచింది. ఈ వారం అయినా లాభాల్లో కొనసాగుతుంది అనుకున్న మదుపర్లకు మరోసారి పెద్ద షాకే తగిలింది. చైనా ఆర్థిక వ్యవస్థ మరింత మందగిస్తుందని ఆ దేశ ట్రేడ్ డేటా వెల్లడిస్తుండటం అంతర్జాతీయ మార్కెట్లను ఒత్తిడికి గురి చేస్తోంది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపైనా పడింది. దీనికి తోడు కంపెనీల త్రైమాసిక ఫలితాలపై మదుపర్లు దృష్టిపెట్టడం, చమురు ధరలు మళ్లీ పెరుగుతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సోమవారం ట్రేడింగ్‌లో సూచీలు నష్టాలను మూటగట్టుకున్నాయి.

మరోవైపు ఎన్ఎస్ఈలో యస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, మారుతి షేర్లు లాభాలతో ముగియడంతో ఆయా కంపెనీల షేర్ హోల్డర్స్‌లో జోష్ కనిపించింది. అనూహ్యంగా మారుతీ షేర్లు లాభాలలోకి రావడంతో ఈ వారం అమ్మకాలు బాగుంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు షేర్ హోల్డర్స్ .. విప్రో, గెయిల్, ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ షేర్లు నష్టపోయాయి.

ఇక ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాలు, అమ్మకాల ఒత్తిడితో సోమవారం ఉదయం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. 170 పాయింట్లకు పైగా నష్టంతో ట్రేడింగ్‌ను ప్రారంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కుదేలైంది. ఒక దశలో 240 పాయింట్లకు పైగా దిగజారింది. అయితే చివరి గంటల్లో కొన్ని రంగాల్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సూచీలు కోలుకున్నాయి. నష్టాలను తగ్గించుకోగలిగాయి. నేటి సెషన్‌లో సెన్సెక్స్ 156 పాయింట్లు నష్టపోయి 35,853 వద్ద, నిఫ్టీ 57 పాయింట్ల నష్టంతో 10,738 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత బలహీన పడి 70.80గా కొనసాగుతోంది.

మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో దేశంలో ఇంధన ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. వరుసగా ఐదో రోజు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీంతో దేశ రాజధానిలో లీటర్ పెట్రోల్ ధర మళ్లీ రూ. 70 మార్క్‌ను దాటింది. కొత్త ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం ఆరు సార్లు ఇంధన ధరలు పెరిగాయి.

ప్రధాన ఇంధన కంపెనీలు సోమవారం పెట్రోల్‌పై 3740 పైసలు, డీజిల్‌పై 4953పైసలు పెంచాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 70.13కు చేరింది. కోల్‌కతాలో రూ. 72.24, ముంబయిలో రూ. 75.77, చెన్నైలో రూ. 72.79గా ఉంది. ఇక డీజిల్ ధర ఢిల్లీలో రూ. 64.18, కోల్‌కతాలో రూ. 65.95, ముంబయిలో రూ. 67.18, చెన్నైలో రూ. 67.78గా ఉంది. జనవరి 7న ఒకసారి, ఆ తర్వాత జనవరి 10 నుంచి వరుసగా ఇంధన ధరలు ప్రతి రోజూ పెరుగుతూ వస్తున్నాయి.



పసిడి మెరుపులు..33వేలు దాటిన బంగారం



ముంబై: దేశీయ మార్కెట్‌లో పసిడికి మళ్లీ గిరాకీ పెరిగింది. అటు అంతర్జాతీయ పరిణామాలు కూడా సానుకూలంగా ఉండటంతో బులియన్ మార్కెట్‌లో బంగారం ధర మళ్లీ రూ. 33వేల పైకి చేరింది. సోమవారం 10 గ్రాముల పుత్తడి ధర రూ. 225 పెరిగి రూ. 33,100గా ఉంది. అమెరికా కరెన్సీ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మళ్లీ బలహీనపడటంతో పసిడిలో పెట్టుబడులు పెట్టడమే శ్రేయస్కరమని మదుపర్లు భావించారు. దీనికి తోడు దేశీయంగా నగల వ్యాపారుల నుంచి కూడా కొనుగోళ్లు పెరగడంతో ధర పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.అటు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో బులియన్ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ. 250 పెరిగి రూ. 40,100కు చేరింది. అంతర్జాతీయంగానూ ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్‌లో ఔన్సు పసిడి ధర 1,290.22 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.73డాలర్లు పలికింది.


ఓలాలో వాటాలు కొనుగోలు చేసిన సచిన్ బన్సల్



బెంగళూరు: ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ 21 మిలియన్ డాలర్లను వెచ్చించి క్యాబ్ సర్వీసుల దిగ్గజం ఓలాలో వాటాలను కొనుగోలు చేశారు. ఫ్లిపాప్‌కార్ట్‌లోని తన వాటాలను వాల్‌మార్ట్‌కు విక్రయించి సంస్థ నుంచి బయటకు వచ్చాక పెట్టిన తొలి పెట్టుబడి ఇదే కావడం విశేషం. ఒక్కో షేరు రూ.21,250 చొప్పున 70,588 జే ప్రిఫరెన్స్ షేర్లను కొనుగోలు చేశారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద సమర్పించిన పత్రాల్లో ఈ విషయాన్ని వెల్లడించారు. బన్సల్ మొత్తం 150 మిలియన్ డాలర్లు ఓలాలో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఓలా మార్కెట్ విలువ 5.7 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఓలాలో వ్యక్తిగత రూపంలో వచ్చిన అతిపెద్ద పెట్టుబడి ఇదే. ఇప్పటికే ఓలాలో జపాన్‌కు చెందిన సాఫ్ట్ బ్యాంక్ 26శాతం వాటాను కలిగి ఉంది.

స్పోర్ట్స్

గెలిస్తేనే..నిలిచేది



- నేడు ఆసీస్‌తో భారత్ రెండో వన్డే
- గెలుపే లక్ష్యంగా బరిలోకి కోహ్లీ సేన
- సిరీస్‌పై కన్నేసిన కంగారూలు
- ధోనీ ఫామ్ పైనే చర్చ
- నెట్స్‌లో చెమటోడ్చిన టీం ఇండియా ఆటగాళ్లు

ఆడిలైడ్: ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకుని చరిత్రను తిరగరాసిన కోహ్లీ సేనకు వన్డే సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగినా ...టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో తొలి వన్డేలో పరాజయం చవిచూడటంతో మూడు వన్డేల సిరీస్‌లో 1–0 తో వెనకడుగులో ఉంది.దీంతో ఎలాగైనా రెండో వన్డేలో గెలిచి సిరీస్‌లో నిలవాలని చూస్తోంది భారత్. ఈ నేపథ్యంలోనే నేడు ఆడిలైడ్‌లో రెండో వన్డేకు పూర్తి స్థాయిలో సిద్ధం అయ్యింది కోహ్లీ సేన.

కంగారు పెట్టిస్తున్న ధావన్, ధోనీ ఫామ్

తొలి వన్డేలో డకౌటై నిరాశ పరిచిన శిఖర్ ధావన్ ఫామ్‌పై ఆందోళన చెందుతోంది భారత్, ఓపెనర్‌గా శిఖర్ గాడిలో పడితే భారత్‌కు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ధావన్ ఎల్బీగా వెనుదిరిగిన తర్వాత రాయుడు కూడా పెవిలియన్ బాట పట్టడంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను తన భుజాలపైకి వేసుకున్నాడు మరో ఓపెనర్ రోహిత్ శర్మ, ఈ వన్డేలో రోహిత్‌కు తోడుగా 10 ఓవర్ల పాటు ధావన్ క్రీజులో నిలబడితే కంగారు జట్టుకు కష్టాలు తప్పవు, ఇక తర్వాత ఆర్డర్‌లో దిగుతున్న కోహ్లీ, రాయుడు రాణింపుపై జట్టు భారీ ఆశలను పెట్టుకుంది. మొదటి వన్డేలో కోహ్లీ విఫలమైనప్పటికీ రెండో వన్డే కోసం నెట్స్‌లో దాదాపు రెండు గంటల పాటు తీవ్రంగా బ్యాటింగ్‌ను ప్రాక్టీస్ చేశాడు విరాట్, రాయుడు కూడా ఈ వన్డేలో రాణించాలనే పట్టుదలతో ఉన్నాడు. దినేష్ కార్తిక్ తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక పోతున్నాడు. ఒక వైపు కుర్రాళ్ల జట్టులో స్థానం కోసం పోటీ పడుతుంటే కీలకమైన సమయంలో విఫలమవుతూ జట్టులో స్థానం కోల్పోయే పరిస్థితులను దినేష్ కార్తిక్ కొని తెచ్చుకుంటున్నాడు.

అందరి దృష్టి ధోనీపైనే...

తొలి వన్డేలో ధోని హాఫ్ సెంచరీతో మెరిసి.. 11 నెలల తర్వాత వన్డేల్లో అర్థ శతకాన్ని సాధించి తనపై వస్తున్న విమర్శలకు జవాబు చెప్పాడు ధోనీ . భారత జట్టు నాలుగు పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన తరుణంలో ధోని బాధ్యతాయుతంగా ఆడాడు. ఈ మ్యాచ్‌లో 53. 12 స్ట్రైక్‌రేట్‌తో 96 బంతుల్లో 51 పరుగులు చేశాడు. కీలక సమయంలో ధోని ఆడినప్పటికీ అతని ఆడిన విధానం చర్చకు దారి తీసింది.



ముఖ్యంగా స్టైక్ రొటేట్ చేయడంలో ధోని విఫలమవుతుండటమే ఇందుకు కారణం. ఎక్కువ సేపు క్రీజులో నిలబడి రోహిత్ శర్మకు తోడుగా అండగా నిలిచినా భారీగా బంతులను ఎదుర్కొని స్లోగా పరుగులు చేయడంతో చివరిలో భారత్‌కు టార్గెట్ చాలా పెద్దది అయ్యింది. తొలి వన్డే ధోనీ కాస్త ధాటిగా ఆడి ఉంటే భారత్ కచ్చితంగా గెలిచేదని మాజీలు అభిప్రాయపడుతున్నారు. చాలా కాలంగా స్ట్రైక్‌ను రొటేట్ చేయడంలో విఫలమవుతూ వస్తున్న ధోని.. మరికొన్ని నెలల్లో ఆరంభం కానున్న వరల్డ్‌కప్‌లో స్థానాన్ని పదిలంగా ఉంచుకుంటాడా అనేది చర్చనీయాంశంగా మారింది. ఆ మెగా ఈవెంట్‌లో ధోని ఆడటం దాదాపు ఖాయమైనప్పటికీ, భారత్ వరుసగా ఆడబోయే సిరీస్‌లో ధోని ఆట తీరు ఎలా ఉండబోతుందనే దానిపై అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఆసీస్‌తో, వన్డే సిరీస్‌తో పాటు న్యూజిలాండ్‌తో సిరీస్‌లో ధోని తన స్ట్రైక్‌రేట్‌తో పాటు పాటు యావరేజ్‌ను మెరుగుపరుచుకుంటే అతని వరల్డ్‌కప్ స్థానానికి ఎటువంటి ఢోకా ఉండదు. ఒకవేళ ఆయా సిరీస్‌లో ధోని విఫలమైన పక్షంలో అది సెలక్టర్లకు తీవ్ర తలనొప్పిగా మారే అవకాశం కూడా లేకపోలేదు.

పటిష్టంగా బౌలింగ్ విభాగం

మహ్మద్ షమి, భువనేశ్వర్ కుమార్,ఖలీల్‌లతో కూడిన పేస్ విభాగం బలీయంగా కనిపిస్తోంది. రెండో వన్డేలో హైదరాబాదీ మహమ్మద్ సిరాజ్ కు ఖలీల్ స్థానంలో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు భువీ కూడా యార్కర్లు వేయడంపై నెట్స్‌లో తీవ్రంగా శ్రమించాడు. స్పిన్నర్లలో రవీంద్ర జడేజా పర్వాలేదు అనిపిస్తున్నాడు.

ఉత్సాహంలో ఆసీస్

తొలి వన్డేలో గెలుపుతో మంచి ఉత్సాహంలో ఆసీస్ జట్టు .బ్యాటింగ్ లోనూ. బౌలింగ్‌లోనూ అదరగొట్టి తొలి వన్డేలో భారత్‌ను కట్టడి చేసి 1–0తో సిరీస్‌లో ముందుంజలో ఉంది. బౌలింగ్‌లో మార్కస్ స్టోనీస్, జే రిచర్డ్‌సన్ లు ఆసీస్ ఈ వన్డేలో ప్రధాన ఆయుధాలుగా పరిగనిస్తోంది. బ్యాటింగ్‌లో ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్ స్కోంబ్‌లు ఫామ్‌లోకి వచ్చి రాణించడంతో ఆసీస్‌కు పెద్ద ప్లస్‌గా మారింది.

మిడిలార్డర్‌లో మాక్స్‌వెల్ మెరిస్తే ఆస్ట్రేలియాకు తిరుగుండదు. ఓపనింగ్‌లో ఆరోన్ ఫించ్ జోడి ఇచ్చే శుభారంభంపై ఆసీస్ గెలుపోటములు ఆధారపడనున్నాయి. భారత్ తో పోల్చుకుంటే ఆసీస్ జట్టు ఈ మ్యాచ్‌లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. నేటి వన్డేలో భారత్ గెలిచి సిరీస్ వేటలోకి రావాలని అభిమానులు ఎదురుచపూస్తున్నారు.



కోహ్లీ సేనపై సిరీస్ గెలవడం పెద్ద ఘనతే..అలెక్స్ కారె



అడిలైడ్: కోహ్లీసేనపై సిరీస్ గెలవడమంటే చాలా పెద్ద ఘనత సాధించినట్టేనని ఆస్ట్రేలియా వన్డే జట్టు వైస్ కెప్టెన్ అలెక్స్ కారె అన్నాడు. భవిష్యత్తులో ఇదే ఒరవడి కొనసాగిస్తామని పేర్కొన్నాడు. మూడు వన్డేల సిరీలో తొలి మ్యాచ్ గెలిచిన ఆసీస్ 1–0తో ఆధిక్యంలో ఉంది. 'టీమిండియాపై సిరీస్ గెలవడమంటే దానికెంతో విలువుంది. అలాంటి విజయాలు చూసి చాన్నాళ్లైంది. ఆసీస్ విజయాన్ని నేను చూడాలి. అందులో భాగమవ్వాలి. అలా జరిగితే మేం ఆడే ప్రతి మ్యాచ్‌కు ఓ అర్ధముంటుంది. మేం ప్రతి మ్యాచ్‌ను బాగా ఆడాలంటే ప్రపంచకప్ ముందు ఒక పెద్ద ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలి. తొలి వన్డే ఓడినా భారత్ కచ్చితంగా పుంజుకోగలదు. అందుకే రెండో వన్డే గెలవడం అత్యంత కీలకం. ఇదేమీ ప్రతీకార సిరీస్ కాదు. తొలి మ్యాచ్‌లో రోహిత్ శర్మ, ధోనీ భాగస్వామ్యం విడగొట్టడమే మా విజయానికి కారణం.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.